పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

4

# కమ్యూనిస్టు ఉద్యమం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 4

# ముందుమాట

**సి**పిఐ(ఎం) విద్యా సబ్–కమిటీ 2022 అక్టోబరులో కేంద్ర ఉపాధ్యాయ పాఠశాలను నిర్వహించింది. ఆ పాఠశాలలో నోట్సును అందించింది. అక్కడ పాల్గొన్న వారి మధ్య జరిగిన చర్చలు, సూచనలు ఆధారంగా మేము నోట్సును పరిపుష్టం చేశాము. అవసరమైన మార్పులు చేసిన అనంతరం ఈ నోట్సు ప్రచురిస్తున్నాం.

'కమ్యూనిస్టు ఉద్యమం' పాఠ్యాంశంలో మూడు ఉప–అంశాలున్నాయి. అవి : సామ్రాజ్యవాదము –సోషలిజం, స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర. వాటిని మొత్తంగానూ, విడివిడిగానూ, అన్ని స్థాయిల్లోనూ రాజకీయ విద్యను అందించేందుకు వినియోగించవచ్చు. అవి, విషయాలను బోధించే అధ్యాపకులకూ, ఇతరులు ఆ విషయాలను అవగాహన చేసుకునేందుకు సహాయపడతాయని ఆశిస్తున్నాం.

**పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ,**
**కేంద్ర కమిటీ, సిపిఐ(ఎం)**

**ఫిబ్రవరి 2023**

# సామ్రాజ్యవాదం - సోషలిజం

## ఉపోద్ఘాతం

**సా**మ్రాజ్యవాదం, సాధారణంగా అన్ని దశల్లోనూ పెట్టుబడిదారీ విధానంలో అంతర్లీనమై ఉంటుంది. సామ్రాజ్యవాదపు వలసవాద కాలంలో వలస దేశాల నుండి మిగులును సామ్రాజ్యవాద దేశాలు సంగ్రహించాయి. సంపదలను దోచుకున్నాయి. అందుకు వలసవాద పన్నుల విధానాన్ని, స్థానిక ఆర్థిక వ్యవస్థలను, ఉపయోగించుకోవడమే కాకుండా వలస దేశాల్లో పరిశ్రమలను నాశనం చేసి అవి లాభపడ్డాయి. అవసరమైన చోట దురాక్రమణ యుద్ధాలకు పాల్పడి దోచుకున్నాయి. అనంతర కాలంలో, వలసవాద కాలానికి భిన్నంగా పెట్టుబడిదారీ విధానపు మొత్తం అవసరాలకు అంటే సరుకుల కోసం బాహ్య మార్కెట్లను స్వాధీనంచేసుకోవడం, పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలను అన్వేషించటం, ముడిసరుకుల సరఫరాలను ఖాయపరచటం వంటి అవసరాలకు ఉపకరించే పాత్రను సామ్రాజ్యవాదం నిర్వహించింది. సామ్రాజ్యవాద దోపిడీని పరిరక్షించి, విస్తరించేందుకు, యుద్ధం ముఖ్యమైన పాత్రను నిర్వహించింది. పెట్టుబడి ప్రాథమిక సంచయ ప్రక్రియను తీవ్రతరం చేయడం వల్ల సామ్రాజ్యవాద కేంద్రం బయటి ప్రాంతాల్లో నిరుద్యోగం (లేబర్ రిజర్వులు) బాగా పెరిగింది. ఈ ప్రక్రియ ఈ ప్రాంతాలను సామ్రాజ్యవాద కేంద్ర సాలెగూడులో చిక్కుకునేట్లు చేసింది. ఇదంతా ఈ దశల సామ్రాజ్యవాదపు కీలక అంశంగా రూపొందింది.

**తొలి కాలం : వలసవాద దశ (1760–1870)**

యూరపులో, 15వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకూ పెట్టుబడిదారీ విధానం వేగవంతమైంది. ఈ కాలపు పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిలో విదేశీ వాణిజ్యం, వలసవాదం ముఖ్యమైన పాత్రను పోషించాయి. ఈ కాలంలో, పలు పెట్టుబడిదారీ సమాజాలు నూతనంగా ఆవిర్భవించసాగాయి. ఆ సమాజాల ప్రభుత్వాలు మార్కెట్లను, ముడి సరుకులను తమ ప్రవేశానికి అనుగుణంగా లోబరచుకునేందుకు, వలసవాద సమాజాల సంపదలను లూఠీ చేసేందుకు పూనుకున్నాయి. వలసవాద శక్తులు, వెనుకబడిన దేశాలను లొంగదీసుకునేందుకు భయానకమైన యుద్ధాలకు పాల్పడ్డాయి.

ఈ కాలంలో కూడా, పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి కొనసాగింది. దాన్ని గురించి లెనిన్ ఇలా పేర్కొన్నారు: "1789, 1871 మధ్య కాలంలో అభ్యుదయ కరమైన పెట్టుబడిదారీ విధానం కొనసాగింది. ఆ కాలంలో ఫ్యూడలిజం, నిరంకుశ ప్రభువులను కూల్చివేయడం, విదేశీ బానిసత్వం నుండి విముక్తి ప్రధాన చారిత్రక ఎజండాలుగా ఉండేవి. కానీ 1871 అనంతర పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం పండిపోయి, కుళ్లిపోయిన దశకు చేరుకుంది."

**రెండవ కాలం : సామ్రాజ్యవాద యుద్ధ దశ (1870-1945)**

రెండవ పారిశ్రామిక విప్లవం, సుమారుగా 1870 నుండి 1914 వరకూ సాగింది. ఆ కాలంలో ఆర్థిక విస్తరణ కూడా వేగంగా జరిగింది. అసెంబ్లీ లైన్ ఉత్పత్తి విధానం (ఒక సరుకును దశలవారీ గాక, ఒకే సారి ఉత్పత్తి చేసే విధానం) అమలుతో వినిమయ సరుకులు, ఆయుధాల భారీ ఉత్పత్తి సాధ్యమైంది. అపారమైన సంపదలతో కూడిన కొద్ది మంది గుత్త పెట్టుబడిదారుల వర్గం ఆవిర్భవించింది. 19వ శతాబ్దం చివరకు, గుత్త పెట్టుబడిదారీ దశ మొదలైంది. 20వ శతాబ్దపు ఆరంభానికి అది స్వయంగా సంఘటితమైంది. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో కనీవిని ఎరుగని పెట్టుబడులు, ఉత్పత్తిని, ద్రవ్య పెట్టుబడి బ్రాంచీలన్నింటినీ అదుపుచేయగల కొద్దిమంది గుత్త పెట్టుబడిదారులు అభివృద్ధిచెందారు. పరిశ్రమలు, బ్యాంకింగ్ రంగాల పెట్టుబడుల కలయికతో ఒక సమ్మేళనం ఏర్పడింది. దానితో, 'ద్రవ్య పెట్టుబడి' రూపుదాల్చింది. ఈ రెండు రంగాలనూ అదుపుచేసే ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపతుల (ఫైనాన్స్ ఓలిగార్ఛీ) ఆవిర్భావానికి దారితీసింది. రాజ్యాలు ఈ ద్రవ్య గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలను బహిరం గంగా సమర్థించడం ప్రారంభించాయి.

లెనిన్, ఈ దశకే 'సామ్రాజ్యవాదం'గా నామకరణం చేశాడు. ఆపాటికే పూర్తిగా విభజించబడిన ఒక ప్రపంచంలో, 'ఆర్థిక అధీన ప్రాంతాల' కోసం ప్రత్యర్థి ద్రవ్య పెట్టుబడుల మధ్య పోరాటం జరిగింది. అలాంటి ప్రాంతాలు తమకు నేరుగా సమకూర్చే ప్రయోజనాల కోసం మాత్రమే కాక తమ ప్రత్యర్థులను అవి కోరుకునే ప్రయోజనాలకు దూరంగా ఉంచేందుకు కూడా ఈ ఆ ప్రాంతాలపై ఆధికారం సాధించడం మొదలు పెట్టారు. అవి పెద్ద ఎత్తున యుద్ధాలకు దారితీశాయి.

అందుకే లెనిన్, 'యుద్ధం' అనేది సామ్రాజ్యవాద స్వభావంలో ఒక అంతర్గత అంశమని అభివర్ణించారు. మార్కెట్ల కోసం, సామ్రాజ్యవాదుల మధ్య నెలకొన్న అంతర్గత వైషమ్యం 1914లో మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఈ యుద్ధం ప్రపంచం పునర్వ్యవస్థీకరణకు దోహదపడింది. 1917 రష్యా విప్లవ విజయంతో పెట్టుబడిదారీ వ్యవస్థలో తొలి పగుళ్లకు దారితీసింది. కానీ బ్రిటీష్ ఆధిపత్యం చెక్కుచెదరకుండా

నిలిచింది. యుద్ధానంతరం, సామ్రాజ్యవాదుల మధ్య నూతన వివాదం మొదలైంది. అది ప్రాణాంతకమైన రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఆ యుద్ధం ముగింపు దశలో వూహించని మార్పులు సంభవించాయి. అవి: అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యుయస్ఎ) నూతన ఆధిపత్యవాద సామ్రాజ్యవాద శక్తిగా ఎదిగింది. వలసవాద వ్యవస్థ పతనమైంది. సోషలిస్టు శిబిరం ఆవిర్భవించింది.

లెనిన్ సామ్రాజ్యవాదం గురించి ఇలా పేర్కొన్నారు: "సామ్రాజ్యవాదం అనేది పెట్టుబడిదారీ విధానపు ఒక నిర్దిష్టమైన చారిత్రక దశ. దానికి మూడు నిర్ధిష్ట లక్షణాలున్నాయి: గుత్త పెట్టుబడిదారీ పెట్టుబడిదారీ వ్యవస్థ, పరాన్నభుక్కు అయిన లేక క్షీణిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ, మరణశయ్యమీద ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ."

లెనిన్, మొదటి ప్రపంచ యుద్ధం మధ్య కాలంలో, 'సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' అనే గ్రంధాన్ని రచించారు. దానిలో, సామ్రాజ్యవాదపు ఐదు ప్రాథమిక లక్షణాలను ఇలా వివరించారు : "1. ఉత్పత్తి, పెట్టుబడుల కేంద్రీకరణ ఉన్నత స్థాయికి ఎదుగుతుంది. అది గుత్త పెట్టుబడిదారీ సంస్థలను సృష్టిస్తుంది. అవి ఆర్థిక జీవితంలో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తాయి. 2. బ్యాంకు పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడితో కలసిపోయి, 'ద్రవ్య పెట్టుబడి' అవతరిస్తుంది. దాని ప్రాతిపదికపై, ప్రభుత్వాధికారం కొద్దిమంది గుత్త పెట్టుబడిదారుల చేతుల్లో వుండే రాజ్య వ్యవస్థకు దారితీస్తుంది. 3. సరుకుల ఎగుమతికి భిన్నంగా పెట్టుబడుల ఎగుమతి ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. 4. అంతార్జాతీయ గుత్త పెట్టుబడిదారీ అసోషి యేషన్‌లు ఏర్పడతాయి. అవి ప్రపంచాన్ని తమ మధ్య విభజించుకుంటాయి. 5. అతి పెద్ద పెట్టుబడిదారీ శక్తులు ప్రపంచాన్ని ప్రాంతాల వారీ విభజించేసుకుంటాయి. సామ్రాజ్యవాదం అనేది పెట్టుబడి దారీ వ్యవస్థ అభివృద్ధిలో గుత్తపెట్టుబడిదారీ సంస్థలు, ద్రవ్య పెట్టుబడి ఏర్పడే ఒక దశ. దానితో పెట్టుబడి ఎగుమతికి అధికధర ప్రాధాన్యత సమకూరుతుంది. దానితో, అంతర్జాతీయ ట్రస్టుల మధ్య ప్రపంచ విభజన ప్రారంభ మౌతుంది. భూగోళంలోని ప్రాంతాలన్నింటా, పెద్ద పెట్టుబడిదారీ శక్తుల మధ్య విభజన పూర్తవుతుంది."

లెనిన్, తన 'థీసిస్ ఆన్ ది నేషనల్ అండ్ కొలోనియల్ క్వశ్చన్'(1920) గ్రంథంలో, సోషలిస్టు రష్యా చుట్టూగల వలసవాద ప్రపంచాన్ని విశ్లేషించారు. వలసవాద దేశాల్లో పాత సామాజిక వ్యవస్థలను నాశనం చేసి వాటి స్థానంలో పెట్టుబడిదారీ అభివృద్ధిని నెలకొల్పే పాత్రను సామ్రాజ్యవాదం చేపట్టదు. దానికి బదులుగా, ఈ దేశాలను చెడగొట్టి, దోపిడీచేస్తుంది. వాటిని అంతర్జాతీయ రాజకీయ వలయంలోకి లాగుతుంది. సామ్రాజ్యవాదం తన రాజకీయ, ఆర్థిక అవసరాల కోసం బాగా

వెనుకబడిన, భూస్వామ్య, విచ్ఛిన్నకర శక్తులతో జతకడుతుంది. వలస దేశాల్లోని భూస్వామ్య వర్గాలను తన అధికార పరిధిలోని ఏజంట్లుగా మార్చుకుంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించేందుకు వారిని వినియోగించుకుంటుంది. శ్రమ శక్తిని దోపిడీచేసే, భూస్వామ్య వ్యవస్థలోని వడ్డీవ్యాపార రూపాలు కొనసాగాలని అది కోరుకుంటుంది."

పెట్టుబడిదారీ జాతి–రాజ్యాలు తమ దేశాలకు చెందిన గుత్తపెట్టుబడిదారీ కార్పొరేషన్ల ధనదాహార్తి తీర్చడం కోసం ప్రపంచాన్ని రాజకీయంగా, ఇంకా ముఖ్యంగా ఆర్థికంగా పంచుకోవడం కోసం తమలో తాము పడే ఘర్షణ యొక్క చరిత్రక ఫలితంగానే ప్రపంచాధిపత్య పోరాటం ఏర్పడిందని లెనిన్ చెప్పాడు. కాట్స్కీ 'అల్ట్రా–సామ్రాజ్యవాదం' సిద్ధాంతాన్ని లెనిన్ తిరస్కరించాడు. ఒక ప్రపంచ వ్యాపిత కార్టెల్ (పెట్టుబడిదారుల సమైక్య సంస్థ) ఏర్పడుతుందనీ, దాని వల్ల పారిశ్రామిక దేశాలన్నీ ఉమ్మడి దోపిడీ కోసం ఏకమవుతాయని కాట్స్కీ సిద్ధాంతం చెబుతుంది. ప్రపంచం ఒకవైపు "ఆర్థికపరమైన వైరుధ్యాలతోపాటు, రాజకీయ, జాతీయ పరమైన వైరుధ్యాలు, ఘర్షణలు, ఆందోళనలతో" అట్టుడుకుతుంటే సోషలిస్టు సిద్ధాంతం, ఆచరణలను అటువంటి తప్పుడు సిద్ధాంతాల ప్రాతిపదికగా రూపొందించడం అనేది సామాజిక సంస్కరణవాదానికి, అవకాశవాదానికి పరాకాష్ట అని చెబుతూ కాట్స్కీ సిద్ధాంతాన్ని లెనిన్ తిరస్కరించాడు.

**మూడవ కాలం– ప్రచ్ఛన్న యుద్ధం దశ(1945 నుండి 1990 వరకు) :**

1930వ దశకంలో తీవ్రమైన సంక్షోభం, రెండవ ప్రపంచ యుద్ధం వల్ల సంభవించిన విధ్వంసం, పలు సోషలిస్టు విప్లవాల వల్ల ఏర్పడిన నైతిక ప్రమాదాల నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థ 'సంక్షేమ రాజ్యం' విధానాన్ని ముందుకు తెచ్చింది. ఈ దశను 'రాజ్యం గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ'గా పిలుస్తున్నారు. ఈ దశలో, అమెరికా సామ్రాజ్యవాదం ఆధిపత్యం కొనసాగింది. సోషలిస్టు శిబిరం గణనీయంగా పెరిగింది. ఫలితంగా సామ్రాజ్యవాదుల మధ్య శత్రుత్వాలు మొద్దుబారాయి. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో కమ్యూనిజాన్ని నియంత్రించటమే సామ్రాజ్యవాదపు ప్రధాన ఎజండాగా మారింది. వలసపాలన అంతమైన ఫలితంగా అనేక స్వతంత్ర దేశాలు ఆవిర్భవించాయి. 'సోషలిస్టు ప్రత్యామ్నాయం' ప్రజల ముందుకు వచ్చాక, తన మనుగడ కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ కొన్ని రాయితీలను ప్రకటించాల్సివచ్చింది. వాటిలో రెండు రాయితీలు ప్రధానమైనవి: మొదటిది, వలస దేశాల్లోని ప్రజల పోరాటాల వత్తిడి ఫలితంగా వలసవాదం అంతమైంది. రెండవది, అభివృద్ధిచెందిన దేశాల్లో ఉపాధి పెంచడం

కోసం 'గిరాకీ సృష్టించడానికి' రాజ్యం జోక్యం చేసుకోవడం ప్రారంభించింది. ఇటువంటి జోక్యం గతంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఏనాడూ చూసి ఎరుగం. బాగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లో కొన్ని తరగతుల పేదలకు ఉపశమనాన్ని కల్పించేందుకు సామాజిక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టబడ్డాయి. పెట్టుబడిదారీ విధానంపట్ల పెరుగుతున్న వ్యతిరేకత నుండి బైటపడేందుకే పై పథకాలు ఉద్దేశించబడ్డాయి. అందుకే, ఈ కాలపు పెట్టుబడిదారీ విధానాన్ని 'సంక్షేమ పెట్టుబడిదారీ విధానం'గా నామకరణం చేశారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో బడా కార్పొరేషన్‌ల శక్తి బాగా పెరిగింది. అవి అధికోత్పత్తి, అధిక వినిమయం, అధిక ఉపాధికల్పనలపై కేంద్రీకరించాయి. ఈ దశలో సామూహిక వినిమయాన్ని ప్రోత్సహించేందుకు, ప్రకటనల రంగం అభివృద్ధి ఒక సాధనంగా మారింది. అందుకు అనుగుణంగా, సంస్థల్లో అతర్గతంగా గణనీయమైన ఆర్థిక ప్రణాళికలు రూపొందాయి. వాటిలో నిలకడైన ఆర్థికాభివృద్ధి జరిగింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉత్పత్తి ప్రక్రియను గణనీయంగా మార్చేసింది. ఇంధన రంగంలో బొగ్గు స్థానాన్ని ఆయిల్ ఆక్రమించింది. ఈ మార్పు కు డిజిట్ టెక్నాలజీ అభివృద్ధి బాగా తోడ్పడింది. సెమీకండక్టర్లు, మైన్‌ఫ్రేం కంప్యూటింగ్, పర్సనల్ కంప్యూటింగ్, ఇంటర్‌నెట్, రసాయన ఎరువులు, పురుగుమందులు, అధికోత్పత్తి వంగడాలు, ట్రాక్టర్లు, కంబైన్ నూర్పిడి యంత్రాలు. ఇవన్నీ ఉత్పాదక సామర్థ్యాన్ని ఉన్నత స్థాయికి చేర్చాయి. అందుకే దీన్ని, రెండవ ప్రపంచ యుద్ధానంతర ఆర్థిక పురోగమన (ఎకనమిక్ బూమ్) గాను, పెట్టుబడిదారీ విధానపు 'స్వర్ణ యుగం'గాను తరచూ అభివర్ణిస్తారు. దీనికి 'బ్రిటన్‌వుడ్స్' ఆర్థిక వ్యవస్థలో భాగమైన అంతార్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐయంయఫ్), ప్రపంచ బ్యాంకు వంటి నూతన అంతర్జాతీయ సంస్థల ఆవిర్భావం కూడా తోడయింది.

ప్రఖ్యాత అమెరికా సోషలిస్టు వ్యాఖ్యాత హారీ మెగ్‌డాఫ్ , 1960 –70లలో రాసిన తన రచనల్లో ఇలా అభిప్రాయపడ్డారు: "లెనిన్ కాలం నుండి, వలసవాదానంతర కాలపు సామ్రాజ్యవాదం నిర్మాణంలో ప్రధానమైన మార్పులు జరిగాయి. అమెరికా ఆధిపత్యం పెరిగింది. ఇవన్నీ కలసి గుత్త పెట్టుబడి మరింతగా అభివృద్ధిచెందేందుకు దోహదంచేశాయి. ఫలితంగా కొన్ని పరిణామాలు సంభవించాయి. అవి : 1. సైనిక–పారిశ్రామిక కూటమి ఏర్పడింది. 2. బహుళ జాతి కార్పొరేషన్‌లు (బహుళ జాతి బ్యాంకులతో సహా), ప్రపంచంలో అన్ని ప్రాంతాలకు చొచ్చుకు పోయాయి. 3. రాజ్య వ్యవహారాల్లో సైనిక–బహుళజాతి పరిశ్రమల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ఈ మార్పులన్నీ మొట్టమొదట అమెరికాలో

సంభవించాయి. కానీ దాని ప్రభావం ప్రత్యర్థి సామ్రాజ్యవాద శక్తుల మధ్య సంబంధాల్లో కూడా ప్రతిబింబించింది అని ఆయన పేర్కొన్నాడు.

**నాల్గవ కాలం- సామ్రాజ్యవాద నూతన దశ - అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి-నయా ఉదారవాదం:**

రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం సుమారు మూడు దశాబ్దాల తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో జిడిపి పెరుగుదల దాదాపు నిరాటంకంగా, అపూర్వంగా కొనసాగింది. కానీ, 1974-75లో పెట్టుబడిదారీ ప్రపంచం తీవ్రమైన మాంద్యాన్ని ఎదుర్కొన్నది. 1973-74 నాటి ఆయిల్ షాక్, పెట్టుబడిదారీ వ్యవస్థ పని విధానాన్ని బాగా దెబ్బతీసింది. స్వర్ణ యుగం కాలపు వేగవంతమైన అభివృద్ధి ముగిసింది. ప్రధానమైన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలన్నీ నెమ్మదించాయి. స్టాగ్‌ఫ్లేషన్, స్థబ్దత, ద్రవ్యోల్బణంవంటి సమస్యలు వ్యవస్థకు ఏక కాలంలో పలు ఇబ్బందులు కలిగించాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ వాటిని ఇంకేమాత్రమూ భరించలేదని నిరూపించాయి. పెట్టుబడి, ఒక తీవ్రమైన సంచయన (ఎక్యూమలేషన్) సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. దాని వల్ల దానికి పలు సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమస్యల పరిష్కారానికి, కినీషియన్ గిరాకీ నియంత్రణ విధానాలు సరితూగవని నిరూపితమైంది. ఈ కాలంలో, పెట్టుబడిదారీ వ్యవస్థలో మరి కొన్ని ముఖ్యమైన మార్పులు జరిగాయి. పోగుబడ్డ లాభాలతో వాణిజ్య లావాదేవీల కార్పొరేషన్‌లు భారీగా పెరిగిపోయాయి. పెన్షన్ నిధులు వగైరాల ద్వారా, శ్రామిక ప్రజల అపారమైన పొదుపు మొత్తాలు, 'ద్రవ్య వ్యవస్థ'లో పోగుబడ్డాయి. ఆయిల్ ధరలు పెరుగుదలతో, ఆయిల్ కంపెనీల యాజమాన్యాల వద్ద పెట్రో డాలర్లు పేరుకుపోయాయి. ఆ డాలర్ నిల్వలు కూడా, అంతర్జాతీయ బ్యాంకుల వ్యవస్థలోకి చేరాయి.

ద్రవ్య పెట్టుబడి భారీగా పెరగసాగింది. దానితోపాటు సమాచార, సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధిచెందింది. అంతకు ముందే ప్రారంభమైన డిజిటల్ విప్లవం ఊపందుకుంది. అది సమాజంలోని ప్రతి రంగానికీ విస్తరించింది. ఉత్పత్తి ఎలా జరగాలి? ప్రజలెలా పని చేయాలి, వారు ఎలా మాట్లాడుకోవాలి, ఎలా జీవించాలి అన్ని అన్ని అంశాలనూ అది సృజించింది. డిజిటల్ విప్లవం వచ్చిన సమయంలోనే బంగారం - డాలరు మధ్య మార్పిడి వ్యవస్థ 'విచ్ఛిన్న'మైంది. ఫలితంగా ప్రపంచ వ్యాపితంగా ద్రవ్య మార్కెట్ల అనుసంధానానికి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెరుగుదలకు అవకాశం ఏర్పడింది. జాతీయ పరిధిలోని ద్రవ్య పెట్టుబడి స్వభావం మారిపోయింది. అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రూపం ధరించింది. లెనిన్

చర్చించిన ద్రవ్య పెట్టుబడికి ఈ కొత్త రకమైన పెట్టుబడి భిన్నమైనది.

ఈ పరిస్థితుల వత్తిడితో పెట్టుబడి మరోసారి స్వేచ్ఛా మార్కెట్ విధానాల వైపు మళ్లింది. ఈ దశలోని పెట్టుబడిదారీ విధానాన్ని వర్ణించేందుకు, 'నయా–ఉదారవాద పెట్టుబడిదారీ విధానము', 'ప్రపంచీకరణ' పేర్లను వినియోగిస్తున్నారు. ప్రపంచ వ్యాపితంగా సరుకులు, పెట్టుబడుల (ద్రవ్య రూపంలోని పెట్టుబడలతో సహా) ప్రవాహాలపైగల ఆంక్షలు గణనీయంగా తొలగించబడ్డాయి. నయా–ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం ఏర్పడ్డం అన్నమాట. ద్రవ్య పెట్టుబడి కొన్ని నిర్దిష్ట దేశాల పెద్ద పెట్టుబడులతో విలీనమౌతుంది. తద్వారా ప్రపంచంలోని అన్ని దేశాలూ అనివార్యంగా నయా – ఉదారవాద విధానాలను అనుసరించేలా చేస్తుంది.

నయా–ఉదారవాద ప్రపంచీకరణను పెట్టుబడిదారీ అభివృద్ధిలో ఒక నూతన దశగా ప్రపంచవ్యాపితంగా వామపక్షాలు గుర్తిస్తున్నాయి. సామ్రాజ్యవాదం నిత్యం మార్పు చెందుతుంది. అది దాదాపు నిర్దిష్టంగా నిర్వచించబడిన యుగాల గుండా పయనిస్తుంది. సామ్రాజ్యవాదపు ప్రస్తుత దశను అర్ధం చేసుకోడానికి గతంలో అది ఎటువంటి మార్పులు చెందుతూ వచ్చిందో అర్ధం చేసుకోవడం అవసరం.

ఈ నూతన దశలో పెట్టుబడి కేంద్రీకరణ, గుత్త సంస్థల ఆధిపత్యం గతం కంటే అపారంగా పెరుగుతున్నది. ద్రవ్య పెట్టుబడి పాత్ర, పెట్టుబడి ఎగుమతులు గతం కంటె పెరిగాయి. గత శతాబ్దపు చివరి చతుర్ధ భాగంలో వేగంపుంజుకున్న ప్రపంచీకరణ, ప్రపంచఆర్థిక రంగంలోని సామ్రాజ్యవాద చట్రాలను బలహీనపంచకపోగా వివిధ దేశాలను అసమాన రీతిలో తనలో కలిపేసుకుంది. ఈ కాలంలో కొద్ది సంఖ్యలోని అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలు, కనీసం పాక్షికంగానైనా, ప్రపంచ స్థాయిలో ఉత్పత్తిని అదుపు చేసే శక్తినీ, ప్రపంచ అర్తికవ్యవస్థను ద్రవ్యీకరించే శక్తినీ, వస్తువులు, సేవల మారకాలను పెంచే శక్తినీ పెంచుకున్నాయి. కానీ అత్యధిక దేశా పరాధీనత పెరిగింది. 'సామ్రాజ్యవాద కేంద్రానికీ' వాటికీ మధ్య అంతరం బగా పెరిగింది. సూక్ష్మంగా చెప్పాలంటే, ప్రపంచీకరణ సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్నీ, సమ్రాజ్యవాదానికి బాహ్యసరిహద్దులో ఉన్న పెట్టుబడిదారీ రాజ్యాల పరాధీనతనూ పెంచింది.

నయా–ఉదారవాద ప్రపంచీకరణ విజయవంతమవుతన్న కొద్దీ అది ఇతర రాజ్యాలను ముఖ్యంగా పేద దేశాల్లోని రాజ్యాలను ప్రపంచ మార్కెట్ నిబంధనలకు బానిసలుగా మార్చేస్తున్నది. ఈ నిబంధనలు తయారు చేసేది సామ్రాజ్యవాదులే. అందువల్ల ఈ కాలంలో ఆర్థిక మాంద్యం, ద్రవ్యీకరణ, ప్రపంచ పర్యావరణ సంక్షోభం

పెరగడమే కాకుండా అవి గుత్త-పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్భాగంగా మారిపోయాయి. నయా-ఉదారవాదం వాటిని నిస్సిగ్గుగా సమర్ధిస్తోంది.

ఈ నూతన సామ్రాజ్యవాద వ్యవస్థ అయిదు రకాల గుత్తాధిపత్యాలకు దారితీస్తుందని 'క్యాపిటలిజం ఇన్ ద ఏజ్ ఆఫ్ గ్లోబలైజేషన్' అనే గ్రంథంలో అమీన్ చెప్పారు. అవి : 1.సాంకేతిక గుత్తాధిపత్యం, 2. ప్రపంచ వ్యాపిత మార్కెట్లపై ద్రవ్యపరమైన నియంత్రణ 3. భూగోళపు ప్రకృతి వనరులపై గుత్తాధిపత్యం 4. మీడియా, కమ్యూనికేషన్‌లపై గుత్తాధిపత్యం 5. సామూహిక విధ్వంసపు ఆయుధాలపై గుత్తాధిపత్యం. వీటన్నింటి వెనుక ఉండేది దిగ్గజ గుత్త సంస్థలే. 500 ప్రపంచ ప్రైవేట్ సంస్థల ఆదాయం, మొత్తం ప్రపంచ ఆదాయంలో 30 శాతంతో సమానంగా ఉంది. ఆ ఆదాయమంతా ప్రధానంగా పెట్టుబడదారీ వ్యవస్థ కేంద్రాలు, ముఖ్యమైన ద్రవ్య మార్కెట్ల ద్వారా సేకరించబడింది.

ప్రపంచంలోని అతి పెద్ద ద్రవ్యేతర సంస్థల సమాచారాన్ని పరిశీలిస్తే ఈ విషయాలు తేలాయి: 2015లో, ప్రపంచంలోని అతిపెద్ద 100 కంపెనీల మార్కెట్ విలువ, దిగువనగల 2000 కంపెనీల మార్కెట్ విలువ కంటే 7000 రెట్లు అధికంగా ఉంది. 1995లో ఆ తేడా కేవలం 31 రెట్లుగా వుండేది. ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల సమాచారం మేరకు - 2017లో, ప్రపంచంలోని పై 500ల కంపెనీల్లో 380 కంపెనీల (చైనా సంస్థలను మినహాయించి) ఆదాయం 22.83 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఆ మొత్తం ప్రపంచ స్థూల ఉత్పత్తిలో 29.3 శాతానికి సమానం. వాటి మొత్తం స్థూల లాభం గత రికార్డులను అధిగమించి 1.51 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. వాటి సగటు వార్షిక ఆదాయం 18.85 శాతం పెరిగింది. లాభాల వాటా, లాభాల రేట్లలో పెరుగుదల నయా-సామ్రాజ్యవాదం దోపిడీ స్వభావాన్ని తేటతెల్లంచేస్తుంది.

మన పార్టీ ప్రణాళిక ఇలా పేర్కొంటున్నది : "వర్తమాన పెట్టుబడిదారీ దశలో ద్రవ్య పెట్టుబడి కేంద్రీకరణ, అంతర్జాతీయాకరణలతో మునుపెన్నడూ ఎరుగని ఉచ్ఛ స్థాయికి చేరింది. ప్రపంచ వ్యాపితంగా సంచరించే ద్రవ్య పెట్టుబడి, దేశాల సార్వ భౌమత్వంపై దాడిచేస్తున్నది. తన అసాధారణ లాభాల వేటలో, ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలపై నిరాటంకమైన ప్రవేశానికి తెగబడుతున్నది. స్పెక్యులేటివ్ (చట్టా) స్వభావం గల ఈ ద్రవ్య పెట్టుబడి సేవలో తరిస్తున్న సామ్రాజ్యవాద వ్యవస్థ ఈ చట్టా పెట్టుబడి స్వేచ్ఛా గమనానికున్న అన్ని అడ్డుగోడలనూ కూల్చేస్తున్నది. భూగోళంలోని ప్రతి ప్రాంతంలోనూ ఈ పెట్టుబడికి అనుకూలమైన షరతులను విధిస్తున్నది. ఈ అన్యాయమైన వలసానంతర కాలపు విషమ షరతులను శాశ్వితంచేసేందుకు ప్రపంచ

బ్యాంకు, ఐయంయఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలు సాధనాలుగా ఉపకరిస్తున్నాయి. ఈ చట్టా ద్రవ్య పెట్టుబడి నూతనంగా ఆధిపత్యాన్ని సాధించింది. దాని ఫలితంగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో అభివృద్ధి మందగిస్తున్నది. అది, మూడవ ప్రపంచ దేశాల్లో దోపిడీని తీవ్రతరంచేస్తున్నది. ఆ దేశాలను అప్పుల విషవలయంలోకి లాగుతున్నది. అంతగా అభివృద్ధచెందని దేశాల్లో వాణిజ్యం షరతులనూ, పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తినీ, టెక్నాలజీ ప్రవేశాన్నీ, సేవా రంగాలనూ సామ్రాజ్యవాద పెట్టుబడికి అనుకూలంగా మార్చేస్తున్నది. సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని రెండుగా విభజించింది. సంపన్నమైన అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలు ఒక వైపు. అత్యధిక మానవాళి నివశించే అభివృద్ధిచెందుతున్న దేశాలు మరో వైపు. 20వ శతాబ్దపు చివరి రెండు దశాబ్దాల్లో ధనిక, పేద దేశాల మధ్య అంతరం వేగంగా పెరుగుతున్నది. సామ్రాజ్యవాద చోదిత ప్రపంచీకరణతో ఆ అంతరం మరింతగా తీవ్రతరమైంది." (పేరా 2.6).

**సామ్రాజ్యవాదము, వర్తమాన దశలోని వైరుధ్యాలు :**

అమానుషమైన ఈ దోపిడి ప్రపంచ సామాజిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నది. ఈ పూర్వరంగంలో తాజాపరచిన మన పార్టీ కార్యక్రమం (2000) ఇలా ఉద్ఘోధిస్తున్నది: " పెట్టుబడిదారీ వ్యవస్థకూ, సోషలిజానికీ మధ్యగల వైరుధ్యమే ఈ యుగపు కేంద్ర సామాజిక వైరుధ్యంగా ఉంది. ప్రపంచం మీద నయా-సరళీకరణ దాడి కారణంగా సామ్రాజ్యవాద దేశాలకూ, తృతీయ ప్రపంచ దేశాలకూ మధ్య వైరుధ్యం వేగంగా తీవ్రతరమౌతూ ముందుకు వస్తున్నది. పెట్టుబడిదారీ అభివృద్ధిలో అసమానతలు ఉన్నందున, సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు కొనసాగుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలోని వర్తమాన లక్షణాలకు అనుగుణంగా శ్రమకూ-పెట్టుబడికా మధ్య వైరుధ్యం తీవ్రతరమౌతున్నది. ఈ వైరుధ్యాలన్ని తీవ్రతరమౌతూ, ప్రపంచ పరిణామాలను ప్రభావితంచేస్తున్నాయి." (పేరా 2.8)

**సామ్రాజ్యవాదము - అభివృద్ధిచెందుతున్న దేశాలు**

ఈ పార్టీ కార్యక్రమ అవగాహనతో సాయుధమైన పార్టీ 23వ మహాసభ తీర్మానం ఇలా పేర్కొంది : "లాటిన్ అమెరికా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికాలో అమెరికా సామ్రాజ్యవాదం దూకుడుగా చొరబడుతున్నది. దానితో, సామ్రాజ్యవాదానికి, అభివృద్ధిచెందుతున్న దేశాలకు మధ్య కూడా వైరుధ్యం పెరుగుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాల రుణ భారం భరించలేని స్థాయికి చేరింది. సంపన్న దేశాలు, భూగోళతాపానికి చారిత్రక బాధ్యతను స్వీకరించేందుకు తిరస్కరిస్తున్నాయి. వాతావరణ మార్పులను నిరోధించే చర్యలకు నిధులిచ్చేందుకు నిరాకరిస్తున్నాయి." (పేరా 1.35)

**ఆర్థిక దోపిడి :**

ప్రధాన అంతర్జాతీయ సరకుల ధరలను అదుపుచేయటం ద్వారా సామ్రాజ్య వాదం భారీ లాభాలను దండుకుంటున్నది. ద్రవ్యీకరణ (ఫైనాన్షియలైజేషన్) తదితర పద్ధతులను వినియోగించి ముడిసరుకులను ఉత్పత్తిచేసే దేశాలను వత్తిడిచేస్తున్నది. వాటి ధరలు తగ్గించాలని ప్రయత్నిస్తున్నది. దాని వత్తిళ్లు, వేధింపులతో, దేశాల్లోకీ, బయటికీ పెట్టుబడి ప్రవాహాల ద్వారా ఆర్థిక బుడగలను, సంక్షోభాలను సృష్టించ వచ్చును. తద్వారా, సంబంధిత దేశాల ఆర్థిక రాజకీయ స్థిరత్వానికి దెబ్బతగులుతుంది. లేదా ఆయా దేశాలపై ఆర్థిక ఆంక్షలను విధించవచ్చును.

సామ్రాజ్యవాద దేశాలకు వాణిజ్యం, కరెన్సీ, ద్రవ్యం పైనా, మిలిటరీ స్థావరాలు, అంతర్జాతీయ సంస్థల విషయంలో ఆధిపత్య స్థానముంది. అవి, తమ పరిధికి బయట గల దేశాల వనరులు, సంపదలను నిరంతరం దోచుకునేందుకు, తమ గుత్తాధిపత్యాన్ని సంఘటితపరచుకునేందుకు, తమ స్వంత అభివృద్ధిని, సంపదలను ఖాయపరచు కునేందుకు తమ ఆధిపత్య స్థానాన్ని వినియోగిస్తాయి.

2018 లో జి7 కేంద్ర దేశాల జిడిపి 317 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఆ మొత్తం ప్రపంచ జిడిపిలో 45.5 శాతానికి సమానం.

వర్తమాన పెట్టుబడిదారీ విధానం, వలసవాద కాలానికి భిన్నమైనది. నయా-ఉదారవాద విధానం తన పరిధికి బయటగల దేశాల శ్రామికులను దోచుకునేందుకు ప్రధాన సాధనంగా మారింది. ఆ ప్రజల ఆదాయాలు ప్రతి-ద్రవ్యోల్బణానికి దారితీసేందుకు ఐదు మార్గాలున్నాయని ప్రభాత్ పట్నాయక్ ప్రకటించారు. ఒకటి, అతి పెద్ద శ్రామిక రిజర్వు సైన్యం ఉందన్న భయాన్ని వినియోగించుకుని నిజవేతనాలను తగ్గిస్తారు. దానితో ఆదాయ అసమానతలు పెరుగుతాయి. రెండు, ద్రవ్యలోటును పరిమితంచేయాలని ప్రభుత్వాలపై వత్తిడితేవటం. ఫలితంగా, పేదలకు ప్రయోజనం కల్గించే సంక్షేమ పథకాల కేటాయింపుల్లో కోతలు పడతాయి. కానీ, సంపన్నులకు పన్ను రాయితీలు కొనసాగుతాయి. మూడు, చిన్న ఉత్పత్తిదారులకు ప్రభుత్వ మద్దతును ఉపసంహరించటం ద్వారా వారి పాత్రను కుదించి వేయటం. దానికి భిన్నంగా గుత్త సంస్థలు ప్రోత్సహించబడతాయి. నాలుగు, స్థానిక చిన్న ఉత్పత్తిదారులు, వ్యాపారుల స్థానంలో బడా వ్యాపారులు, బహుళజాతి కార్పొరేషన్‌లకు పెద్ద పీట వేయటం. ఐదు, పెట్టుబడి ప్రాథమిక సంచయ ప్రక్రియను లేదా రైతాంగాన్ని వదిలేయటం. అక్కడ ఉమ్మడి లేదా ప్రభుత్వ భూమిని మాత్రమే కాదు పేద రైతాంగపు భూములను కూడా అతి తక్కువ ధరలకు పెద్ద పెట్టుబడికి కట్టపెట్టడం జరుగుతుంది.

పేద దేశాల్లో ఉత్పత్తి ప్రక్రియ (లేదా కాంట్రాక్టీకరణ ద్వారా జరిగే ఉత్పత్తి

ప్రక్రియ)కు విదేశీ బహుళ జాతి సంస్థలు, సంపన్న ఆర్థిక వ్యవస్థల్లో ఉపయోగించే అత్యంత ఆధునిక టెక్నాలజీని లేదా దానికి దాదాపు సమానస్థాయి గల టెక్నాలజీని వినియోగిస్తాయి. తద్వారా ఉత్పాదకత సంపన్న దేశాల స్థాయికి చేరుతుంది. ఫలితంగా, అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థలుగా పిలువబడుతున్న చైనా, భారత్, ఇండోనేషియా, మెక్సికోవంటి దేశాల్లో వేతనాలు అతి తక్కువ స్థాయికి పడిపోతాయి. దానితో పాటు, అమెరికాతో పోల్చినపుడు ఉత్పత్తి రంగంలో ఒక యూనిట్ శ్రమ ఖరీదు పై దేశాల్లో వరుసగా కేవలం 46, 37,62, 43 శాతానికే పరిమితమౌతుంది. అపుడు, ఉత్తరాదికి చెందిన బహుళజాతి సంస్థలకు స్థూల లాభాలు విస్తారంగా ఉప్పొంగిపోతాయి.

ఏదైనా కంపెనీ, తన ఉత్పత్తిని లేదా సేవా రంగాన్ని తక్కువ వేతనాలున్న అభివృద్ధిచెందుతున్న మార్కెట్ దేశానికి అవుట్‌సోర్సింగ్‌కు అప్పగించిందనుకుందాం. అపుడు ఆ కంపెనీ వేతన చెల్లింపుల్లో అపారంగా పొదుపు చేసుకోగల్గుతుంది. నేటికి కూడా, సమాన శ్రమ ఖరీదు, అభివృద్ధిచెందిన ప్రపంచంతో పోల్చిసపుడు చైనా, భారత్‌లలో అతి తక్కువ్వగా (తరచూ మూడింట ఒక వంతు కంటే తక్కువగా) మాత్రమే ఉంటుంది. సామ్రాజ్యవాద చరిత్ర అంతా అత్యల్ప వేతనాలు, నిరోద్యగసైన్యంపై ఆధారపడే నడిచింది. ఇలాంటి ప్రపంచ నిరుద్యోగ శ్రామిక సైన్యంలో అత్యధిక భాగం పేద దేశాల్లోనే ఉంది. అది ధనిక దేశాల్లో కూడా ఇప్పుడు పెరుగుతున్నది. సామ్రాజ్య వాద కేంద్రంలోని దేశాలు, దాని బయట ఉన్న దేశాల్లో కార్మికుల వేతనాలను అదుపుచేయగల శక్తి దానికి ఉన్నది. ప్రపంచ వ్యాపిత కార్మిక శక్తి సగటు విలువ కంటే సామ్రాజ్యవాదం బయటగల దేశాల్లో వేతనాలను తక్కువ స్థాయిలో ఉంచగల్గుతున్నది. వ్యవసాయ సంక్షోభం ద్వారా అభివృద్ధచెందుతున్న దేశాల్లో నిరుద్యోగ శ్రామిక సైన్యం పెరిగేలా సామ్రాజ్యవాదం ప్రోత్సహిస్తున్నది.

**రాజకీయ నియంత్రణ :**

పేద దేశాల ప్రజానీకంపై సామ్రాజ్యవాద త్రయం (యుయస్ఎ, యూరో పియన్ యూనియన్, జపాన్) దాడులు కొనసాగుతున్నాయి. ఆ దాడులు, రెండు రూపాల్లో సాగుతున్నాయి: ఒకటి, ఆర్థికంగా – నయా–ఉదారవాద ప్రపంచీకరణను ఒక ప్రత్యేకమైన, సుసాధ్యమైన ఆర్థిక విధానంగా అమలుచేయాలని వత్తిడి చేయటం. రెండు, రాజకీయంగా – సామ్రాజ్యవాదుల జోక్యాలను వ్యతిరేకించేవారికి వ్యతిరేకంగా, ముందస్తు యుద్ధాలతో సహా, నిరంతరం జోక్యాలుచేసుకోవటం.

లాటిన్ అమెరికాలో, అమెరికన్ సామ్రాజ్యవాదం క్యూబాకు వ్యతిరేకంగా నిరంతర దిగ్బంధాన్ని కొనసాగిస్తున్నది. ఈ దిగ్బంధానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్య సర్వసభ్య సమావేశం చేసిన 20 తీర్మానాలను అమెరికన్ సామ్రాజ్యవాదం

ఖాతరుచేయటం లేదు. వెనిజులాకు వ్యతిరేకంగా, అమెరికా ఒక ఆర్థిక దిగ్బంధాన్ని విధించింది. ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ క్షీణించసాగింది.

**సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు:**

గతంలో, జాతీయ ద్రవ్య వెట్టుబడుల మధ్య కేవలం అంతర్జాతీయ ఒప్పందాలు మాత్రమే జరిగే పరిస్థితి లాగా కాకుండా, ద్రవ్య పెట్టుబడి ఏర్పాటుకు దారితీసే వర్తమాన ప్రపంచీకరణ వల్ల సామ్రాజ్యవాదుల మధ్య స్పర్ధలు మొద్దుబారాయి.

ఈ పరివర్తన యొక్క మరో ముఖ్యమైన పర్యవసానం ఏమంటే, వర్తమాన కాలంలో ఉమ్మడి సామ్రాజ్యవాద త్రయం (యుయస్ఎ/కెనడా, ఇయు, జపాన్) రూపొందింది. ఇది చారిత్రక జాతీయ సామ్రాజ్యవాదాల (యుయస్, గ్రేట్ బ్రిటన్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ మరి కొన్నింటి) స్థానాన్ని ఆక్రమించింది. ఉమ్మడి సామ్రాజ్యవాదం, ప్రపంచాన్ని ముఖ్యంగా ఇప్పటికే తమచెప్పుచేతల్లో ఉండే, ఇంకా తమ అధీనంలోకి రాని దేశాలను తమ ఉమ్మడి యాజమాన్యం కింద వుంచాల్సిన అవసరాన్ని బూర్జువాలచేత గుర్తింప జేసింది.

అభివృద్ధి చెందిన పశ్చిమదేశాల పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల మధ్య వైరుధ్యాలు రెండవ ప్రపంచ యుద్ధానంతరం గణనీయంగా మొద్దుబారినప్పటికీ రానున్న కాలంలో అసమాన అభివృద్ధి వల్ల, నిరంతర ఘర్షణల వల్ల అవి తిరిగి తలెత్తే అవకాశం ఉంది.

వనరులతో సుసంపన్నంఐ ప్రాంతాన్ని వశపరచుకునేందుకూ, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ప్రదర్శించుకునేందుకూ ఇటీవలి ఉక్రైన్‌లో యుద్ధం జరిగింది. రష్యా, ఒక సామ్రాజ్యవాద దేశంగా వర్గీకరించబడలేదు. అయినప్పటికీ, అదొక పెద్ద పెట్టుబడిదారీ దేశం. ఇప్పుడు ప్రపంచ స్థాయిలో నిలదొక్కు కునేందుకు ప్రయత్నిస్తున్నది. తమ మధ్య ఎదుగుతున్న రష్యా నిలదొక్కుకోడానికి అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాద దేశాలు అనుమతిచ్చేందుకు సిద్ధంగా లేవు. రష్యాపై వత్తిడి పెంచేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాయి. అందులో భాగంగా, నాటో దేశాల కూటమి రష్యాను చుట్టుముట్టింది. ఉక్రైన్‌ను నాటో కూటమిలో చేర్చేందుకు జరిగే యత్నాలను తమ దేశానికి పెను ముప్పుగా రష్యా భావిస్తున్నది. మధ్య ఆసియా ప్రాంతంలోని అనేక ప్రాంతాలు గత కాలపు సోవియట్ రిపబ్లిక్‌లే. ఆ ప్రాంతంలో తన ప్రభావానికి మరో సవాలు ఎదురౌనున్నట్లు రష్యా గుర్తించింది. అందుకే నాటో యత్నాలను రష్యా ప్రతిఘటిస్తున్నది. రష్యాపై పలు సాకులతో ఆర్థిక ఆంక్షలు విధించబడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం సందర్భంగా ఈ ఆంక్షలను మరింత కఠిన తరం చేశారు. ఈ యుద్ధం

అమెరికా, ఇయు దేశాల సైనిక–పారిశ్రామిక కూటమికి లాభదాయకంగా ఉన్నట్లు రుజువౌతున్నది. ప్రత్యేకించి యుకె, జర్మనీలు గరిష్ట లబ్ధిని పొందుతున్నాయి. సామ్రాజ్యవాద గ్రూపులో చీలికలున్నట్లు కన్పించినప్పటికీ ఇపుడు ఉక్రైన్ –రష్యా, చైనా సమస్యపై అవన్నీ కప్పిపుచ్చబడుతున్నాయి.

**సామ్రాజ్యవాదము–సోషలిజము :**

సామ్రాజ్యవాదము, సోషలిజాల మధ్య వైరుధ్యంపై, పార్టీ 23వ మహాసభ ఇలా అభిప్రాయపడింది: "చైనా, అమెరికాల మధ్య వివాదం పెరుగుతున్నది. క్యూబా, ఉత్తర కొరియాలపై అమెరికా దూకుడు వైఖరి కొనసాగుతున్నది. పై అంశాలన్నీ, సామ్రాజ్యవాదానికీ, సోషలిజానికీ మధ్యగల కేంద్ర వైరుధాన్ని పదునెక్కిస్తున్నాయి." (పేరా 1.33).

ప్రపంచంలో పెరుగుతున్న చైనా ప్రభావం పట్ల, అమెరికా ఆందోళన చెందుతున్నది. చైనా ప్రభావం, తన ప్రపంచ ఆధిపత్యానికి ఒక ప్రమాదం తెస్తుందని అది భావిస్తున్నది. చైనా క్రమంగా ఒక ఆర్థిక శక్తిగా ఎదగటం వల్ల తన ప్రపంచ పెత్తనానికి సవాలు ఏర్పడుతుందని అమెరికా అభిప్రాయపడుతున్నది. చైనాను కేవలం నిరోధించేందుకే కాదు,ఒంటరిచేసేందుకు కూడా అది అనేక వరుస చర్యలు చేపట్టింది. అది చైనాను ఒక వ్యూహాత్మక ప్రత్యర్థిగా ప్రకటించింది. ఈ అమెరికా, చైనాల వివాదం, సామ్రాజ్యవాదానికీ, సోషలిజానికీ మధ్యగల కేంద్ర వైరుధ్యాన్ని ప్రభావితంచేస్తున్నది. ఈ అంశాన్ని పార్టీ 23వ మహాసభ రాజకీయ తీర్మానం ప్రస్తావించింది.

సోవియట్ యూనియన్ పతనమైన వెనువెంటనే, అమెరికా 'డిఫెన్స్ ప్లానింగ్ గైడెన్స్' (1992) శీర్షికతో ఒక సైనిక వ్యూహ పత్రాన్ని విడుదల చేసింది. ఆ పత్రం ఇలా పేర్కొంది:"తన శక్తిని సవాల్‌చేసే ఏ దేశమూ ఎదిగేందుకు అమెరికా అనుమతించదు. గత సోవియట్ యూనియన్ ప్రాంతంలోగానీ, మరెక్కడైనాగానీ ఒక నూతన ప్రత్యర్థి పునరావిర్భావాన్ని నిరోధించటమన్నది మా ప్రథమ లక్ష్యము. గతంలో సోవియట్ యూనియన్ లాగా ఒక ప్రమాదకర ప్రత్యర్థి ఏర్పడకూడదు. ఒక ప్రాంతంలో వనరులను సమీకరించుకుని ఆ ప్రాంతంలో ఆధిపత్యంవహించగలిగే స్థాయికి శత్రుదేశమైనా ఎదగడానికి అనుమతించకూడదు." ఈ అవగాహనతో, తన ఆధిపత్యాన్ని ప్రపంచంపై రుద్దేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. ఈ అవగాహనతోనే అది సోషలిస్టు చైనా ఆవిర్భావాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నదనే విషయం స్పష్టం.

ఇటీవల అమెరికా రూపొందించిన 'ఇండో –పెసిఫిక్ వ్యూహం' (2002) ఇలా ప్రకటిస్తున్నది: "ఇండో –పెసిఫిక్‌లో అమెరికా అస్తిత్వం బలంగా నాటుకునేట్లు

చేయడం ద్వారా మాత్రమే ఆ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాలు నెరవేరుతాయి. ... ముఖ్యంగా ఈ ప్రాంతంలో చైనా నుండి సవాళ్లు ఎదురవుతున్నందున అమెరికాకు సంబంధించిన సుస్థిర పాత్ర ఇక్క అవసరం. చైనా...ప్రపంచంలో అతిపెద్ద ప్రభావిత శక్తిగా ఎదగాలని కోరుకుంటున్నది. చైనా ప్రభావితం చేస్తూ, అమెరికాతో బలాబలాలు సమానం చేయడానికి ప్రయత్నిస్తున్న ప్రాంతంలో అమెరికా, దాని మిత్రపక్షాల, దాని విలువలను పంచుకునే దేశాల ప్రయోజనాలు కాపాడ్డమే అమెరికా లక్ష్యం."

సోషలిస్టు చైనాను అస్థిరపరచడానికి అమెరికా నిరంతరం ప్రయత్నిస్తూ వచ్చింది. చివరకు 1960వ దశకంలో చైనాతో దౌత్యపరమైన సంబంధాలు ఏర్పరచుకునే సందర్భంలో కూడా అమెరికా తన దుష్టబుద్ధిని దాచుకోలేదు. చైనాతో అమెరికా సంబంధాలు పెట్టుకోవడం వెనుక కూడా చైనాలో మార్పులు తేవడం, ప్రపంచ వాణిజ్య సంస్థలో దాన్ని చేర్చుకునేట్లు చేయడం అనే లక్ష్యం దాగి ఉంది.

చైనా అతర్గత వ్యవహారాల్లో జోక్యంచేసుకునేందుకు, అమెరికా తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి)కి, చైనా రాజ్యానికి వ్యతిరేకంగా అసమ్మతిని రెచ్చగొడుతున్నది. అది గతంలో టిబెట్, జిన్‌జియాంగ్‌లోను; ఇటీవల హాంకాంగ్‌లోనూ అదే పని చేసింది.

ఇపుడు చైనా ప్రపంచవ్యాపితంగా తన ఆర్థిక ఉనికిని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఆ ప్రయత్నాలు ప్రత్యేకంగా బిఆర్‌ఐ (బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్) ద్వారా కొనసాగుతున్నాయి. దానితో అమెరికా అధికంగా ఆందోళన చెందుతున్నది: "ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ (ఒబిఒఆర్) ఇతర చొరవల ద్వారా, కీలక టెక్నాలజీ రంగాల్లో తన పారిశ్రామిక ప్రమాణాలను విస్తరించేందుకు చైనా ప్రయత్నిస్తున్నది. ప్రపంచ మార్కెట్‌లలో తన కంపెనీల పరిస్థితిని బలపరచుకునేందుకు చేస్తున్న కృషిలో అది, ఒక భాగం మాత్రమే." చైనా అధ్యక్షులు, చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్ క్రింది ప్రకటనతో అమెరికా ఆందోళన చెందింది. "చైనాను ఒక సమగ్రమైన జాతీయ శక్తిగా రూపొందించడం ద్వారానూ, చైనా లక్షణాలతో కూడిన సోషలిస్టు వ్యవస్థను శక్తివంతంచేయటం ద్వారానూ దేశాన్ని ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా అభివృద్ధిచేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ తన లక్ష్యంగా నిర్ణయించింది" అని చెబుతూ ఆయన "పెట్టుబడిదారీ విధానం అనివార్యంగా పతనమవుతుంది, సోషలిజం అనివార్యంగా గెలుస్తుంది" అని ఆయన ప్రకటించారు.

చైనా నిలువరించేందుకు గాను త్రివిధ అణ్వాయుధ దళాలను (భూమి మీదనుండి, ఆకాశంలోనుండి, జలాంతర్గాముల నుండి ప్రయోగించే అణ్వాయుధాలను) ఆధునికరించేందుకు అమెరికా ప్రాధాన్యతనిస్తున్నది. చైనాను నిలువరించే ఇతర

అనుబంధ సామర్థ్యాల అభివృద్ధి పథకం కూడా ఇందులో ఒక భాగంగా ఉంది. ఈ సవాలును తాను వంటరిగా ఎదుర్కొనలేనని అమెరికా తెలుసుకున్నది. అందుకే అమెరికాతో ఏకాభిప్రాయంగల దేశాలన్నీకలసి ఒక బలమైన కూటమిని, భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు ఒక కొత్త గ్రూపుగా ఏర్పడేందుకు ఇది సరైన సమయమని ప్రకటించింది. ఇండో–పెసిఫిక్ ప్రాంతానికిచ్చిన ప్రాధాన్యత రీత్యా మాత్రమే క్వాడ్‌ను నిర్మించింది. ఈ సందర్భంగా, భారత్‌తో 2+2 మెకానిజాన్ని సంస్థాగతంచేసే ప్రతిపాదనచేయటాన్ని గమనించాలి.

చైనాను బెదిరించి, అణిచేయాలన్నది అమెరికా ఉద్దేశం. వాణిజ్య యుద్ధం మొదలుకొని వాణిజ్య, ఆర్థిక, పారిశ్రామిక, టెక్నాలజీ రంగాలన్నిటిలోనూ చైనా శక్తిని క్రమంగా బలహీనపరచాలని కోరుతున్నది. అమెరికా తన ప్రపంచాధిపత్య స్థానానికి సవాలుగా చైనా మారకుండా ఉండేలా ప్రయత్నిస్తున్నది.

అమెరికా నాడు సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా ఉపయోగించిన ప్రశ్ఛన్న యుద్ధ విధానాలనే ఇపుడు చైనాపై ప్రయోగిస్తున్నది.

అదేవిధంగా ఉత్తర కొరియాలోని సోషలిజాన్ని అంతమొందించడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. అందుకు, ఆర్థిక దిగ్బంధనానికి పాల్పడుతున్నది. జపాన్, దక్షిణ కొరియాలతో కలసి ఆ ప్రాంతంలో సైనిక విన్యాసాలను కొనసాగిస్తున్నది. తద్వారా సైనిక బెదిరింపులకు వడిగడుతున్నది. హెల్మ్‌స్– బుర్టన్ చట్టం టైటిల్ 111ని అమలులో పెట్టడం క్యూబాపై ఆర్థిక దిగ్బంధనాన్ని మరింతగా బిగిస్తున్నది. క్యూబాను, ఉగ్రవాద ప్రేరిత రాజ్యంగా ప్రకటించింది.

**సైనిక ఆధిపత్యం :**

మన పార్టీ కార్యక్రమం ఇలా చెప్తుతున్నది : "పాత తరహా వలసాధిపత్యం అంతమైనప్పటి నుండి, సామ్రాజ్యవాదం నయా–వలసవాద వ్యూహాన్ని కొనసాగిస్తున్నది. సోవియట్ యూనియన్ విచ్ఛితి అనంతరం ప్రపంచ ఆధిపత్యానికై తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అమెరికన్ సామ్రాజ్యవాదం తన ఆధిపత్యాన్ని స్థిరీకరించుకునేందుకు తన ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తిని దూకుడుగా వినియోగిస్తున్నది. సామ్రాజ్యవాద చోదిత ప్రపంచీకరణ, నాటో కూటమిని విస్తరిస్తున్నది. ప్రపంచమంతటా సైనిక జోక్యం ద్వారా తన పెత్తనాన్ని రుద్దేందుకు ప్రయత్నిస్తున్నది. (పేరా 2.7)

అమెరికా చరిత్రకారుడు క్రిష్టఫర్ కెల్లీ, బ్రిటీష్ చరిత్రకారుడు స్టువర్ట్ లేకాక్‌లు కలసి, 'అమెరికా ఇన్‌వేడ్స్: మేము ఏవిధంగా దాడిచేశాము లేదా భూమిపైన దాదాపు అన్ని దేశాల్లో సైనికంగా జోక్యం ఎలా చేసుకున్నాము?' అన్న గ్రంథాన్ని రచించారు.

ఆ గ్రంథంలో ఇలా ప్రస్తావించారు: " ఐక్యరాజ్య సమితి గుర్తించిన 193లో 84 దేశాలపై అమెరికా దాడిచేసింది. 191 దేశాల్లో అంటే 98 శాతం దేశాల్లో సైనిక జోక్యంచేసుకుంది." డేవిడ్ స్వాన్‌సన్ అనే ఆయన ఒక చురుకైన, యుద్ధ వ్యతిరేక అమెరికా కార్యకర్త. ఆయన ఇలా రాశాడు: అమెరికా సైన్యం, రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండి ఇప్పటి వరకు 2 కోట్ల మంది ప్రజలను చంపింది లేదా చంపేందుకు సాయపడింది. కనీసం- 36 ప్రభుత్వాలను కూల్చేసింది. 85 విదేశీ ఎన్నికల్లో జోక్యం చేసుకుంది. 50 మంది విదేశీ నాయకులను ఖతంచేసేందుకు ప్రయత్నించింది. 30 దేశాల ప్రజానీకంపై బాంబులు వేసింది. వియత్నాం, లావోస్, కాంబోడియాల్లో 50 లక్షల మంది మరణాలకు, ఇరాక్‌లో 2003 నుండి 10 లక్షల మందికి మించి మరణాలకు బాధ్యురాలు అమెరికానే. మూడింట రెండొంతుల ప్రపంచ దేశాల్లో, అమెరికాకు చెందిన "ప్రత్యేక సైనిక దళాలు" మొహరించి ఉన్నాయి. వాటిలో, మూడో వంతు దేశాల్లో "ప్రత్యేకేతర దళాలు" పనిచేస్తున్నాయి. అమెరికా ఇప్పటి వరకూ బాల్కన్స్, బెలారస్, బరుండీ, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, క్యూబా, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇరాన్, ఇరాక్, లెబనాన్, లిబియా, మాలీ, నికరాగువా, ఉత్తర కొరియా, సొమాలియా, సూడాన్, దక్షిణ సూడాన్, సిరియా, ఉక్రెయిన్, రష్యా, వెనిజులా, ఎమెన్, జింబాబ్వే వంటి 30కి పైగా దేశాలపై ఆంక్షలను విధించింది.

నేటి సామ్రాజ్యవాదం, తన లక్ష్య సాధనలో గతం కంటే ఎక్కువ దూకుడుగాను, ఎల్లలులేకుండా వ్యవహరిస్తున్నది. అమెరికా ఆధిపత్యం తగ్గిపోతున్న ఈ కాలంలో "డాలరు- ఆయిల్ - పెంటగాన్ (అమెరికా మిలిటరీ కేంద్ర కార్యాలయ)" వ్యవస్థ సామ్రాజ్యవాద త్రయం అండదండలతో భౌగోళిక రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం తన సైనిక, ఆర్థిక శక్తినంతటినీ వినియోగిస్తున్నది. ప్రపంచంలోని అట్టడుగు దేశాలను లొంగదీసుకోవటమే దాని లక్ష్యంగా మారింది. అది, అభివృద్ధిచెందు తున్న ఆర్థిక వ్యవస్థల మార్గంలో ఆటంకాలను సృష్టిస్తున్నది. తన ఆధిపత్య నియమాలను ఉల్లంఘిస్తున్న చిన్న రాజ్యాలన్నింటినీ కూలదోస్తున్నది.

1999లో ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ యుగోస్లేవియాపై నాటో సేనలు బాంబు దాడులు చేశాయి. అందుకు, "సార్వభౌమత్వం కన్నా మానవ హక్కులు మిన్న అన్న సూత్రాన్ని సాకుగా చూపాయి. అమెరికా 2003లో ఒక సార్వభౌమ రాజ్యమైన ఇరాక్‌పై దాడిచేసింది. అది ఇతర దేశాల అభ్యంతరాలను కూడా ఖాతరు చేయ లేదు. ఇరాక్ యుద్ధాన్ని ఐక్యరాజ్య సమితి రక్షణ మండలి గుర్తించలేదు. అమెరికా ఈ మిలిటరీ జోక్యం చేసుకోవడంలో ఏవిధమైన చట్టబద్ధ ప్రాతిపదిక లేదు. అందుకు అమెరికా, ఇరాక్ వద్ద మానవ హనానికి ఉద్దేశించిన అణ్వాయుధాలున్నాయన్న తప్పుడు

ఆరోపణలను సాకుగా చూపింది. ఇరాక్‌ను ఆక్రమించాక ఇరాక్ మానవ హననానికి ఉద్దేశించిన అణ్వాయుధాలను తయారుచేస్తున్నట్లు నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలనూ చూపలేకపోయింది. ఈ కట్టు కథల ప్రచారాల వెనుక అమెరికా లక్ష్యం సైనిక చర్యలతో ఇరాక్ ఆయిల్ నిక్షేపాలను తన అధీనంలోకి తెచ్చుకోవటమే.

నాటో విస్తరణ అనేది సామ్రాజ్యవాద "నూతన అమెరికా శతాబ్ది ప్రాజక్టు"లో ముఖ్యమైన భాగము. ప్రపంచంపై అమెరికా ఆధిపత్యాన్ని స్థిరీకరించటమే ఆ ప్రాజక్టు లక్ష్యం. నాటోతో పాటుగానే ద్వైపాక్షిక ఒప్పందాల ఆధారంగా అమెరికా మిలిటరీ కూటములు ఏర్పడ్డాయి. వాటిలో భాగమే జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, ఫిలిప్పైన్స్‌తో జరిగిన ఒప్పందాలు. అమెరికా భాగస్వామ్య దేశాల భూ భాగాలన్నింటా, దాని సైనిక స్థావరాలున్నాయి. ఈ సైనిక స్థావరాలన్నీ సామ్రాజ్యవాద సైనిక కూటమిలో ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. అమెరికా, దాని భాగస్వామ్య దేశాలు, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో, సైనిక బెదిరింపులకు పాల్పడుతున్నాయి. రెచ్చగొడుతున్నాయి. ఫలితం – అనేక బహిరంగ యుద్ధాలు, ఘర్షణలు, ప్రశ్చన్న యుద్ధాలకు దారితీశాయి. నూతన ఆయుధ పోటీని తీవ్రతరంచేశాయి.

'అంతార్జాయ చట్టము' లేక 'నియమబద్ధమైన ప్రపంచం తీరు' గురించి నాటో మాట్లాడుతుంది. సామ్రాజ్యవాద ప్రయోజనాలను సాధించేందుకు అనుగుణంగా అమెరికా, దాని మిత్రులు ఈ నిబంధనలను నిర్ణయించాయి, రూపొందించాయి. నాటో దాని వెన్నెముకవంటి అమెరికాల – ఐక్యరాజ్య సమితి నిర్ణయాలను అసలు పరిగణలోకి తీసుకోవటం లేదు. అవి, అనేక దేశాలు, ప్రాంతాల్లో జోక్యంచేసు కుంటున్నాయి. పాలస్తినాపై, పలు మార్లు ఐక్యరాజ్య సమితి ఆమోదించిన అనేక తీర్మానాలను నేరపూరితంగా ఉల్లంఘించాయి. అమెరికా, క్యూబాపై దిగ్బంధాన్ని విధించింది. ఆ చర్యను, ఐక్యరాజ్య సమితి మెజారిటీ ఓట్లుతో వ్యతిరేకించింది. అయినప్పటికీ అమెరికా ఆ దిగ్బంధాన్ని కొనసాగిస్తున్నది. అమెరికా, ఏక పక్షంగా క్యూబా నెత్తిన రుద్దిన ఆంక్షలకు దాని నాటో మిత్రదేశాలు వెనువెంటనే మద్దతుతెల్పాయి. అమెరికాకు, దాని నాటో మిత్రులకు నిబంధనలు, చట్టాలు గురించి వాస్తవంగా ఎలాంటి పట్టింపులేదని దీన్ని బట్టి స్పష్టమౌతున్నది.

**సాంస్కృతిక ఆధిపత్యము :**

సామ్రాజ్యవాదానికి అపారమైన ఆర్థిక శక్తి, సైనిక కూటముల ద్వారా ఆధిపత్యం సంక్రమిచింది. వాటితో పాటు, 'సాంస్కృతిక ఆధిపత్యం' కూడా తోడైంది. దానిలో ప్రాశ్చాత్య 'సార్వత్రిక విలువలు' భారీగావున్నాయి.

అమెరికా వద్ద పెట్టుబడులు, టెక్నాలజీ, మార్కెట్ అవకాశాలు దండిగా

ఉన్నాయి. అమెరికా, ఆ అవకాశాలను బలహీనమైన దేశాల్లో తన సంస్కృతిని ప్రవేశపెట్టేందుకు వినియోగించుకుంటున్నది. ఆ దేశాలపై తన విలువలను రుద్దేందుకు ఉద్దేశించిన సాంస్కృతిక సిద్ధాంతాలను ప్రతిపాదిస్తున్నది. అక్కడి 'సాంస్కృతిక మార్కెట్ల'ను లొంగదీసుకుంటున్నది. ఇతర దేశాల, ప్రత్యేకించి అభివృద్ధిచెందుతున్న దేశాల సమాచార వనరుల్లోకి అమెరికా విలువలు, జీవన విధానాలను ఎగుమతిచేస్తున్నది. తమ సంస్కృతిని, ప్రపంచ ప్రధాన స్రవంతి సంస్కృతిగా మార్చాలన్న లక్ష్యంతో అది పనిచేస్తుంది. సాంస్కృతిక ఆధిపత్యం లేదా సాంస్కృతిక సామ్రాజ్యవాదము ప్రాశ్చాత్య సార్వత్రిక విలువలను ఎగుమతిచేస్తాయి. శాంతియుత పరివర్తన, వర్ణ(కలర్) విప్లవం – రెంటినీ, అమలు చేస్తున్నానంటున్నది. అ కర్తవ్యాన్ని అంతర్జాతీయ ప్రజాభిప్రాయ క్షేత్రాన్ని అదుపుచేయటం ద్వారా అమలుచేస్తున్నది. సోవియట్ యూనియన్‌తో పాటు, తూర్పు యూరపులోని సోషలిస్టు సమాజాలు రద్దు కావటమనేది ఒక అరుదైన అంశము. విలువల చొరబాటు అనేది సాధారణంగా నెమ్మదైన, సుదీర్ఘ కాల, సూక్ష్మ ప్రక్రియ. ఎకడమిక్ మార్పిళ్లు, సాహిత్య ప్రక్రియలు, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాల ద్వారా ఈ విలువలను వర్ధమాన దేశాల్లోకి చొప్పిస్తారు.

అమెరికా సాంస్కృతిక ఆధిపత్యం ప్రధానంగా మీడియా సంస్థలు, విద్య, ప్రచార కార్యకలాపాలు, సాహిత్యము, కళలు, ప్రాశ్చాత్య విలువల ద్వారా వ్యక్తమౌతుంది. అమెరికా తన సినిమాలు, సంగీతము, సాహిత్యాలను ప్రపంచమంతటికీ ఎగుమతి చేస్తుంది. అది ప్రపంచంలోని 75 శాతం టెలివిజన్ కార్యక్రమాలను అదుపుచేస్తుంది. వార్నర్ మీడియా, యూనివర్సల్ పిక్చర్స్, పరామౌంట్ పిక్చర్స్, కొలంబియా పిక్చర్స్‌వంటి శక్తివంతమైన సినిమా, టివి కంపెనీలు ఆ దేశం యాజయాన్యంలో ఉన్నాయి. అవి, ప్రతి సంవత్సరం డజన్ల కొద్దీ భారీ బడ్జెట్ సినిమాలను ఉత్పత్తిచేస్తాయి. అందుకు లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులను వినియోనగిస్తారు. అమెరికా ప్రధాన స్రవంతి మీడియా, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దటంలో తన ఆధిపత్య పాత్రను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నది.

నయా–ఉదారవాదాన్ని వ్యాప్తిచేయటంలో ధర్మ సంస్థలు, మేధో మథన సంస్థలు (థింక్‌ట్యాంక్స్) కూడా ముఖ్యమైన చోదక శక్తులుగా పనిచేస్తున్నాయి. ఉదాహరణకు అమెరికాలోని ఫోర్డ్ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, మాంట్ పెలిరిన్ సొసైటీ, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ ఎంటర్‌ప్రైసెస్ వంటి సంస్థలు, నయా–ఉదారవాద విలువల వ్యాప్తిలో భాగస్వాములౌతున్నాయి. అందుకు అనుగుణంగా సెమినార్లకు, విద్యా సంస్థలకు నిధులు సమకూర్చుతున్నాయి.

భూగోళంలోని 'సైబర్ స్పేస్' రంగంలో కూడా అమెరికా సంపూర్ణమైన

ఆధిపత్య స్థానంలో ఉంది. 13 'రూట్ డొమైన్ నేమ్ సిస్టమ్ సర్వర్ల'లో తొమ్మిది, అమెరికా కార్పొరేషన్‌లు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిపార్టుమెంట్ల ప్రత్యక్ష అధీనంలో ఉన్నాయి. మరొకటి అమెరికా, 'నాన్ ప్రాఫిట్ సంస్థల' ప్రత్యక్ష అధీనంలో ఉంది. అమెరికా ఈ సర్వర్లను వినియోగించుకుని ప్రపంచ సమాచారాలను సులభంగా చోరీచేయగల్గుతున్నది. నెట్ వర్క్‌లను పనిచేయించగల్గుతున్నది. సైబర్ దాడులకు పాల్పడగల్గుతున్నది. 'ప్రిజం (పిఆర్ఐయస్‌యం)', అనేది ఒక అమెరికా నిఘా ప్రోగ్రాం. అది ప్రంచవ్యాపితంగా నెట్‌వర్క్‌ల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను పూర్తిగా అదుపుచేయగలదు. మొత్తం ప్రపంచంపై ఆధిపత్యంవహించగలదు. ఏ దేశంపైనైనా దాడిచేయగలదు. 'ఫైవ్ ఐస్' (అమెరికా, యుకె, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) అనేది ఒక గూఢచారి కూటమి. అమెరికా, ఆ కూటమిని అదుపుచేస్తుంది. తద్వారా, దేశ, విదేశాల్లో; భారీ స్థాయి మానిటరింగ్ కార్యక్రమాలను, సైబర్ ఆధిపత్యాన్ని నెరుపుతుంది.

అమెరికా కొన్ని దిగ్గజ సాఫ్ట్‌వేర్ గుత్త సంస్థలను కూడా అదుపుచేస్తున్నది. ఆ సంస్థలు ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, జి మెయిల్‌వంటి పలు సోషల్ మీడియా సంస్థల యాజమాన్యాలుగానూ, వాటి నిర్వహకులుగాను ఉన్నాయి. వాటికి ఇంటర్‌నెట్ ఖాతాదారులైన మెజారిటీ ప్రపంచ పౌరుల వ్యక్తిగత సమాచారాలు అందుబాటులో ఉన్నాయి. ఆ సమాచారాలు అమెజాన్ వంటి ఇ–కామర్స్ దిగ్గజాలు, గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్‌వంటి సాఫ్ట్‌వేర్ సంస్థలకు అందుబాటులో ఉన్నాయి. అంతేగాక వాటికి అమెరికా రక్షణ, భద్రతల సంస్థలతో సన్నిహిత సంబంధాలున్నాయి. అవి వాటితో సమాచారాలను పంపిణీచేసుకుంటాయి. సామ్రాజ్యవాదానికి డాటా, సైబర్ స్పేస్‌లపై అదుపు వుండటంతో వాటిని ఆయుధాలుగా వినియోగిస్తున్నది. హింస, యుద్ధాలను ప్రోత్సహిస్తున్న కొత్త కొత్త డిజిటల్ క్రీడలను అమ్ముకుంటున్నాయి. ఆవిధంగా విశ్రాంతిని కూడా సైనికీకరణ చేస్తున్నాయి.

అమెరికా కళారంగంలో ప్రతిష్టగలిగిన పత్రికలను కూడా అదుపుచేస్తున్నది. ఉన్నత వర్గాల విద్యా ప్రమాణాలను కూడా అమెరికానే నిర్ణయిస్తుంది. అందుకు, 2020 'క్యూయస్ వరల్డ్ యూనివర్శిటీ' ర్యాంకుల విధానమే ఉదాహరణగా నిలుస్తుంది. ఆ ర్యాంకుల కేటాయింపులో అగ్రస్థానాలన్నింటినీ అమెరికా విశ్వవిద్యాలయాలే కైవశం చేసుకుంటాయి. ఈ పరిస్థితి, మోసపూరితమైన ప్రాశ్చాత్య సార్వత్రిక విలువలను, ప్రాశ్యాత్య రాజ్యాంగపరమైన అభిప్రాయాలను, నయా–ఉదారవాద ఆర్థిక భావనలను ప్రపంచ వ్యాపితంగా ప్రచారంచేసే శక్తివంతమైన సాధనాన్ని అందిస్తున్నది.

అమెరికా, లిబరల్ ఆర్ట్స్ ఎకాడమీలపై తనకున్న అదుపును, సోషలిజం కమ్యూనిజాల పట్ల అబద్ధాలు, విద్వేషాల వ్యాప్తికి వినియోగిస్తున్నది. తద్వారా, సోషలిస్టు దేశాల ప్రగతిని విస్మరింపచేస్తున్నది. గతంలో అమెరికా సోవియట్ యూనియన్‌పై బురదచల్లేందుకు తన శక్తినంతటినీ ఉపయోగించింది. ఇపుడు దాని ప్రధాన లక్ష్యం, చైనా వైపు మళ్లింది.

"అమెరికా సంస్కృతిని ప్రపంచ నమూనా సంస్కృతిగా చూపడమనేది ఒక వ్యూహం. తన ఆధిపత్యాన్ని నిర్వహించేందుకు అమెరికా ఆ వ్యూహాన్ని అమలుచేయాలి." అని అమెరికా జాతీయ రక్షణ మాజీ సలహాదారు బ్రెజ్‌జినిస్కీ పేర్కొన్నాడు.

**సామ్రాజ్యవాద అమెరికాతో భారత్ :**

పార్టీ 23వ మహాసభ రాజకీయ తీర్మానం ఇలా ప్రకటించింది : "భారత్, ఇప్పుడు ప్రపంచంలోని అన్ని విషయాల్లోనూ అమెరికా సామ్రాజ్యవాదంపై ఆధారపడిన స్థాయికి కుదించబడింది."(2.100). ఆ తీర్మానం ఇంకా ఇలా తెల్పింది : "22వ పార్టీ మహాసభ నుండి భారత్, అమెరికాతో తన వ్యూహాత్మక సైనిక సంబంధాలను మరింతగా పటిష్టపరుచుకుంది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌లతో కూడిన చతుష్ట కూటమి – క్వాడ్, 2018లోనే సెక్రెటరీ స్థాయి సమావేశాలను ప్రారంభించింది. 2019లో దాన్ని విదేశాంగ మంత్రుల స్థాయికి పెంచారు. అనంతరం, క్వాడ్‌ను ఇండో–పెసిఫిక్ ప్రాంతంలో ఒక చురుకైన వ్యూహాత్మాక, సైనిక కూటమిగా మార్చే ప్రయత్నాల్లో అమెరికా సామ్రాజ్యవాదంతో భారత్ జట్టుకట్టింది. చైనాను ఒంటరిచేసే లక్ష్యంతోనే ఆ కూటమి ఏర్పడింది."(2.102).

భారత్–అమెరికాల భాగస్వామ్యం ఒక నమ్మకం ఆధారంగా ఏర్పడిన భాగస్వామ్యమని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు 'రక్షణ, ఇతర అంశాలతోపాటు, భాగస్వామ్య (షేర్డ్) విలువ'ల్లో ఇమిడి ఉన్నట్లు ప్రధాని పేర్కొన్నారు. అమెరికా తన కబంధ హస్తాల్లో భారత్‌ను దృఢంగా బంధించి నడిపిస్తున్నది. ఇటీవల (2022), మంత్రుల స్థాయి 2+2 సమావేశం ముగిసింది. మనంత మనమే, రాజీపడి మన రక్షణ రంగాన్ని, సార్వభౌమత్వాన్ని ఎంత అఘాతానికి నెట్టేసుకున్నామో ఆ సమావేశం స్పష్టంచేసింది. అమెరికా చేత, మన సైన్యానికి శిక్షణనిప్పించేందుకు మన ప్రభుత్వం అంగీకరించింది. అంతేకాదు అమెరికాతో మన సైనిక సమాచారాలను ప్రత్యక్షంగా కార్యాచరణ సమయంలో అమెరికా అనుసంధాన అధికారులతో పంచుకునేందుకు కూడా తలూపింది. దానర్థం ఇప్పుడు అమెరికా సైనిక అధికారులు, భాతర సైనికాధికారులతో పాటు మన దేశంలో

స్థావరం ఏర్పరచుకుంటారు.

2022 క్వాడ్ సమావేశంలో అమెరికా, భారత్‌లు ఒకటి చేసేందుకు గాను 'ది ఇండో –పెసిఫిక్ పార్టనర్‌షిప్ ఫర్ మేరీటైం డొమైన్ అవేర్‌నెస్ ఇనీషియేటివ్ (ఐపియండిఎ)ను ప్రకటించింది. ఈ పథకంలో భాగంగా రెండు దేశాల సంస్థల మధ్య సమాచార మార్పిడికి చేసుకుంటాయి. ఇందులో బాగంగా "ఇన్‌ఫర్‌మేషన్ ఫ్యూజన్ సెంటర్ - ఇండియన్ ఓషన్ రీజియన్"ను భారత్‌లో నెలకొల్పారు. హిందూమహా సముద్రంలో సంచరించే నౌకాదళ ఓడల కదలికలను అదవుపుచేసేందుకు ఈ చర్య ఉద్దేశించబడింది. ప్రత్యేకించి, భాతర మౌళిక సదుపాయాలను వినియోగించుకుని చైనా ఓడల కదలికలను కనిపెట్టడం కోసం అమెరికా దీన్ని స్థాపించింది.

క్వాడ్ దేశాల సమావేశం సందర్భంగా ఆ దేశాల మధ్య సైబర్ సమారం, ఉపగ్రహ సమాచారాల ఆదానప్రదానాలను పెంచడం కోసం ఒక అవగాహన కుదిరింది. ఇందులో నిఘా అనేది కీలకమైన అంశము. ఆ కీలకమైన సమాచార మార్పిడితో, మన స్వీయ స్వేచ్ఛల పట్ల రాజీపడవలసి వస్తుంది. అంతేకాదు మన దేశ సార్వభౌమత్వం కూడా ప్రమాదంలో పడుతుంది.

అమెరికాతో సాన్నిహిత్యం, భారత ప్రయోజనాలకు నష్టదాయకం. ఎందుకంటే దానివల్ల భారత్ తన ఇరుగుపొరుగు దేశాలలోనూ, ఇతర వర్ధమాన దేశాలలోనూ మరింతగా ఒంటరైపోతున్నది.

**సామ్రాజ్యవాదము– విచ్ఛిన్నకర శక్తులు:**

మార్కెట్, ప్రజాస్వామ్యం రెండూ పరస్పరం వ్యతిరేకమైనవి. నయా–ఉదారవాద దశలోని సామ్రాజ్యవాదం రాజకీయ రాహిత్యాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకిస్తుంది. అంతేకాదు, ఆధునిక పూర్వపు అభివృద్ధి నిరోధక శక్తుల యెదుగుదలను ప్రతిచోటా ప్రోత్సహిస్తున్నది. సామ్రాజ్యవాదం మనుగడకు, ఇవన్నీ చాలా అవసరమైన అంశాలు.

నయా–ఉదారవాదం అన్ని చోట్లా ఆధునిక పూర్వపు అభివృద్ధి నిరోధక శక్తులను ప్రోత్సహిస్తుంది, బలపరుస్తుంది. మతోన్మాద శక్తులు, ప్రపంచంలో ఎక్కడా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లేవు. ఆ శక్తులు సామ్రాజ్యవాదానికి అమూల్యమైన మిత్రులు. ఆ విషయం సామ్రాజ్యవాదులకు సువిదితమే. ఉదాహరణకు, ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలతో మనకు స్వీయ అనుభవాలున్నాయి. మరోవైపు ముస్లిం మతోన్మాద సంస్థలు నిరంతరం సౌదీ అరేబియా, పాకిస్థాన్‌ల పాలక వర్గాలను తమ వారిగా పరిగణిస్తుంటాయి. కానీ వారందరూ వర్తమాన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ

లబ్ధిదారులే.

కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ పాకిస్తాన్‌లో తాలిబాన్లను సృష్టించింది. పాలస్థినా లౌకిక, ప్రజాస్వామిక ప్రతిఘటనలను బలహీనపరిచేందుకు ఇజ్రాయిల్ మద్దతున్న 'హమాస్'ను కూడా సిఐఎ బలపరిచింది. నిరంతరం శక్తివంతమైన అమెరికా మద్దతులేకుండా; సౌదీ అరేబియా, పాకిస్థాన్‌ల నుండి ముస్లిం మతోన్మాద సంస్థలు బైటికి విస్తరించగల్గేవి కాదు.

ఇరాక్‌లోని పెట్రోలియం వనరుల దోపిడిని కొనసాగించేందుకే, అమెరికా ఆ దేశాన్ని తన అధీనంలో కొసాగించాలని కోరుకుంది. అందుకే ఈ ప్రాంతంలో షియా, సున్నీ ప్రాతిపదికపై వేర్పాటువాద సంఘర్షణలను ప్రోత్సహించింది. తన లక్ష్యం నెరవేర్చుకునేందుకుగాను ఆ దేశాన్ని ముక్కలుగా విభజించాలని పథకంపన్నింది. అందుకు అనుగుణంగా, కనీసం మూడు ముక్కలు (కుర్ద్, సున్నీ అరబ్, షియా అరబ్)గా చీల్చాలన్నది ఆరంభం నుండి అమెరికా లక్ష్యం. దాన్ని ఇజ్రాయిల్ సహకారంతో సాధించాలనుకున్నది.

ప్రపంచీకరణ, నయా-ఉదారవాద విధానాల వల్ల ప్రజలు పడే బాధలనుండి వారి దృష్టిని మళ్లించి రాజకీయంగా పబ్బం గడుపుకునేందుకు వారు అన్ని చోట్లా సమాజంలోని జాతి, మతపరమైన కలహాలను ప్రోత్సహించారు. తద్వారా, అక్కడి సామాజిక జీవనాన్ని విచ్ఛిన్నంచేసేందుకు కారకులయ్యారు. అలాంటి ధోరణి నయా - ఉదారవాదాన్ని కూల్చేయగల పరిస్థితులను కూడా సృష్టించింది. సామాజిక విచ్ఛిన్నాలు పెట్టుబడిదారీ విధానాన్ని దశలవారీగా అధిగమించగల పరిస్థితిని కూడా కల్పించింది. రోజా లగ్జంబర్గ్ ప్రవచించినట్లు - 'సోషలిం, అనాగరికాల మధ్య దేన్ని యెంచుకోవలన్న అంశంపై, ప్రజలకు స్పష్టత పెరిగింది.'

**అంతిమ ఘడియల్లో సామ్రాజ్యవాదం?**

2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత పెట్టుబడిదారీ విధానపు ఈ నయా-ఉదారవాద దశ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది.దాని నుండి బయటపడటానికి పెనుగులాడుతున్నప్పటికీ గెలవలేకపోతున్నది. అది కోలుకోవటం నెమ్మదిగా ఉంది. సంకోభం అనంతరం ఉత్పత్తి నష్టాలు నిలకడగా ఉన్నట్లు అర్థమౌతున్నది. పెట్టుబడి, ఉత్పాదకత పెరుగుదల నిదానంగా సాగుతున్నది. అవి సంక్షోభానికి ముందు కంటే ఇప్పటికీ వెనుకబడుతున్నాయి. దీనికంటే మించి, ప్రపంచం ఇపుడు (2020) మరొక మాంధ్యాన్ని ఎదుర్కొంటున్నది. ప్రపంచ ఆర్థిక

వ్యవస్థలో, ఈ పాటికే అమలౌతున్న మాంధ్యం యిక్కట్లను కోవిడ్ మహమ్మారి మరింత తీవ్రతంచేసింది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత గాఢమైన, తీవ్రమైన మాంధ్యమై ఉండవచ్చు.

నేడు మనం ఎటువంటి సామ్రాజ్యవాదం యుగంలో ఉన్నామంటే, 'సాధారణీకరించబడిన గుత్త–ద్రవ్య పెట్టుబడి, ప్రపంచీకరణ చెందిన ఉత్పాదకత, నూతన రూపాల్లో అదనపు విలువ దోపిడిలతో కూడిన సామ్రాజ్యవాద యుగంలో ఉన్నాము. ఈ యుగం ఆర్థిక, సైనిక, పర్యావరణ సవాళ్లతో కూడి ఉన్నది. మనకు వర్తమాన సామ్రాజ్యవాదం గురించి అవగాహన కల్గాలంటే దాని గత దశల కొనసాగింపును గుర్తించటం కీలకం.

వర్తమానంలో, గొప్ప శక్తుల మధ్య యుద్ధం ఒక అనివార్యమైన ప్రమాదంగా కన్పించటం లేదు. నేటి దోపిడి పూరిత, విస్తరణవాద సామ్రాజ్యవాద ప్రపంచ వ్యవస్థ అమెరికా నాయకత్వంలో కొనసాగుతున్నది. సామ్రాజ్యవాదం దానిలో అస్థిరతను సృష్టిస్తున్నది. ఇప్పుడది ఏక కాలంలో అర డజను దేశాల్లో, సైనిక జోక్యం చేసుకుంటున్నది. డ్రోన్‌లతో యుద్దం చేస్తున్నది. రానున్న దశాబ్దంలో తన సామూహిక అణ్వాయుధాలను ఆధునికరించేందుకు, 20,000 కోట్ల డాలర్లను ఖర్చు చేసేందుకు పధకం రూపొందించింది. ఆ పథకం అమలువల్ల పలు రూపాల్లో భయానకమైన సంఘర్షణలు సంభవించవచ్చు. వాతావరణ మార్పుల పట్ల ప్రదర్శితమవుతున్న నిర్లక్ష్యం నాగరికతను అస్థిరపరచవచ్చు. ప్రపంచ యుద్ద ప్రమాదాన్ని పెంచవచ్చు. భూ గ్రహం స్థాయి విచ్చితికి వేగంగా దారితీయవచ్చు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల కర్తవ్యం ప్రతిఘటించ టమే. లెనిన్ మాటల్లో : "వైరుధ్యాలు, సంఘర్షణలు, ఉపద్రవాలు– అవి ఆర్థికపరమైనవి మాత్రమే కాదు రాజకీయ, జాతీయ వగైరా స్వభావాలు గలవి కూడా కావచ్చు."– అవన్నీ మన యుగపు లక్షణాలుగా అన్వయించవచ్చు.

లెనిన్, 'సామ్రాజ్యవాదము, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' గ్రంథంలో పరివర్తనా పూరితము, మరణోన్ముఖ స్వభావంగల గుత్త పెట్టుబడిదారీ విధానం గురించి ఒక శతాబ్ద కాలానికి మించిన అనుభవాలను వివరించారు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదాల అంతంపై, శాస్త్రీయ మార్క్సిస్టు ఆలోచనాపరులు ఒక నిర్ధిష్టమైన టైంటేబుల్ నిర్ణయించ లేదు. దానిపై లెనిన్ ఇలా అభిప్రాయపడ్డారు: "సామ్రాజ్యవాదం పతనమౌతున్నది, కానీ పూర్తిగా కాదు. పెట్టుబడిదారీ విధానం మరణశయ్యపై ఉంది, కానీ అది మరణించిన పెట్టుబడదారీ విధానం కాదు." మరణోన్ముఖమైన పెట్టుబడిదారీ విధానం, తన మనుగడను సుదీర్ఘకాలం కొనసాగించగల అవకాశం ఉందని భవిష్యత్‌దర్శనం చేశాడు.

సామ్రాజ్యవాదం పతనం గురించి లెనిన్ ఇంకా ఇలా అభిప్రాయపడ్డారు: "సామ్రాజ్యవాదం పతనమౌతుందన్న ఈ ధోరణి, పెట్టుబడిదారీ విధానపు ఎదుగుదలను అడ్డుకుంటుందని నమ్మటం ఒక పొరపాటు. మొత్తం మీద పెట్టుబడిదారీ విధానం గతం కంటే వేగంగా పెరుగుతున్నది. కానీ సాధారణంగా, ఈ పెరుగుదల మరింత ఎక్కువ అసమానతలవైపు పయనిస్తుంది. ఆ అసమానతలు అత్యంత సంపన్నమైన (ఇంగ్లండ్) దేశాల పతనంలో వ్యక్తమౌతుంది."

జాన్ బెల్లమీ ఫాస్టర్ పరిశీలన ఇలా ఉంది : "పెట్టుబడిదారీ విధానం ఒక విఫలమైన వ్యవస్థ అని చెప్పటమంటే, బహుశా దాని పతనమూ, విచ్ఛిన్నమూ అనివార్యమని సూచించటమే. దాని అర్థం, అది తన ప్రారంభంలోని, చారిత్రకంగా అవసరమైన, సృజనాత్మక వ్యవస్థ దశను దాటింది. ఆ గమనం, వర్తమాన శతాబ్దంలో చారిత్రకంగా అనవసరమైనది. విధ్వంసకరమైనది కూడా." ఆ పతనాన్ని వేగవంతం చేయటమే మన ముందున్న కర్తవ్యం. మార్క్స్ బోధించినట్లు, అనంతరం లెనిన్ ఆచరణలో నిరూపించినట్లు–" పెట్టుబడిదారీ విధానం స్వయంగా కూలిపోదు. దాన్ని కూలగొట్టాలి."

# సోషలిజం

**సోషలిజం అంటే ఏమిటి?**

మార్క్సిజం దృష్టిలో సోషలిజం అంటే, మానవాళి సంపూర్ణ అభివృద్ధి కోసం, అన్ని విధాలైన దోపిడీలను, అవరోధాలను తొలగించగల సమాజాన్ని సృష్టించటమే. కారల్ మార్క్స్ పెట్టుబడి గ్రంథంలో ఇలా ఉల్లేఖించారు: "పెట్టుబడిదారీ విధానం నుండి, ఒక నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. ఆ సమాజం, పెట్టుబడి అభివృద్ధి అవసరాలను సంతృప్తిపరటం కోసమే పనిచేస్తున్న కార్మికులున్న సమాజానికి భిన్నంగా ఉండాలి. అందుకు పరిస్థితులు తల్లకిందులు కావాలి. సమాజంలోని భౌతిక సంపదలు, కార్మికుల స్వీయ అభివృద్ధి అవసరాలను తీర్చేందుకే ఉపకరించాలి." అలాంటి రివర్స్ పరిస్థితుల్లో ప్రతి వ్యక్తీ – అతడు లేక ఆమె తన స్వీయ సామర్థ్యాన్ని ఉన్నత స్థాయికి పెంచుకోగల్గాలి. అంటే దాన్నే మనం, "తన సృజనాత్మక శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా వెలికితీయగల్గటం." లేదా, "మానవ తత్వాన్ని సంపూర్ణంగా వెలికి తీయగల్గటం" లేదా, "అన్ని మానవ శక్తులూ తమ అభివృద్ధి తోనే పెట్టుబడిదారీ విధానం అంతమయ్యేలా చేయటం" అని అంటాం. అవే ఉత్పత్తి శక్తులు. ఆ శక్తులు వ్యక్తుల

సంపూర్ణ అభివృద్ధితో అవీ పెరుగుతాయి. అన్ని రకాలైన సహకార సంపదలు ఇబ్బిడి ముబ్బిడిగా అభివృద్ధి చెందుతాయి.

ఈ విషయం గురించి లెనిన్ ఇలా ప్రకటించాడు: "ఒక సోషలిస్టు సమాజంలో, శ్రామిక ప్రజానీకం తమ భవిష్యత్తుపై తామే ఆధిపత్యం కలిగి ఉంటారు. అత్యధిక ప్రజానీకం లబ్ధికోసమే ఆ సమాజం నిర్మించబడుతుంది." లెనిన్ 'ఏ గ్రేట్ బిగినింగ్' (1919) గ్రంథంలో ఇలా అభిప్రాయపడ్డారు: "సోషలిజం అనేది అద్భుతమైన సామరస్యపూర్వక ఆదర్శ పరిస్థితుల్లో రూపుదిద్దుకో జాలదు. అది పలు భిన్న రూపాల్లో వ్యక్తమయ్యే బూర్జువా వర్గపు ఉన్మాదపూరిత ప్రతిఘటనల వాస్తవ పరిస్థితుల్లోనే రూపు దిద్దుకుంటుంది." ఆయన ఇంకా ఇలా వివరించారు: "పెట్టుబడిదారీ విధానం ఘోరంగా ఓండించబడుతుంది. ఒక నూతనమైన, మరింత ఉన్నత శ్రామిక ఉత్పాదకతను సృష్టించే సోషలిజం చేతనే అది ఘోరంగా ఓడించబడుతుంది. ఇది చాలా సంక్లిష్టమైన అంశం. అందుకు సుదీర్ఘకాలం పడుతుంది. కానీ సోషలిజం ప్రారంభించబడింది. అదే ముఖ్యమైన అంశము."

**20వ శతాబ్దంలో సోషలిజం :**

1917 రష్యా విప్లవం తర్వాత సోవియట్ యూనియన్ ఒక నూతన పంథాను రగిలించింది. సోషలిజం నిర్మాణంలో సోవియట్ యూనియన్ అద్భుత ప్రగతిని సాధించింది. ఉత్పత్తి శక్తులను వేగంగా విస్తరించింది. సార్వత్రిక విద్య, వైద్య వ్యవస్థలను ఆవిష్కరించింది. ప్రజల భౌతిక, సాంస్కృతిక స్థాయిల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. అది – స్త్రీ, పురుషుల సంపూర్ణ సమానత్వాన్ని ఆవిష్కరించింది. మహిళలకు సమాన ఓటు హక్కు కల్పించింది. ప్రపంచంలోనే, ఆ హక్కులను చట్టబద్ధం చేసిన తొలి దేశంగా చరిత్రలో నిలచింది.

రష్యాలో సోషలిస్టు నిర్మాణం వార్ కమ్యూనిజంతో ప్రారంభ తరువాత నూతన ఆర్థిక విధానం(యన్ఇపి) దిశగా పయనించింది. యన్ఇపి అనేది, వార్ కమ్యూనిజం నుండి పెద్ద మార్పు తీసుకుంది. గనీయమైన వివాదాన్ని సృష్టించింది కూడా. లెనిన్‌ను రష్యాలోను, బైటా కొందరు మార్క్సిస్టులు తీవ్రంగా విమర్శించారు. అతివాదులు ('లెఫ్ట్'), లెనిన్ పెట్టుబడిదారీ విధానం దిశగా తిరోగమిస్తున్నట్లు విమర్శించారు. వారు, సోషలిజాన్ని నిర్మించేందుకు ఉత్పత్తి సమిష్టీకరణను ఉన్నత స్థాయికి చేర్చే కృషిని నిరంతరం కొనసాగించాలని కోరారు. వ్యక్తిగత ఉత్పత్తి విధానాన్ని క్రమంగా ముగించాలని వాదించారు. వ్యక్తిగత ఉత్పత్తి విధానానికున్న అవకాశాలను పెంచటాన్ని వ్యతిరేకించారు. వేరొక వైపున మితవాదులు, రష్యాలో సోషలిజం నిర్మాణానికి పరిస్థితులు పరిపక్వంగా లేవని నిర్ధారించారు. అందుకు, రష్యా ఆర్థిక

వ్యవస్థలో ఎదురౌతున్న తీవ్ర సమస్యలను ముందుకు తెచ్చారు. వారు – "మార్క్స్, ఆర్థికంగా వెనుకబడిన దేశాల్లో సోషలిజం నిర్మించగలమని ఏనాడూ చెప్పలేదు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి, పెట్టుబడిదారీ విధానం దీర్ఘకాలం కొనసాగాలి. పెట్టుబడిదారీ విధానం సంపూర్తిగా అభివృద్ధిచెందాక, అపుడు సోషలిజాన్ని పరిగణలోకి తీసుకోవచ్చు" అని వాదించారు.

లెనిన్ అతివాద, మితవాద విమర్శకులు ఇరువురికీ ఘాటైన సమాధాన మిచ్చాడు. సోషలిజం సాధనకు ఏం చేయాలో ఇరువురికీ అర్థం కాలేదని స్పష్టంచేశాడు. లెనిన్ తన అతివాద విమర్శకులకు ఇలా జవాబు చెప్పారు: "వారు ఆర్థిక వ్యవస్థలో గుణాత్మకమైన ఆధునీకరణ చేయకుండా సోషలిజం లక్ష్యాన్ని సాధించటం సాధ్యం కాదన్న అంశాన్ని గుర్తించటంలో విఫలమైనారు. ఆధునీకరించకుంటే రష్యా పేదరికపు కూపంలో మగ్గి నాశనమైపోతుంది. నూతన ఆర్థిక విధానం (యన్ఇపి) అనేది ఒక వెనుకడుగే. కానీ అది దృఢమైన సోషలిస్టు ప్రభుత్వ నాయకత్వంలో కొనసాగే తాత్కాలిక వెనుకడుగు మాత్రమే. సోషలిజం నిర్మాణమనేది నిరంతర పురోగమనాలతోటే సాధ్యం కాదు. కొన్ని సార్లు తిరోగమనాలు కూడా అనివార్యమౌతాయి. రష్యా ఆర్థిక సమస్యలను పరిష్కరించకుంటే ప్రజలే సోషలిజాన్ని కూల్చేస్తారు."

లెనిన్ తనమితవాద మిమర్శకులకు ఇలా ప్రబోధించారు: "రష్యా ఆర్థిక వ్యవస్థను అత్యంత వేగంగా ఆధునీకరించాలి. అది పెట్టుబడిదారీ పాలనలో సాధ్యంకాదు. అది కేవలం సోషలిస్టు ప్రభుత్వంతోనే సాధ్యమౌతుంది. బూర్జువాల పాలనలో, తమ లాభాలను ప్రజలకు ఉపయోగపడని విలాస వస్తువుల కోసం వినియో గిస్తారు. జూదాలువంటి వూహాగాన అంశాల వైపు మళ్లించి భారీగా వృధాచేస్తారు. సోషలిజంలో, ఎక్కువ వనరులను ఆర్థిక అభివృద్ధి వైపు మళ్లిస్తారు." తన విమర్శకులు, నిరంతరాయంగా సోషలిజం నిర్మాణానికున్న అవకాశాలు గురించి వాస్తవంగా నిరాశా వాదంతో ఉన్నారని లెనిన్ ఆరోపించాడు. తిరిగి పెట్టుబడిదారీ విధానానికి వెనుదిరిగేందుకు కేవలం సాకులు మాత్రమే వెతుకుతున్నారని విమర్శించాడు. లెనిన్, నూతన ఆర్థిక విధానాన్ని ఎంచుకున్నాడు. ఆ ఎంపిక, సోషలిజం నిర్మాణంపట్ల అభివృద్ధిచెందుతున్న అతని దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నది. అదే సమయంలో, రష్యా రాజకీయ వ్యవస్థ ప్రపంచంలోనే గొప్పగా అభివృద్ధిచెందిన దశలో ఉంది. కానీ, దాని ఆర్థిక వ్యవస్థ నిరుపేద దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. ఇది అత్యంత క్లిష్టమైన సమస్య. అంతిమంగా సోషలిజం, పెట్టుబడిదారీ విధానం కంటే ఉన్నతమైన జీవన ప్రమాణాలను కల్పించగల్గాలి. లేకుంటే ప్రజలు సోషలిజాన్నే ఎందుకు కోరుకోవాలి?

లెనిన్, 1921 జూన్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మొదటి మహాసభలో ఇలా ప్రకటించాడు: "కార్మిక వర్గ రాజ్యం నియంత్రణ, అధీనంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందటం (అంటే 'స్టేట్ కేపిటలిజం') అనేది నాశనమై ఉన్న, చిన్న వెనుకబడిన ఒక వ్యవసాయ దేశంలో ప్రయోజనకరమైనది, అవసరమైనది (బహుశా కొన్ని పరిమితుల్లో)..."

లెనిన్ తన 1919 వ్యాసంలో ఇలా ప్రవచించారు : "సిఫిలిస్ రోగం నుండి మానవాళిని కాపాడేందుకు ఒక జపాన్ శాస్త్రవేత్త ఎంతో ఓర్పుతో 605 శాంపిల్స్‌ను పరీక్షించాడు. చివరికి 606వ శాంపిల్ రోగనివారకు పనికి వస్తుందని తేలింది. ఒక రోగానికే అన్ని శాంపిల్స్‌ను అంత ఓపికతో పరిశీలిస్తే అంతకంటే క్లిష్టమైన పెట్టుబడిదారీ వ్యవస్థను జయించాలంటే ఎన్ని పరీక్షలు చేయాలి? వందలు– వేల నూతన పద్ధతులు, ఉపాయాలు, పోరాట ఆయుధాల కోసం ప్రయత్నించాలి. వాటిలో అత్యంత సరైన దాన్ని ఎంపికచేసుకోవాలి. దాన్ని సునిశితంగా పరిశీలించి మూల అంశాన్ని గుర్తించాలి. ఆ ప్రయత్నంలో అపారమైన పట్టుదల అవసరం."

పెట్టుబడిదారీ వ్యవస్థచేత చుట్టుముట్టబడిన స్థితిలోయ ఒంటరిగా ఉన్న దేశంలో సోషలిజాన్ని నిర్మించేందుకు సోవియట్ యూనియన్‌లో ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నంలో ఎంచుకున్న మార్గాలు– ప్రభుత్వ రంగంపట్ల అపార నమ్మకం; బలవంతపు (ఫోర్స్‌డ్) సమిష్టి వ్యవసాయం; ఏ మార్కెట్ సంబంధాలు లేని అత్యున్నతంగా కేంద్రీకృతమైన ప్రణాళికలు; ఇంటా, బైటా ఎదురైన విప్లవ ప్రతీఘాత దాడులకు వ్యతిరేకంగా జరిపిన స్థిరమైన పోరాటాలు వంటి అంశాలున్నాయి. గౌరవనీయులు ప్రాశ్చాత్య ఆర్థిక, చరిత్రకారుడు ఆన్‌గస్ మాడిసన్ ఇలా అభిప్రాయపడ్డారు : "1913–1965 మధ్య సోవియట్ యూనియన్ తలసరి ఆర్థికాభివృద్ధి ప్రపంచంలోనే చాలా వేగవంతంగా ఉంది.

అభివృద్ధిచెందిన దేశాలు, ముఖ్యంగా జపానుకంటే కూడా వేగంగా ఉంది. ఆ కాలంలో, జపాన్ అభివృద్ధి రేటు 400 శాతం కాగా, సోవియట్ అభివృద్ధి రేటు 440 శాతంగా ఉంది. ఒక వైపున క్రూరమైన విప్లవ ప్రతీఘాత శక్తుల దుశ్చర్యలను ప్రతిఘటిస్తూ, తుదకు ఫాసిజం ఓటమికి జరిపిన వీరోచిత పోరాటం సాగిస్తూనే సోషలిజం ఈ విజయాలన్నింటినీ సాధించింది. సోషలిజం అభివృద్ధి ప్రభావం నేపథ్యంలో అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లో తమ పౌరులకు 'సంక్షేమ రాజ్యం' పేరుతో, 'సాంఘిక సంక్షేమా'న్ని విస్తరించటం అనివార్యమైంది."

తొలి దశలో విస్తృతమైన అభివృద్ధి అనంతరం ఈ నమూనా బీటలువారటం మొదలైంది. 1992, సిపిఐ (యం) 14వ మహాసభ ఆమోదించిన సైద్ధాంతిక తీర్మానం

ఇలా ప్రస్తావించింది: "సోవియట్ యూనియన్ వ్యవస్థలోని కొన్ని వక్రీకరణలు, లోపాలు ఉద్యోగ వర్గాల కేంద్రీకృత ప్రభుత్వ పాలన (బ్యూరోక్రాటిక్ సెంట్రలిజం)కు; ప్రజాస్వామ్యం కొరవడటం; రాజ్యము, పార్టీ కలసిపోవటంవంటి లోపాలకు దారితీసింది." పెట్టుబడిదారీ విధానానికి భిన్నమైన రీతిలో – ఉత్పత్తి శక్తులను విప్లవీకరించేందుకు, సామాజిక సంబంధాల అభివృద్ధి కోసం నూతన అవకాశాల సృష్టికి రక్షణ కవచంలా శాస్త్ర, సాంకేతిక విప్లవాన్ని వినియోగించటంలో సోవియట్ యూనియన్ నమూనా విఫలమైంది. కానీ సోవియట్ నమూనా, సోషలిజానికి పరివర్తనచెందిన దేశాలన్నింటిపైనా గణనీయ మైన ప్రభావంచూపింది. ఫాసిజం నుండి విముక్తి పొందిన తూర్పు యూరపు దేశాలు సోవియట్ నమూనాను అనుసరించాయి. ఫలితంగా ఆ రాజ్యాలు కూడా, కేంద్రీకృత ప్రభుత్వ పాలనకు ఆలవాలమై ఘోరంగా దెబ్బతిన్నాయి. ప్రజల నుండి దూరమైనాయి.

ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీలు, పెట్టుబడిదారీ విధానపు సార్వత్రిక సంక్షోభ భావనను యధాలాపంగా మాత్రమే అర్ధంచేసుకున్నాయి. పెట్టుబడిదారీ విధానం పతనం చారిత్రకంగా అనివార్యమన్న పరిణామవాద దృక్పథాన్ని మరింత సాగదీశాయి. ఆ పరిణామం మూలమలుపుకు చేరేందుకు అకాశమున్నట్లు అంచనావేశాయి. ఇది ఒక తీవ్రమైన లోపం. ఆ లోపం, పెట్టుబడిదారీ దేశాల్లో జరుగుతున్న నిర్ధిష్ట మార్పులను, సోషలిజం నుండి ఎదురౌతున్న సవాళ్లను అడ్డుకునేందుకు పెట్టుబడిదారీ దేశాలు అవలంభించే కొన్ని వైఖరులను శాస్త్రీయంగా అధ్యయనం చేయకుండా ఆటంకపరచింది. ఈ అంశాలన్నీ కలసి, సోవియట్ యూనియన్‌తోపాటు, తూర్పు యూరపులోని సోషలిస్టు రాజ్యాలన్నీ కుప్పకూలేందుకు దారితీసింది. దానితో ప్రపంచంలోని వర్గ శక్తుల బలాబలాలు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారాయి.

**మనుగడలోని సోషలిజం :**

సోవియట్ యూనియన్ పతనానంతరం, అంతర్జాతీయ శక్తుల బలాబలాలు సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారాయి. దానితో, తమ దేశాల్లో సోషలిజాన్ని సంరక్షించుకోవటంలోను, సోషలిస్టు నిర్మాణాన్ని ముందుకు నడపడంలో కూడా మనుగడలోని సోషలిస్టు రాజ్యాలు ఎక్కువ సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. ఆ రాజ్యాలు, ఈ సవాళ్లను అధిగమించి గమ్యంచేరేందుకు 'ఆర్థిక సంస్కరణ'ల దిశలో నడుస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాలను ప్రపంచీకరణ, సరళీకరణలు తమ సుడిగుండంలోకి లాగుతున్నాయి. ఈ సంస్కరణలు, దేశాల ఆర్థిక వ్యవస్థలను అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానంచేయటంపై ఆధారపడి ఉన్నాయి. ఈ దేశాలు, ఆ సవాళ్లను

ఎదుర్కొనేందుకు అనుసరిస్తున్న పద్ధతి, ఈ పరివర్తనా కాలంలో ఒక సమస్యగా మారింది. ఆ సమస్యపై మన నిరంతర పరిశీలన అవసరముంది. పార్టీ 20వ మహాసభ, 'కొన్ని సైద్ధాంతిక సమస్యలపై' తీర్మానం ఇలా పేర్కొంది: "ఇక్కడ ఉత్పన్నమౌతున్న ప్రధాన ప్రశ్న ఏమంటే: ఈ సంస్కరణల క్రమం, ఒక దోపిడీపూరిత పెట్టుబడిదారీ వర్గం ఆవిర్భావానికి దారితీస్తుందా? ఆ వర్గం భవిష్యత్‌లో, ప్రతీఘాత విప్లవానికి నాయకత్వవహించి, జయప్రదంచేసే శక్తిని పెంచుకోగలదా? నేటి ప్రపంచ పరిస్థితుల్లో, వర్తమాన సంస్కరణల మూలంగా శక్తుల బలాబలాల్లో జరుగుతున్న మార్పుల క్రమం, సోషలిజం సంఘటితపడేందుకు, మరింత బలపడేందుకు దారితీస్తుందా?"

ఈ దేశాలన్నీ తమ దేశాల్లో తాము సాధించిన ఆర్థిక పురోగతిని, క్రమబద్ధంగా సమీక్షిస్తున్నాయి. ఉత్పత్తి శక్తులను అభివృద్ధిచేసేందుకు నిరంతరంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజల ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యాలను ప్రాధాన్యతా క్రమంలో సమకూర్చేందుకు కూడా హామీనిస్తున్నాయి. దానికంటే మిన్నగా, ప్రజల పెరుగుతున్న అకాంక్షలను చేరుకునేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి. చైనా, వియత్నాం అనుభవాలు, తమతమ దేశాల్లో పేదరికాన్ని తగ్గించటంలో ఎక్కువ భాగం జయప్రదమైనట్లు తెల్పుతున్నాయి. 2021 నాటికి తన మొదటి శతాబ్దపు లక్ష్యమైన నిష్టదారిద్ర్యాన్ని నిర్మూలించటంలో జయప్రదమైనట్లు చైనా అనుప్రకటించింది

## 21వ శతాబ్దపు సోషలిజం:

ఈ దేశాలన్నీ, తమతమ దేశాల్లో సాధించిన ఆర్థిక ప్రగతిని క్రమపద్ధతితో సమీక్షిస్తున్నాయి. తమ ఉత్పత్తి శక్తులను అభివృద్ధిచేసేందుకు స్థిరంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రజల కనీస అవసరలైన తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యాలను ప్రాధాన్యతగల అంశాలుగా ప్రకటించాయి. వాటిని సమకూర్చేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి. ప్రజల్లో పెరుగుతున్న అకాంక్షలను సమకూర్చేందుకు కూడా ప్రయత్నిస్తున్నాయి. తమ దేశాల్లో పేదరికాన్ని అరికట్టడంలో ఎక్కువ భాగం, జయప్రదమైనట్లు చైనా, వియత్నాం అనుభవాలు తెలియజేస్తున్నాయి. 2021 నాటికి సమగ్ర పేదరికాన్ని నిర్మూలించే తొలి శతాబ్ది లక్ష్యాన్ని తాము చేరుకున్నట్లు చైనా ప్రకటించింది. 2049 నాటికి తమ దేశాన్ని, ఒక ఆధునికమైన, అభివృద్ధిచెందిన, పొందికైన సమాజంగా తీర్చిదిద్దాలన్న ద్వితీయ శతాబ్ది లక్ష్యం దిశగా పురోగమిస్తున్నట్లు కూడా చైనా ప్రకటించింది. క్యూబా,పలు ఆటంకాలు ఎదురౌతున్నప్పటికీ అవసరమైన వారందరికీ ఉచిత విద్య, వైద్యాలను సమకూర్చేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నది. అదేవిధంగా ఉత్తర కొరియా, లావోస్‌లు కూడా తమ వెనుకబాటుతనం నుండి బైటపడి,

సోషలిస్టు నిర్మాణం దిశగా పురోగమించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాయి.

ఉనికిలోవున్న సోషలిస్టు దేశాలు – చైనా, వియత్నాం, క్యూబా, ఉత్తర కొరియా, లావోస్‌లు తమ సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆత్మవిమర్శనా పూర్వకంగా గుర్తించాయి. ఆర్థిక వెనుకబాటు, ప్రాంతీయ తేడాలు, ఆదాయ అసమానతలు, అవినీతి తదితర సమస్యలను గమనించాయి. తమ దేశాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న గత కాలపు కొన్ని సమస్యలను గుర్తించాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు కృషి కొనసాగుతున్నది. అందుకు, పార్టీని, ప్రజలతో దాని సంబంధాలను పటిష్ట పరచుకునేందుకు; వాటన్నింటిని కలిపి సోషలిస్టు వ్యవస్థను పరిరక్షించేందుకు అవసరమైన కృషి కొనసాగుతున్నది.

20వ శతాబ్ధపు సోషలిజం అనుభవాలును క్షుణ్ణంగా పరిశీలించాలి. తద్వారా మాత్రమే మనం, 21వ శతాబ్దపు సోషలిజం గురించి ఒక వినూత్నమైన, మరింత అర్థవంతమైన అభిప్రాయానికి రాగలం. అందుకు అక్టోబరు విప్లవానికి ఆధారభూతమైన కొన్ని మానసిక ప్రేరణలను, కొన్ని విలువైన విజయాలను ముందుకు తీసుకెళ్లాలి. అదే సమయంలో ఉనికిలోని 20వ శతాబ్దపు సోషలిజంలో స్పష్టంగా కన్పించిన కొన్ని వ్యతిరేక అంశాలను, అపార్ధాలకు అవకాశమిచ్చిన భాగాలను మనం తొలగించాలి.

21వ శతాబ్దంలో సోషలిజం కోసం పోరాటం అంటే, ఒక మనిషిని మరొక మనిషి, ఒక జాతిని మరొక జాతి దోపిడీచేసేందుకు అవకాశంలేని ఒక వ్యవస్థను తప్పక నిర్మించేందుకు చేసే పోరాటంగానే ఉండితీరాలి. అలాంటి వ్యవస్థ, ప్రజల ప్రజాతంత్ర హక్కులను, పౌర హక్కులను మరింతగా పటిష్టంచేయటంపై ఆధారపడి ఉండాలి. అలాంటి వ్యవస్థ ఉన్నత స్థాయి ఉత్పాదకతను, ఉత్పత్తి శక్తులను సాధించటంలో పెట్టుబడిదారీ విధానంపై ఔన్నత్యాన్ని సాధించాలి. ఆ పరివర్తనా క్రమం, “ప్రతి ఒక్కరూ తన శక్తి కొద్దీ పని – తన సామర్థ్యం కొద్దీ అనుభవం” అనబడే పరివర్తనా సూత్రంపై ఆధారపడాలి. సామాజిక జీవనంలోని –ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విభాగాలన్నింటా ప్రజారాసుల భాగస్వామ్యాన్ని పెంచాలి. పై విధమైన ఔన్నత్యాన్ని తద్వారా మాత్రమే నిర్మించేందుకు సాధ్యమౌతుంది.

లెనిన్ తన ‘రాజ్యము, విప్లవము’ గ్రంథంలో ఇలా స్పష్టీకరించాడు: “బూర్జువా రాజ్యాల రూపాలు అత్యంత భిన్నంగా ఉంటాయి. కానీ వాటి సారాంశం మాత్రం ఒక్కటే. ఈ రాజ్యాలన్నింటి రూపాలు ఏవైనా కావచ్చు, ఆ రాజ్యాలన్నీ, అంతిమ విశ్లేషణలో ‘బూర్జువా వర్గపు నియంతృత్వాలు’గానే ఉంటాయి. పెట్టుబడిదారీ విధానం నుండి కమ్యూనిజానికి పరివర్తనచెందే క్రమంలో, అనివార్యంగా ఒక గొప్ప సంవృద్ధిని,

పలు రకాలైన రాజకీయ రూపాలను తప్పక అందిస్తుంది. కానీ వాటి సారంశమంతా అనివార్యంగా ఒక్కటే. అదే – "శ్రామిక వర్గ నియంతృత్వము." అంటే దానర్థం– ఆ సూత్రం, 21వ శతాబ్దంలో సోషలిజం నిర్మించటంలో మన కృషికి ఒక చోదక ఆధార సూత్రంగా నిలుస్తుంది.

21వ శతాబ్దపు సోషలిజం ఎలా ఉంటుందో తెలియజెప్పే కొన్ని రూపాలు:

1. **శ్రామిక వర్గ నియంతృత్వము :** అది, ఒక వర్గ సమాజం నుండి వర్గరహిత సమాజంగా పరివర్తనచెందే క్రమంలో రాజ్యం యొక్క ఒక లక్షణం. ఒక అల్ప సంఖ్యాకులైన పూర్వ కాలపు దోపిడీ వర్గాలపై అత్యధిక మెజారిటీ శ్రామిక ప్రజల నియంతృత్వము. అది బూర్జువా నియంతృత్వానికి పూర్తిగా భిన్నమైనది. ఈ బూర్జువా నియంతృత్వం, అత్యధిక మెజారిటీ శ్రామికులపై, మైనారిటీ దోపిడీదారుల నియం తృత్వం.
2. ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయటమనేది, సోషలిజం మౌళిక సూత్రం. ఉత్పత్తి సాధనాలపై పెట్టుబడిదారీ యాజమాన్య రూపాలను, సామజిక యాజమాన్య రూపంలోకి మార్చాలి. 21వ శతాబ్దంలో ప్రజా యాజమాన్యానికి భిన్నమైన రూపాలుం టాయి. రాజ్యం యాజమాన్యమనేది వాటిలో ఒకటి మాత్రమే.
3. సరుకుల ఉత్పత్తి, మార్కెట్ అనేవి సోషలిజానికి వ్యతిరేకమైనవి కాదు. సోషలిజం కాలంలో, మార్కెట్లు ఒక విధమైన పాత్రను పోషించాలి. వాటిని రాజ్యం అదుపు చేస్తుంది. పెద్ద పెట్టుబడి అభివృద్ధి కాకుండా రాజ్యం పర్యవేక్షిస్తుంది.
4. ప్రణాళికాబద్ధ ఆర్థికవ్యవస్థ, సోషలిజం యొక్క మరొక ప్రాథమిక సూత్రము. కానీ, ప్రణాళికాబద్దం అంటే– ఆర్థికపరమైన నిర్ణయాన్నింటినీ చేసే పనిని కేంద్రీకరిం చటం కాదు. ఆర్థికపరమైన నిర్ణయాలు చేయటంలోనూ, ఆర్థిక సంస్థల నిర్వహణలోనూ ప్రణాళికలను వికేంద్రీకరించాలి.
5. ప్రజాస్వామ్యం అనేది సోషలిజపు జీవనాధారము. సోషలిజపు రాజకీయ వ్యవస్థలో ప్రజా రాసుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు హామీనివ్వాలి. సోషలిజంలో బహుళ పార్టీల వ్యవస్థ, శాశ్వితమైన ఏక పార్టీ పాలనలో అపార్థం కల్గించే అవకాశాలను నిరోధిస్తుంది.
6. సోషలిస్టు చట్రం లోపల భిన్నాభిప్రాయం వ్యక్తంచేసే హక్కును తప్పక గుర్తించాలి. అలాచేయటంలో, రాజ్యం యొక్క వర్గ లక్షణాన్నీ, పార్టీ మార్గదర్శక పాత్రనూ

వదులుకోరాదు.

7. రాజ్యము, పాలక పార్టీల మధ్య ఎల్లలను సంస్థాగతం చేయాలి. 21వ శతాబ్దపు సోషలిజాన్ని కూడా పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాద ప్రతికూల పరిస్థితుల మధ్య నిర్మించగల్గాలి. ఇది తప్పించుకునేందుకు వీలులేని వాస్తవం. అందుకోసం, సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని పల్చబరచరాదు. అందుకు భిన్నంగా, సోషలిస్టు చైతన్యాన్ని పెంచేందుకు, నూతన సమాజ పరిరక్షణ కోసం ప్రజలను సమీకరించేందుకు సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని ఒక సాధనంగా వినియోగించుకోగల్గాలి.
8. 21వ శతాబ్దంలో మార్క్సిజం సిద్ధాంతం, ఆచరణలకు జండర్ సమస్య వర్గ దోపిడీ, సామాజిక పీడన..వంటి ప్రధాన స్రవంతి సమస్యలతో కలపాల్సిన అవసరం ఏర్పడింది. పితృస్వామ్యం, వర్గ ఆధారిత దోపిడి నుండి మహిళా విముక్తిని సాధించాలి. అందుకు సోషలిజం ఆ సమస్యను గుర్తించాలి. పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి.
9. ప్రపంచం పర్యావరణ సంక్షోభం, భూగోళ వేడిమి సమస్యలను ఎదుర్కొంటున్నది. అవి మన భూ గ్రహంపై జీవులకూ, ప్రకృతికీ ప్రమాదంగా మారాయి. సోషలిస్టు ప్రాజక్టు ఎజండాలో పర్యావరణ పరిరక్షణకు జరిగే పోరాటాన్ని, పర్యావరణ క్షీణత సమస్యలపై స్పందించటాన్ని న్యాయబద్ధమైన అంశాలుగా పరిగణించాలి.

కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఏంగెల్స్‌లు ఇలా ప్రకటించార : "కార్మికవర్గ విప్లవంలో తొలి అడుగు, కార్మిక వర్గాన్ని పాలక వర్గం స్థాయికి పెంచటమే. ప్రజాస్వామ్యం కోసం జరిగే యుద్ధంలో గెలిచేందుకు బూర్జువాల నుండి పెట్టుబడులన్నింటినీ దశలవారీ లాగేసుకునేందుకు కార్మికవర్గం తమ రాజకీయ ఔన్నత్యాన్ని వినియోగించాలి."

21వ శతాబ్దపు సోషలిజం, 'నూతన మానవుణ్ణి' సృష్టించాలని ప్రఖ్యాత విప్లవకారుడు చెగువేరా ప్రభోధించేవారు. మారుతున్న పరిస్థితుల్లో మార్పులతోపాటు, ఆ క్రమంలో మానవులు కూడా తమకుతాము మార్చుకుంటారని కారల్ మార్క్స్ ఉద్ఘో దించారు. దాన్నే, ఆయన 'విప్లవ ఆచరణ'గా అభివర్ణించారు.

**సోషలిస్టు భారత్ దిశగా :**

నయా–ఉదారవాద పెట్టుబడిదారీ విధానం, ఇతర విచ్ఛిన్నకర సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం జరుగుతున్నది. ఆ పోరాటంలో, సోషలిజానికి

ప్రత్యామ్నాయ విజన్ ప్రదర్శించటమే భారత పరిస్థితుల్లో ఒక ముఖ్యమైన భాగము. భారత్‌లో సోషలిజం అంటే, ప్రజలందరికీ ఆహార భద్రత, సంపూర్ణ ఉపాధి, సార్వత్రిక విద్య, వైద్యం, ఇళ్లు అందటమే. దానర్థం కార్మికులు, కర్షకులు, అట్టడుగు తరగతుల వారి జీవన పరిస్థితులను గణనీయంగా అభివృద్ధిచేయాలి. తద్వారా ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధికారతను సమకూర్చాలి.

ఈ ముఖ్యమైన అంశం గురించి కలకత్తా నిర్మాణ ప్లీనం (2015) ఇలా అభిప్రాయపడింది: "భారత దేశ పరిస్థితుల్లో సోషలిజం భవిష్యత్ దృశ్యం (విజన్) ఆ విధమైన సోషలిస్టు సమాజాన్ని సాధించే క్రమాన్ని ఊహాజనితంగానైనా చెప్పగల్గాలి. వర్తమాన భారత పరిస్థితుల్లో యువతరాన్ని అకర్షించేందుకు సోషలిజం భవిష్యత్ దృశ్యాన్ని ప్రచారం చేయటం అత్యంత ముఖ్యమైన అంశము."

ఒక ప్రత్యామ్నాయ మార్గం సూచించబడే సోషలిస్టు మార్గం నయా-ఉదార వాద పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదాలపై పూర్తిస్థాయిలో పోరాడ్డం ఎంతో అవసరమైన అంశం. అది లేకుంటే నయా-ఉదారవాద పెట్టుబడిదారీ విధానం స్థానంలో సంస్కరించబడిన పెట్టుబడిదారీ వ్యవస్థ తీసుకురావాలన్న సంస్కరణవాద అవగాహనకు దారితీస్తుంది. పెట్టుబడిదారీ విధానాన్ని సమూలంగా అంతంచేసి, దాని స్థానంలో ఒక నూతన సమాజాన్ని స్థాపించేందుకు మనం కృషిచేయాలి.

లెనిన్ ప్రవచించినట్లు, బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని సోషలిస్టు విప్లవం నుండి విడదీసే 'చైనా గోడ' అనేది ఏదీ లేదు. అది భారతదేశం సోషలిజానికి పరివర్తన చెందేందుకు ఒక ప్రారంభ సూచికగా నిలుస్తుంది. ఫలితంగా ఒక నూతన రాజ్య చట్రం ఏర్పడుతుంది. అందుకు కార్మిక వర్గం, దాని మిత్రులైన గ్రామీణ రైతాంగం, ఇతర తరగతుల్లోని శ్రామిక ప్రజలు నాయకత్వం వహిస్తారు. ఈ దశలో సోషలిజం నిర్మాణానికి ఒక కచ్చితమైన నమూనా పథకాన్ని రూపొందించటం సాధ్యం కాదు. అయినప్పటికీ భారతదేశ సోషలిజం ఆకృతులను అక్షరబద్ధంచేయటం సాధ్యమే. ఆ ఆకృతులు భారత్‌లో పెట్టుబడిదారీ అభివృద్ధిపై మన విశ్లేషణ, ఉత్పత్తి శక్తుల స్థాయి, వర్గ సంబంధాల స్వభావంపైన ఆధారపడి ఉంటాయి. ఇక్కడ 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలో రూపొందిన సామాజిక సంబంధాలు, రాజకీయ వ్యవస్థ నమూనా కూడా ఉన్నాయి.

జనతా ప్రజాతంత్ర విప్లవ కాలంలోనే ద్రవ్య పెట్టుబడి ప్రవాహాలను నియంత్రించేందుకు, విదేశీ గుత్త సంస్థల ఆస్తులను రాజ్యం స్వాధీనంచేసుకునేందుకు చేపట్టే చర్యలతో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో బహిరంగ తెగదెంపులకు దారితీసి ఉండేది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రక్రియ నుండి విడిపోయే ప్రశ్న తీవ్రంగా

ముందుకొచ్చి ఉండేది. సోషలిస్టు పరివర్తన ముందుకు సాగాలంటే, ఆవిధంగా విడగొట్టడం జరిగి ఉండేది.

సోషలిస్టు రాజ్యం స్థిరపడ్డాక, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థతో సంప్రదింపులు, సంబంధాల స్వభావమనేది అంతర్జాతీయ స్థాయిలో వర్గ శక్తుల బలాబలాల్లో వచ్చిన మార్పులను బట్టి నిర్ణయించబడుతుంది. ఈపాటికే, నయా – ఉదారవాదంపై ఏకాభిప్రాయం బీటలువారటం మొదలైంది. సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాల స్వభావంలో మార్పులు జరుగవచ్చు. కానీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నుండి వ్యూహాత్మకంగా విడగొట్టకుండా సోషలిజం పురోగమనం సాధ్యం కాదు.

**ఉత్పత్తి సాధనాల సామాజీకరణ :**

జనతా ప్రజాస్వామ్య రాజ్యం గుత్త సంస్థల తొగింపునూ, సంపద కేంద్రీకరణను ఛేదించే ప్రక్రియనూ ప్రారంభించవలసి ఉంది. ఆ సంస్థలు, ఆస్తులూ స్వదేశీ, విదేశీ పరిశ్రమలు, ద్రవ్యం, వాణిజ్యం, సేవలు వంటి పలు రంగాలకు చెందినవి. జనతా ప్రజాతంత్ర దశ అనంతరం బడా పెట్టుబడి అధీనంలో ఆర్థిక సంస్థలేవీ లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టాలి. అందుకు ఆర్థిక అభివృద్ధి స్థాయిని, ఉత్పత్తి శక్తుల సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి. కేవలం జాతీయకరణలు, రాజ్యం స్వాధీనాలువంటి సాంకేతిక విధానాన్ని అనుసరించరాదు. అందుకు భిన్నంగా సోషలిస్టు దేశాల గత, వర్తమాన అనుభవాల నుండి నేర్చుకోవాలి. ప్రణాళిక, మార్కెట్, ప్రణాళికా వికేంద్రీకరణ, సమాజ అధీనంలోని సంస్థల మధ్య సంబంధాల పట్ల మన వైఖరిని, భారత పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాలి.

స్వాతంత్ర్యానంతరం 75 సంవత్సరాల్లో మన దేశంలో పెట్టుబడిదారీ విధానం విస్తరించింది. దీనివల్ల చిన్న ఉత్పత్తిదారులు, చిన్న పెట్టుబడిదారులు, షాపు యజమా నులు, వ్యాపారులు భారీగా విస్తరించారు. భారత పరిస్థితుల్లో సోషలిజం చిరు సరుకుల ఉత్పత్తిని, మార్కెట్‌ను పరిమిత రంగాల్లో అనుమతిస్తుంది. బడా పెట్టుబడి అభివృద్ధికి అవకాశం లేకుండా రాజ్యం వాటిని నియంత్రించాలి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో నిరంతరం మార్పులు జరుగుతున్నాయి. అందుకు శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలను, సమాచార టెక్నాలజీని వినియోగించు కుంటున్నారు. సోషలిస్టు ఉత్పత్తిలో నూతన వ్యవస్థలు వికసించేయవలసిన అవసర ముంది. మేథోహక్కుల పైనా, విజ్ఞానంపైనా, బ్రాండ్ల ద్వారా మార్కెట్‌పైనా అదుపుసాధించి అదనపు విలువను పోగుచేసుకున్న బడా పెట్టుబడిని ఎందుర్కోడానికి ఈ కొత్త వ్యవస్థలు తోడ్పడతాయి.

**ప్రణాళిక రూపకల్పన :**

ఆర్థిక నిర్ణయాల రూపకల్పనలోను, ఆర్థిక సంస్థల నిర్వహణలోను ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు భారత ప్రణాళికలను వికేంద్రీకరించాలి. ప్రభుత్వ పెట్టుబడులు, భిన్న స్థాయిల్లో ప్రభుత్వ అధికారులచేత నడిపించబడే నిజమైన సామాజిక ఆర్థిక ప్రణాళిక ద్వారా అదుపులేకుండా వ్యవహరిస్తున్న మార్కెట్ శక్తులను అదుపులో పెట్టాలి.

ఆర్థికాభివృద్ధి మార్గాన్ని ఆరోగ్యకరమైన వాతావరణం, పర్యావరణ సమతూకాన్ని నిలబెట్టే లక్ష్యంతో సంలీనం చేయాలి. ఈ ప్రాథమిక అవగాహనే రాజ్యం, సంఘపరమైన విధాన రూపకల్పనను అన్ని దిశల్లోనూ ప్రభావితంచేస్తుంది.

**గ్రామీణ ప్రాంత సోషలిస్టు పరివర్తన :**

భారతదేశంలో వ్యవసాయ సమస్య, ఒక ప్రధానమైన జాతీయ సమస్య. అది జనతా ప్రజాస్వామ్య పోరాటంలో అత్యంత కీలకమైన లింకు వంటిది. ఆ పోరాటమే మన ఆలోచన, ఆచరణ, కాలాలను శాసిస్తుంది. దానివల్ల ఏం జరుగుతున్నదంటే మన గ్రామీణ ప్రాంతానికి, గ్రామీణ ప్రజలకు ఒక సోషలిస్టు భవిష్యత్ దృష్టిని అందించే విషయాన్ని తరచూ మనం నిర్లక్ష్యంచేస్తున్నాము. ఇది అనేక విధాలుగా దురదృష్టకరమైనది. జనతా ప్రజాస్వామ్యంలో అంతిమంగా మన సోషలిజం భవిష్యత్ దృష్టిని బట్టి మాత్రమే మనం గ్రామీణ ప్రాంత డిమాండ్లను రూపొందించాల్సి ఉంటుంది. జనతా ప్రజాస్వామిక వ్యవస్థను దృష్టిలో పెట్టుకుని మనం చేసే డిమాండ్లు మనకు తెలుసు. కానీ అవి సోషలిజం భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందలేదు. దానివ్ల మనం... భూమి పునఃపంపిణీ (అగ్రేరియనిజం) ని బలపరచటం; గ్రామీణ ప్రాంతం, గ్రామీణ చాకిరీ పట్ల ఊహానుభూతిని ప్రదర్శించటం వంటి కొన్ని ఆదర్శవాద లోపాలకు గురౌతాము. ఆధునిక సైన్స్-టెక్నాలజీలను తిరస్కరించటం, వెనుకబడిన అతిచిన్న అంశాలను కూడా కీర్తించటం వంటి లోపాలు కూడా మనల్ని వెంటాడరాదు.

గ్రామీణ చిరు ఉత్పత్తిదారులైన చిన్న, మధ్య తరగతి రైతాంగం, గ్రామీణ శ్రామికులు జనతా ప్రజాస్వామిక సంఘటనలో ప్రధాన భాగస్వాములు. చిన్న ఉత్పత్తి దారుల హక్కుల రక్షణకై జరిగే పోరాటాన్ని మనం బలపరుస్తాము. దానితోపాటు, కమ్యూనిస్టులంగా మన పోరాటం చిన్న ఉత్పత్తి విధానాన్ని కాపాడేందుకు మాత్రం కాదు. ఒక ఆర్థిక వ్యవస్థగా,శ్రమ ఉత్పాదకతను అనేక రెట్లు పెంచాలి. ముందస్తు అంచనాలకు మించి ఉత్పత్తిలో ఫలితాన్ని పోగేయాలి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి దోహదపడేలా ఆధునిక విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించి, వినియో

గించేందుకు అనుకూల పరిస్థితులను సృష్టించాలి.

జనతా ప్రజాస్వామిక విప్లవానికి, కార్మిక – కర్షక ఐక్యత ఒక ముందస్తు అవసరము. సోషలిజం అభివృద్ధితో అది ఒక నూతన రూపం తీసుకుంటుంది. నేడు ఆ కూటమి కార్మిక వర్గం, గ్రామీణ శ్రామికులు, పేద రైతులతో కూడి ఉంటుంది. సోషలిజాన్ని వాస్తవం చేయాలంటే భూమి, ఇతర వ్యవసాయ ఆస్తులు సమిష్టి రూపానికి పరివర్తన చెందాలి. అందుకు సమిష్టి ఉత్పత్తితో మాత్రమే తమ భౌతికాభివృద్ధి సాధ్యమని అర్థంచేసుకునేలా పేద రైతాంగాన్ని సిద్ధంచేయాలి. చైతన్యపరచాలి.

సోషలిజం అంటే, ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయటం. వ్యవసాయంలో భూమి ప్రాథమిక వనరూ, ఉత్పత్తి సాధనమూను. భూమిని సమాజపరంచేయటం అంటే దాన్ని జాతీయంచేయటం తప్పనిసరి అని కాదు. సమాజం అధీనమనేది అనేక రూపాల్లో ఉంటుంది. అందుకు భారత్‌లోని వ్యవసాయ–పర్యావరణ పరిస్థితుల్లో నెలకొన్న విస్తారమైన భిన్నత్వాలను దృష్టిలో ఉంచుకునితీరాలి.

భూమి, ఇతర ఉత్పత్తి సాధనాలను స్వచ్ఛందంగా సేకరించాలి. తద్వారా, 'సమాజ పరం చేయటం' అనే అంశం సమిష్టి వ్యవసాయ రూపం ధరిస్తుంది. అలాంటి వ్యవసాయం చట్టం, పరిపాలనాపరమైన పలు భిన్న రూపాల్లోకి మారుతుంది. అది సహకార వ్యవసాయ రూపం తీసుకోవచ్చు. భూమి–సమిష్టిగా ఉండవచ్చు; కార్మికులు లేదా యజమానుల స్వచ్ఛంద అసోషియేషన్‌ల అధీనంలో ఉండవచ్చు; స్థానిక ప్రభుత్వ సంస్థలు లేదా రాజ్యంతో సహా ఇతర ప్రభుత్వ అధికారుల అధీనంలో ఉండవచ్చు. ఆ విధంగా ఇక్కడ అవకాశాలు చాలా భిన్నంగా ఉంటాయి.

సమాజ అధీనపు రూపాలు భిన్నంగా ఉన్నప్పటికీ, వ్యవసాయ క్షేత్రాల వైశాల్యం (హెక్టార్లలో) భిన్నంగా ఉన్నప్పటికీ, సోషలిజంలో భూ కమతాల వైశాల్యం పెరుగుతుంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం పెరుగుతుంది. గత ఉత్పత్తి విధానంలో భూ కమతాల వినియోగంపై ఉన్న సామాజికి అడ్డంకులను సోషలిజం తొలగిస్తుంది. దానితో ఉత్పాదకత పెరుగుతుంది. అది భౌతిక, అభ్యుదయకరమైన సాంస్కృతిక అభివృద్ధికి పునాదిగా మారుతుంది.

భూమి సమాజం అధీనంలోకి రావటం వల్ల తొలిసారిగా శాస్త్రీయమైన, స్థిరమైన రూపంలో భూమిని వినియోగించడానికి అవకాశం ఏర్పడుతుంది. (అంటే పంట భూమి, అటవీ భూమి, నీటి వనరులు, ఇతర భూముల మధ్య తేడాను గమనించి ఉపయోగించడం జరుగుతుంది). సమాజానికి అవసరమైన రీతిలో పంటల పద్ధతిని

రూపొందించడానికి అవకాశం కల్పిస్తుంది. అది నీటి వనరులను సుస్థిరమైన పద్ధతిలో వినియోగించుకోడానికీ, నియంత్రించడానికీ అవకాశం కల్పిస్తుంది. అలాగే పర్యావరణాన్ని సామాజానికంతటికీ వర్తించే విధంగా కాపాడ్డానికి తోడ్పడుతుంది.

గ్రామానికీ, పట్టణానికీ మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించటం సోషలిజపు అతి ముఖ్యమైన కర్తవ్యాల్లో ఒకటి. భారత దేశంలోని పట్టణాలు, గ్రామాల మధ్య అభివృద్ధిలో అసమానతల వల్ల తీవ్రమైన సామాజిక అన్యాయం నెలకొన్నది. అందుకే ఇక్కడ ఈ కర్తవ్యానికి ప్రత్యేక ప్రతి స్పందన ఉంది. తనతో పాటు కొత్త పెట్టుబడులు, సామాజిక స్థాయిలో అత్యాధునిక సైన్సు టెక్నాలజీలను తోడ్కొని వచ్చే సోషలిజం మాత్రమే మౌళిక సదుపాయాలు, జీవన ప్రమాణాల్లోని విస్తారమైన ఈ అంతరాలను పూడ్చగలుగుతుంది.

**ఒక ఆధునిక సోషలిస్టు మానవుని సృష్టించటం :**

సోషలిజం అంటే ఉపాధిని సృష్టించే ప్రభుత్వ పెట్టుబడిని సమకూర్చటం. సామాజికాభివృద్ధికి తోడ్పడే గిరాకీని సృష్టించడానికి ఉన్న ఆటంకాలను తొలగించటం. భారత్‌లో సోషలిజం అంటే అందరికీ అందుబాటులో ఉండే, నాణ్యమైన విద్యను అందించగల ప్రభుత్వ విద్యా వ్యవస్థ. అందరికీ అందుబాటులో – ప్రభుత్వ రంగంలో సార్వత్రిక ఆరోగ్య పరిరక్షణ, సురక్షితమైన పారిశుధ్యం, గౌరవప్రదమైన గృహ వసతి, క్రెచ్‌ల సౌకర్యం, బిడ్డల సంరక్షణ, వృద్ధుల సంరక్షణ.

సాంస్కృతిక రంగంలో, ప్రజలందరికీ అందుబాటులో ఉండే విశ్రాంతి సృష్టికి, సాహిత్యము, దృశ్య, కళా ప్రదర్శనలకు ప్రభుత్వ నిధులను అందిస్తుంది.

భారతదేశంలో సోషలిజం అమల్లోకి రావటమనేది, కుల వ్యవస్థ రద్దయినప్పుడు, పితృస్వామ్యం, లింగపరమైన అణచివేతలు నిర్మూలించబడినపుడు మాత్రమే సాధ్యము. సోషలిజం వస్తే వర్గ దోపిడి, కుల పీడనలు రెండూ అంతమవుతాయి. దీనిపై ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఇలా రాశారు : "భారత దేశంలో కోటవంటి సనాతన నాగరికత, సంస్కృతులనూ, సమాజాన్ని విభజించే నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను కూలదోయకుండా సోషలిజం మాట అటుంచి లౌకిక ప్రజాసామ్యాన్ని కూడా నెలకొల్పలేము. మరో మాటలో చెప్పాలంటే, సమర శీలమైన ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం జరిగే పోరాటాన్ని కుల సమాజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం నుండి విడగొట్టలేము."

కుల విభజనలను, కుల చైతన్యాన్ని రద్దుచేయాలి. ఆ లక్ష్యాన్ని సోషలిస్టు రాజ్యంలో సామాజిక, న్యాయ, ఆర్థిక పరమైన గట్టి చర్యల ద్వారా సాధించాలి.

దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలకు సానుకూల చర్యలు అవసరమైనంత కాలం  కొనసాగుతాయి. పౌరులకు సోషలిస్టు చైతన్యాన్ని కల్పించి, తద్వారా కుల అవరోధాలను కూలగొట్టాలి. అదే సోషలిస్టు రాజ్యానికి 'అగ్ని పరీక్ష.'

సోషలిజం, లింగ సమానత్వానికి హామీనివ్వాలి. సమాజంలోని లింగపరమైన అణచివేతను, పితృస్వామిక  చట్రాలను అంతంచేయాలి. శ్రామికుల లింగపరమైన విభజన, కుల పీడన, మహిళను ద్వితీయ శ్రేణికి నెట్టేసే మత ఛాందసం, పెట్టుబడిదారీ విధానంలో మహిళపై జరుగుతున్న దోపిడి. మహిళలను పీడిస్తున్న  పై తెల్పిన అన్ని రకాల అణచివేతలకూ సోషలిస్టు రాజ్యం ముగింపు పలకాలి. కుటుంబాలు, పని ప్రదేశాల్లో స్త్రీ, పురుషుల మధ్య లింగ ఆధారిత పని విభజనను అంతమొందించేందుకు చర్యలు చేపట్టాలి. ఒక ప్రజాస్వామిక కుటుంబ కోడ్‌ను ఏర్పాటుచేయాలి. మహిళలపై అన్ని రకాల అత్యాచారాలను అరికట్టేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలి. ఉచితంగా లభించే గర్భస్రావము, గర్భనిరోధకాలతో మహిళలకు తమ శరీరాలపై హక్కు ఉండేలా హామీనివ్వాలి. బిడ్డల రక్షణకు సామాజికంగా నిర్వహించబడే సంస్థలను ఏర్పరచాలి. సమాన పనికి సమాన వేతనం పద్ధతిని అమలుచేయాలి. రాజకీయ రంగంలో మహిళలు పూర్తి భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలి.

అది కుల సమస్య అయినా, లింగ సమస్య అయినా సోషలిజంలో వాటి పరిష్కారాన్ని సద్యోజనిగంగా అభివృద్ధి చెందే చైతన్యానికి విడిచిపెట్టరాదు.  భౌతిక పునాదిలో అసమానతలను నిర్మూలించే చర్యలకు తోడుగా  సామాజిక, చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలుచేయాలి.

**సోషలిజము –ప్రజాస్వామ్యము :**

20వ శతాబ్దంలో, సోషలిజానికి పరివర్తన చెందిన దేశాలన్నీ, విప్లవానికి నాయకత్వం వహించిన పార్టీ లేదా ఆ పార్టీకి సన్నిహితమైన మరికొన్ని చిన్న పార్టీలను కలుపుకొని,  ఏక పార్టీ రాజకీయ వ్యవస్థను రూపొందించాయి. భారతదేశంలో సుదీర్ఘ కాలంగా, స్వాతంత్ర్యానంతర రాజకీయ పరిణామాల పథం,  స్థిరమైన పార్లమెంటరీ ప్రజాస్వామిక  వ్యవస్థగా కొనసాగుతున్నది. ఆ వ్యవస్థలో, అనేక పార్టీలు మనుగడలో ఉన్నాయి. అక్కడ, భారతదేశపు బహుళ జాతుల సమాజపు విస్తారమైన భిన్నత్వాలు, సంక్లిష్టతలు కూడా వ్యక్తమౌతున్నాయి.

సోషలిజంలో బ్రహుళ పార్టీల వ్యవస్థ ద్వారా, ప్రజాస్వామిక వ్యవస్థ వ్యక్తం అవుతుంది. ఏక పార్టీ వ్యవస్థ వల్ల ప్రజాస్వామ్యానికి పరిమితులు ఏర్పడకుండా,

సోషలిస్టు రాజ్యాంగం ఆధారంగా నెలకొనే బహుళ పార్టీ వ్యవస్థ అడ్డుకుంటుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో, ఉత్పత్తి సాధనాలు, రాజ్య వ్యవస్థలు బూర్జువా వర్గం అదుపులో ఉంటాయి. అక్కడ, ప్రజాస్వామ్యం నామమాత్రమౌతుంది. ప్రజాస్వామ్యం, పౌరుల ప్రజాస్వామిక హక్కులు కుదించబడతాయి. సోషలిజంలో–ప్రజాస్వామ్యం అన్ని స్థాయిల్లోనూ ప్రజల చురుకైన భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి చెందలేదు. ప్రజాస్వామ్యం, సోషలిజానికి 'ప్రాణాధారం' వంటిది. శ్రామిక ప్రజలు భాగస్వాములయ్యేందుకు, భిన్న స్థాయిల్లో జనాదరణ పొందిన చట్టసభలను ఏర్పరచాలి. ఆ చట్ట సభలకు, పాలనాపరమైన అధికారాలతోపాటు, ఆర్థికపరమైన అధికారాలను కూడా కల్పించాలి.

ఎన్నికల వ్యవస్థలో, దామాషా ప్రాతినిధ్య సూత్రం అత్యంత ప్రజాస్వామిక మైనది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులను వెనక్కు పిలిపించే హక్కుకు కూడా హామీనివ్వాలి.

భారత్‌వంటి బహుళ భాషలు, బహుళ జాతుల దేశంలో, ఒక ప్రజాస్వామ్య యుతమైన భాషా విధానం అవసరం. అన్ని జాతీయ భాషలకూ సమాన ప్రాతినిధ్యం, కేంద్ర పాలనలోను, పార్లమెంటులోనూ వాటి వినియోగం సమానమేనన్న ప్రాథమిక సూత్రం అమలుకావాలి. రెండవ సూత్రం ఏమంటే, ఏ ఒక్క భాషనూ, ఏకైక అధికార భాషగా పరిగణించి, గుర్తించరాదు. మూడవది, మాతృభాషలోనే విద్యను అభ్యసించాలన్నది పౌరులందరి ప్రాథమిక హక్కుగా ఉండాలి. మైనారిటీ భాషలు మాట్లాడే ప్రజలకు, వారి భాషనే విద్యా బోధనా మాధ్యమంగా వినియోగించేందుకు అవకాశమివ్వాలి. నాలుగవది, భాషాపరమైన మైనారిటీల హక్కులకు హామీనివ్వాలి. రాజ్యం లేదా ఒక ప్రాంతపు మెజారిటీ భాషలతోపాటు, మైనారిటీ గ్రూపుల భాషలకు కూడా గుర్తింపునివ్వాలి.

సోషలిజంలో రాజ్య వ్యవస్థ సమాఖ్య రూపంలో ఉంటుంది. అన్ని రాష్ట్రాలకూ స్వయంప్రతిపత్తి, సమాన అధికారాలు ఉంటాయి. గిరిజన ప్రాంతాలకు స్వయంప్రతిపత్తిగల ప్రాంతీయ నిర్మాణాలుంటాయి. ప్రజా విశ్వాసం పొందిన చట్ట సభల ద్వారా, పట్టణం నుండి గ్రామం వరకూ అధికార వికేంద్రీకరణ అమలౌతుంది.

భారతదేశంలో సోషలిస్టు రాజ్యాన్ని, సోషలిస్టు సమాజాన్ని నిర్మించటం, ఒక గొప్ప ఉత్తేజకరమైన సవాలుగా నిలుస్తుంది. అంతిమంగా సోషలిజం నిర్మాణమనేది ఒక రాజకీయ ప్రాజక్టు. అందుకు ఒక విప్లవ పార్టీ కావాలి. శ్రామిక శక్తుల విప్లవ కూటమితో కూడిన ఆ పార్టీ నిరంతరమూ ప్రజల్లో పనిచేస్తూ, వారి సోషలిస్టు చైతన్యాన్ని అభివృద్ధిచేయాలి. భారత లక్షణాలతో సోషలిజం ఆవిర్భావమంటే

అది ఈ రాజకీయ, సైద్ధాంతిక పోరాట ఫలితమే.

**ముగింపు :**

సోషలిజం అనేది ఒక వర్గ సమాజం, వర్గ రహిత సమాజంగా పరివర్తన చెందే కాలము. అంటే ప్రపంచ స్థాయిలో పెట్టుబడిదారీ విధానం, సోషలిస్టు విధానం రెండూ సుదీర్ఘకాలం మనుగడ సాగిస్తాయని అర్థం. అది నిరంతర సంఘర్షణా కాలం. దోపిడీ పూరిత పెట్టుబడిదారీ వ్యవస్థను పరిరక్షించగోరే విప్లవ ప్రతీఘాత శక్తులకూ ఆ దోపిడీ నుండి మానవాళి విముక్తికోరే విప్లవ శక్తులకు మధ్య ఆ సంఘర్షణ జరుగుతుంది. ఈ నిరంతర పోరాటం ప్రపంచ స్థాయిలోనూ, అంతర్గతంగా సోషలిస్టు దేశాల్లోనూ రెండింటా కొనసాగుతున్నది. ఈ పోరాటంలో ఏ నిర్ధిష్ట కాలంలోనైనా సోషలిస్టు శక్తుల గెలుపోటముల నిర్ణయం అనేది సోషలిజం నిర్మాణంలోని విజయాలవల్లనూ, అంతర్జాతీయ, అంతర్గత వర్గశక్తుల బలాబలాల్లో జరిగే మార్పుల అంచనాల వల్లనూ నిర్ణయించబడుతుంది. దానికి అనుగుణంగా సాగే సరైన రాజకీయ ఎత్తుగడల పంథా, మానవాళిని సోషలిజం దిశగా పురోగమింపచేస్తుంది. కలకత్తా నిర్మాణ ప్లీనం పార్టీని ఇలా ఆదేశిస్తున్నది: "మతోన్మాదం, నయా-ఉదారవాదం, అభివృద్ధి నిరోధక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేయాలి." ఇంకా "ఈ శక్తులపై పోరాడే స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని సన్నద్ధం చేయాలి.'

**అధ్యయనం చేయదగ్గ ముఖ్యమైన పుస్తకాలు:**

1. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత రూపం, లెనిన్
2. ఏజ్ ఆఫ్ ఇంపీరియలిజం, హ్యారీ మాగ్‌డోఫ్
3. వాటెవర్ హాపెన్డ్ టు ఇంపీరియలిజం - ప్రభాత్ పట్నాయక్
4. ఇంపీరియలిజం ఆఫ్ అవర్ టైమ్స్ - ఐజాజ్ అహ్మద్
5. పొలిటికల్ ఇస్లామ్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఇంపీరియలిజం, సమీర్ అమిన్, డిసెంబర్, 2007, మంత్లీ రివ్యూ
6. ఆన్ ది హిస్టరీ ఆఫ్ ఇంపీరియలిజమ్ థియరీ, రిసెర్చ్ యూనిట్ ఫర్ పొలిటికల్ ఎకానమీ, డిసెంబర్, 2007, మంత్లీ రివ్యూ.
7. రీ డిస్కవరింగ్ ది హిస్టరీ ఆఫ్ ఇంపీరియలిజం: ఎ రిప్లై, జాన్ బెల్లమీ ఫోస్టర్, డిసెంబర్, 2007, మంత్లీ రివ్యూ.
8. న్యూ ఇంపీరియలిజం ఆఫ్ గ్లోబలైజ్డ్ మోనోపోలీ ఫైనాన్స్ కాపిటల్: యాన్

ఇంట్రడక్షన్, జాన్ బెల్లమీ ఫోస్టర్, జులై–ఆగస్టు 2015, మంత్లీ రివ్యూ.
9. కాంటెంపరరీ ఇంపీరియలిజం, సమీర్ అమిన్, జులై–ఆగస్టు, 2015, మంత్లీ రివ్యూ.
10. ఇంపీరియలిజం ఇన్ ది ఇరా ఆఫ్ గ్లోబలైజేషన్, ఉత్సా పట్నాయక్, ప్రభాత్ పట్నాయక్, జులై–ఆగస్టు 2015, మంత్లీ రివ్యూ.
11. ఇంపీరియలిజం ఇన్ ది 21 సెంచరీ, జాన్ స్మిత్, జులై–ఆగస్టు 2015, మంత్లీ రివ్యూ.
12. ది న్యూ స్టేజ్ ఆఫ్ గ్లోబలైజేషన్, హా(్రీ మాగ్‌డోఫ్, జులై–ఆగస్టు 2015, మంత్లీ రివ్యూ.
13. ది క్రియేషన్ ఆఫ్‌ది నెక్స్‌ట్ ఇంపీరియలిజం: ది ఇన్‌స్టిట్యూషనల్ ఆర్కిటెక్చర్, జయతి ఘోష్, జులై–ఆగస్టు 2015, మంత్లీ రివ్యూ.
14. లేట్ ఇంపీరియలిజం: ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్టర్ హా(్రీ మాగ్‌డోఫ్స్ ది ఏజ్ ఆఫ్ ఇంపీరియలిజం, జాన్ బెల్లమీ ఫోస్టర్, జులై–ఆగస్టు 2019, మంత్లీ రివ్యూ.
15. నియోలిబరల్ కాపిటలిజం ఎట్ ఎ డెడ్ ఎండ్, ఉత్సా పట్నాయక్, ప్రభాత్ పట్నాయక్, జులై–ఆగస్టు 2019 మంత్లీ రివ్యూ.
16. ది న్యూ ఇంపీరియలిస్ట్ స్ట్రక్చర్, సమీర్ అమిన్, జులై–ఆగస్టు 2019, మంత్లీ రివ్యూ.
17. ది ఐడియాలజీ ఆఫ్ లేట్ ఇంపీరియలిజం, ది రిటర్న్ ఆఫ్ ది జియోపోలిటిక్స్ ఆఫ్ ది సెకండ్ ఇంటర్నేషనల్, ఝున్ సు, మార్చి 2021, మంత్లీ రివ్యూ.
18. ఫైవ్ క్యారక్టర్‌స్టిక్స్ ఆఫ్ నియోఇంపీరియలిజం బిల్డింగ్ ఆన్ లెనిన్స్ థియరీ ఆఫ్ ఇంపీరియలిజం ఉయ ఒఆ 21 సెంచరీ, చెంగ్ ఎన్‌పు, లు బావోలిన్, మే 2021, మంత్లీ రివ్యూ.
19. చైనా: ఇంపీరియలిజం ఆర్ సెమీ–పెరిఫెరీ? మింక్వి లి, జులై 2021, మంత్లీ రివ్యూ.

# స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర

**బ్రిటిష్ సామ్రాజ్యవాదం, స్వాతంత్ర్య పోరాటం:**

బ్రిటీష్ సామ్రాజ్యవాదుల పాలన నుండి విముక్తి పొందాలని భారత ప్రజలు వాంఛించారు. దాని పర్యవసానమే భారత స్వాతంత్ర్య సంగ్రామం.

బ్రిటీష్‌వారి నిరంకుశ పాలన, ప్రజలపై సాగించిన అమానుష దోపిడీల చరిత్ర మన స్వాతంత్ర్య సమరానికి శక్తినిచ్చింది. భారత ప్రజానీకంలో విస్తృతమూ, విభిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ అసంఖ్యాక ప్రజా పోరాటాల ఫలితంగా స్వాతంత్ర్య పోరాటం ఒక జాతీయ స్థాయి పోరాటంగా అభివృద్ధిచెందింది. బ్రిటీష్ సామ్రాజ్యం నిలదొక్కుకునేందుకు చేస్తున్న దోపిడీలు, లూటీల ఫలితంగానే పై తెల్పిన ప్రతి పోరాటమూ ఆవిర్భవించిందనేది వాస్తవం. బ్రిటీష్ సైన్యంలోని భారతీయ సైనికులు తిరుగుబాటు చేశారు. అది వలసవాద దోపిడికి వ్యతిరేకంగా సాగిన తొలి సంఘటిత పోరాటంగా రూపుదాల్చింది. ఈ తిరుగుబాటు, 1857 మే 10న ప్రారంభ మైంది. ఆ పోరాట ధాటి నుండి తేరుకుని ఢిల్లీని తిరిగి స్వాధీనంచేసుకునేందుకు, బ్రిటీష్‌వారికి నాలుగు నెలలు (1857 సెప్టెంబరు 20) సమయం పట్టింది. తిరుగుబాటు దారులపై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు, తిరుగుబాటు కాలంలో ఉత్తర భారతంలో విముక్తి చెందిన ప్రాంతాలను తిరిగి స్వాధీనంచేసుకునేందుకు వారికి రెండు సంవత్సరాల సమయం పట్టింది.

తిరుగుబాటు ప్రాధాన్యతను తగ్గించి చూపేందుకు వలసవాద చరిత్ర ప్రయత్నించింది. కానీ కొన్ని రచనలు మాత్రం నాడు నెలకొన్న పరిస్థితులను స్పష్టంగా నమోదుచేశాయి. 1857 తిరుగుబాటుకు, అధికారం కోల్పోయిన రాజ్యాల ప్రభువులు, జమిందారుల అసంతృప్తి తక్షణ కారణమన్నది వాస్తవం. అయినప్పటికీ, బ్రిటీష్ పాలనలో బాధలకు గురైన భారత సైనికులూ, విస్తారమైన సాధారణ శ్రామిక ప్రజానీకం ఏకమై తిరగబడ్డారు.

బ్రిటీష్ చరిత్రకారులు ఈ తిరుగుబాటును 'సిపాయిల తిరుగుబాటు'గా చిత్రించారు. తద్వారా ఒక జాతీయ ప్రజా తిరుగుబాటును తక్కువచేసి చూపేందుకు ప్రయత్నించారు. కారల్ మార్క్స్ వారి ధోరణిని ఖండిస్తూ ఇలా వ్యాఖ్యానించారు: "అది 'స్వాతంత్రోద్యమ ప్రథమ సంగ్రామం'. హిందూ ముస్లింల సమైక్య జాతీయ

తిరుబాటు. ఈ సైనిక తిరుగుబాటు వాస్తవానికి ఒక జాతీయ తిరుగుబాటు."

ఆ తిరుగుబాటుకు గొప్ప ఔన్నత్యం ఉంది. దానితోపాటు అది దీర్ఘకాలం నిలబడలేక విఫలమైన తీరుకు కూడా సమాన ప్రాధాన్యత ఉంది. అనేక మంది భారత పాలకులు, పెద్ద జమిందారులు పలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. వారందరూ చురుగ్గా బ్రిటీషు వారి పక్షంవహించారు. దాన్ని గుర్తించిన గవర్నర్ కానింగ్ దాపరికంలేకుండా ఇలా చెప్పారు: "వారు (రాకుమారులు) ఉధృతమైన ప్రవాహానికి అడ్డుకట్టలుగా నిలిచారు. లేకుంటే ఆ ప్రవాహం మమ్మల్ని తుడిచిపెట్టేసేది."

భారత స్వాతంత్ర్య పోరాటం ఒక భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా మారాలన్న పాఠాన్ని బ్రిటీష్‌వారి స్పందన నేర్పింది. విస్తారమైన రైతాంగ సంక్షోభానికి వ్యతిరేకంగా నిలువకుంటే స్వాతంత్రోద్యమం జయప్రదం కాదని అర్థమయింది.

1857 సంగ్రామంపై బ్రిటీష్‌వారు తమ స్వంత గుణపాఠాలు తీశారు. భారతదేశంలో హిందువులు, ముస్లింలు, భూస్వామ్య రాకుమారులు అందరూ ఒకే ఉమ్మడి లక్ష్య సాధనకై కలసికట్టుగా పోరాడ్డానికి అనుమతిస్తే బ్రిటీష్ పాలన నిలిచేది కాదు. ఈ అంశంపై బ్రిటీష్ చరిత్రకారుడు థామస్ లోవీ పరిశీలన ఇలా ఉంది: "గో హంతకులు, గోవు ఆరాధకులు, పందుల విద్వేషకులు, పందిని తినేవారు యావన్మందీ ఏకమై తిరగబడ్డారు." అలాంటి ప్రక్రియలు పునరావృతం కాకుండా నిలువరించాలనుకున్నారు. దీని ఫలితంగానే విభజించి పాలించు అన్న మార్గాన్ని వారు అనుసరించారు.

విస్తారమైన భారత ప్రజానీకంపై తన పాలనను స్థాపించాలని బ్రిటీష్ ప్రభుత్వం భావించింది. భారతదేశమంతటా పాలనా పరమైన ఏకీకరణను సాధించటం కూడా తన లక్ష్యంగా నిర్ణయించుకుంది. భారత ప్రజానీకంలో విస్తారమైన సామాజిక, సాంస్కృతిక భిన్నత్వాలున్నాయి. వాస్తవానికి ఆ ప్రజానీకం స్వాతంత్ర్య పోరాటం ద్వారా భిన్నత్వాలను అధిగమించింది. ఐక్యతను సాధించింది. భారత్‌లో, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ వాదాన్ని స్థిరంగా నెలకొల్పగల్గింది. కమ్యూనిస్టులు పై గుణపాఠాలన్నింటినీ స్వీకరించారు. అందుకు అనుగుణంగా, స్వాతంత్ర్య పోరాటంలో తమ పాత్రను నిర్దేశించు కున్నారు. అది భారత రాజ్యాంగ రూపకల్పనలో అనివార్యంగా ప్రతిబింబిస్తున్నది.

**కమ్యూనిస్టు పార్టీ స్థాపన, దాని నేపథ్యం:**

బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా భారతీయులు అనేక స్థానిక పోరాటాలు చేశారు. ఆ పోరాటాలకు సంబంధించిన పలు స్రవంతులను, విభాగాలను కమ్యూనిస్టు

పార్టీ అంకితభావంతో స్వీకరించింది. విశిష్టమైన అక్టోబరు విప్లవ విజయం తక్షణ స్ఫూర్తి ప్రధాతగా నిలిచింది. జాతీయ కాంగ్రెస్‌పట్ల, దాని పోరాట రూపాల పట్ల ప్రజల్లో భ్రమలు తొలగిపోయాయి. ఫలితంగా ప్రత్యామ్నాయాల కోసం అన్వేషణ ప్రారంభమైంది. లెనిన్ తన 'కొలోనియల్ థీసీస్' గ్రంథంలో ఒక విశిష్టమైన పిలుపునిచ్చాడు. దానితో భారతదేశంలోనే కాదు, ఇతర ప్రాంతాల్లోంనూ కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయి. అవి ప్రారంభంలో చిన్న విప్లవకారుల గ్రూపులుగా ఏర్పడేందుకు దారితీశాయి. ప్రత్యేకంగా యూరపులోని అనేక ప్రాంతాల్లో మార్క్సిజాన్ని స్వీకరించిన కొందరు వలసదారులు పోషించిన పాత్ర కూడా ఒక ఉమ్మడి లక్షణంగా నిలిచింది. ముజఫర్ అహమ్మద్ పరిశీలన ఇలా ఉం : "విదేశాల్లో నిర్మించబడిన పార్టీ కొనసాగింపు రూపమే భారత కమ్యూనిస్టు పార్టీ". అది పెషావర్ కమ్యూనిస్టు కుట్ర కేసు నుండి స్వీకరించబడిందనేది నిర్వివాదమైన అంశము. 1922-23లో బ్రిటీష్‌వారు ఈ కుట్రకేసు పెట్టి భారత కమ్యూనిస్టులపై విచారణకు పూనుకున్నారు. ఆ కుట్ర కేసులోని 10 మంది ముద్దాయిల్లో 9 మంది కమ్యూనిస్టు పార్టీ వలసదారుల శాఖలోని సభ్యులే. కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు పర్యవసానాల పట్ల బ్రిటీష్ పాలకులు అప్రమత్తమైనారు. బాల్యంలో ఉన్న ఈ రాజకీయ పార్టీపై దారుణమైన అణచివేతలకు పూనుకున్నారు. దానిపై అనేక కుట్ర కేసులు బనాయించారు. వాటిలో పెషావర్ కుట్ర కేసు(1922-23), కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసు(1924), ప్రఖ్యాతి గాంచిన మీరట్ కుట్ర కేసు(1929)లు ముఖ్యమైనవి. మీరట్ కుట్ర కేసులో 31మంది ప్రఖ్యాత సిపిఐ నాయకులకు శిక్ష విధించారు.

1921లో అహమ్మదాబాద్‌లో ఎఐసిసి సమావేశం జరిగింది. నూతనంగా ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ఆ సమాశంలో 'సంపూర్ణ స్వాతంత్ర్యం' తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దాని పర్యవసానాలు ఎలా ఉంటాయన్న శషభిషలకు తావు లేకుండా ఆ తీర్మానం ప్రవేశవెట్టబడింది. మౌలానా హస్రత్ మొహానీ, స్వామీ కుమారనందలు పార్టీ తరఫున ఆ తీర్యానాన్ని ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్య పోరాటం ప్రాణప్రదమైన అభిలాషలకు అనుగుణంగా ఆ తీర్మానం ప్రవేశపెట్టబడింది. జాతీయ కాంగ్రెస్, 'సంపూర్ణ స్వాతంత్ర్యం' తీర్మానాన్ని 1929లో ఆమోదించింది.

కమ్యూనిస్టులు పై తీర్మానం ప్రవేశపెట్టిన అనంతరం ఎంఎన్ రాయ్, అబానీ ముఖర్జీలు పార్టీ తరఫున జాతీయ కాంగ్రెస్‌కు ఒక లేఖ రాశారు. ఆ లేఖలో ఇలా పేర్కొన్నారు: "కార్మిక సంఘాల కనీస డిమాండ్లను, జాతీయ కాంగ్రెస్ తన డిమాండ్ల జాబితాలో చేర్చాలి. కిసాన్ సభ ప్రణాళికను, కాంగ్రెస్ తన స్వంత ప్రణాళికగా పరిగణించాలి. కాంగ్రెస్ ఏ ఆటంకానికీ ఆగిపోని కాలమొకటి త్వరలో వస్తుంది.

ప్రజలందరూ తమ భౌతిక ప్రయోజనాల కోసం చైతన్యపూరితంగా పోరాడుతున్నారు. ఆ ఎదురులేని ప్రజాశక్తి కాంగ్రెస్‌కు అండగా నిలుస్తుంది.”

ఈ అవగాహన తోనే కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది. అదేవిధంగా బ్రిటీష్ పాలన నుండి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమంలో ఆదినుండి చివరి వరకు భాగస్వామిగా నిలిచింది. విశాలమైన కార్మికులు, కర్షకులను వర్గ పోరాటాల వైపూ, కుల దొంతరల వల్ల అణచివేతలకు గురౌతున్న విస్తారమైన ప్రజానీకాన్ని సామాజిక సమస్యలపై పోరాటాల వైపూ సమీకరించేందుకు పార్టీ అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఇది కేవలం స్వాతంత్ర్య సాధన కోసం మాత్రమే కాదు, సోషలిజం సాధించాలన్న అంతిమ లక్ష్యంతో, తమ భౌతిక పరిస్థితుల్లో మార్పు కోసం కూడా జరిగిన పోరాటం. ఇది జాతీయోద్యమంలో విస్మరించరాని ఒక నూతన ఒరవడి. అదే విధంగా దేశంలోని పలు ప్రాంతాల్లో అనేక పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాలు, కలకత్తా, కాన్పూరు, బొంబాయి, మద్రాసువంటి పారిశ్రామిక వాడల్లోనూ, రైల్వే, బొగ్గుగనులు, జనపనార వంటి ముఖ్యమైన రంగాల్లోనూ, పత్తి, టీ తోటల్లోనూ జరిగాయి. వాటిలో అతి ముఖ్యమైనది, రాజకీయ ప్రాధాన్యతగలది బొంబాయి కార్మిక పోరాటం. బొంబాయిలో జరిగిన ‘నావికుల తిరుగుబాటు’కు బహిరంగంగా మద్దతునిస్తూ కార్మికులు బైటకు రావటం ఆ పోరాటం విశిష్టత.

కమ్యూనిస్టు పార్టీ ఆది నుండి హిందు–ముస్లిం ఐక్యత కోసం కృషి చేసింది. బ్రిటీష్‌వారి ప్రోద్బలంతో సాగుతున్న మతపరమైన విభజనల నివారణకు గట్టి కృషిచేసింది. హిందు మహాసభ, ముస్లింలీగ్‌లు ఆ విభజనలు పెంచే విధంగా వ్యవహరించాయి.

కమ్యునిస్టులు జోక్యంచేసుకున్న మరో ముఖ్యమైన అంశం, కుల వివక్షతవంటి సామాజిక సమస్యలు. ఆ సమస్యలను భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక అజండాతో కలిపి వాటిపై సమగ్ర పోరాటంచేశారు. ఆ పోరాటాల ఉద్దేశం కుల వ్యవస్థను సంస్కరించటం కాదు. ఆ వ్యవస్థను రద్దుచేయటమే.

**జాతీయోద్యమం, వామపక్ష స్రవంతుల ఆవిర్భావము :**

భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక నాయకులు, బ్రిటీష్ పాలనను విమర్శించటంలో భారత ప్రజల పేదరికాన్ని కేంద్ర సమస్యగా గుర్తించారు. 1876లో దాదాబాయి నౌరోజీ ప్రజల ఇక్కట్లను, అందుకు కారకులైన బ్రిటీష్‌వారి దుష్కృత్యాలపై వ్యాసాలు, వినతి పత్రాలు, కరపత్రాలను రచించారు. ఆ కాలంలో బ్రిటీష్ స్వేచ్ఛా వాణిజ్యం ఫలితంగా అనేక పరిశ్రమల మూసివేతలకు గురయ్యాయి. అధిక పన్నులు,

కరెన్సీని తారుమారుచేయటం (మానుపులేషన్) వంటి సమస్యలు బ్రిటీష్ పాలనలో పెచ్చుమీరినట్లు ఆ ప్రచార పత్రాల్లో పొందుపరిచారు. నౌరోజీ రచనలను 1901లో ప్రచురించారు. రొమేష్ దత్ కూడా తన 'ఎకనమిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా అండర్ ఎర్లీ బ్రిటీష్ రూల్', గ్రంథాన్ని 1901లోనే ప్రచురించారు. రెండు సంవత్సరాల అనంతరం 1903లో దాని సంక్షిప్త సంపుటాన్ని ప్రచురించారు.

జాతీయవాదులు తమ పోరాటాన్ని ప్రధానంగా బ్రిటీష్ పాలనపై ఎక్కుపెట్టారు. భారతీయ యాజమాన్య పరిశ్రమల్లోని కార్మికుల బాధలపట్ల, భూస్వాములు విధించే అధిక కౌలు భారంతో అణగారిపోతున్న రైతాంగం సమస్యలపట్ల మౌనంపాటించారు. ఒకసారి పీడకులను గుర్తించేందుకు ప్రజల పేదరికాన్ని ప్రామాణికంగా నిర్ణయించాక, భారతీయ పెట్టుబడిదారులు, భూస్వాములను అనివార్యంగా గుర్తించవచ్చు. 1917 –18లో గాంధీజి తొలుత చంపారన్, ఖేదాల్లో రైతాంగాన్ని సమీకరించేందుకు చొరవచూపారు. ఆ సమీకరణలో భారత భూస్వాములు పాల్గొనకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ 1918, అహమ్మదాబాద్ పత్తి మిల్లుల కార్మికుల ఆందోళనలో గాంధీజీ, తన మద్దతుదారులైన పత్తి మిల్లుల యజమానులను ముఖాముఖి ఎదుర్కొనవలసివచ్చింది. ప్రజలు తమ బాధల నుండి ఉపశమనం కోసం జాతీయోద్యమానికి మద్దతుగా ముందుకొచ్చేకొద్దీ ఆ ఆటంకాలు మరింతగా తరగిపోతాయన్నది స్పష్టం. ఖిలాఫత్, సహాయనిరాకరణ ఉద్యమాల (1920–22)తో కలసి, జమిందారులకు వ్యతిరేకంగా విడివిడి పోరాటాలు జరిగాయి. కానీ అవన్నీ ఎంతో నిర్ణయాత్మకంగా, అపూర్వమైన స్థాయిలో జరిగిన పోరాటాలు. ఆ పోరాటాల్లో బీహార్ –దర్భాంగా రైతాంగ ఉద్యమం(1920); ఉత్తరప్రదేశ్ –అవధ్ తాలూక్ దార్ వ్యతిరేక రైతాంగ దాడులు(1921–22); కేరళ –మలబార్(మతపరమైన పైపూత లున్నప్పటికీ) మోప్లా తిరుగుబాటు (1921) వంటివి ఉన్నాయి. 1921లో అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) ఏర్పడింది. దానితో కార్మిక వర్గం అకాంక్షలను, పరిమితంగానైనా, వ్యక్తీకరించేందుకు కూడా అవకాశం ఏర్పడింది. ఆ సంస్థలో గాంధీజీ మినహా, ప్రధానమైన జాతీయ నాయకులందరూ భాగస్వాములైనారు.

1922లో జాతీయ కాంగ్రెస్ మహాసభలు గయలో జరిగాయి. ఆ మహాసభల్లో సిఆర్ దాస్ అధ్యక్ష ఉపన్యాసంచేశారు. దానిలో– ఆయన ఒక నూతన అవగాహనను అంటే, జాతీయోద్యమంలోకి కార్మికులు, కర్షకులను రాబట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. అదే సంవత్సరం ఎఐటియుసి సమావేశంలో కూడా ఆయన ప్రసంగించారు. దేశంలో 98శాతం మందికి స్వాతంత్ర్యంకావాలని ఆయన తన

ఉపన్యాసంలో ఉద్ఘాటించారు. 1924లో గాంధీజీ జైలు నుండి విడుదలయ్యాక 'ఐచ్ఛిక సార్వత్రిక ఓటు హక్కు'ను డిమాండుచేశారు. బ్రిటీష్ అధికారుల ఆగ్రహాన్ని ఖాతరుచేయకుండా 1921లో గాంధీజీ తన 'యంగ్ ఇండియా' పత్రికలో ఎంఎన్ రాయ్ వ్యాసాలకు అవకాశమిచ్చారు. గాంధీజీ వ్యతిరేకించినప్పటికీ ఎఐసిసి సమావేశంలో లెనిన్ మరణంపై సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అది కేవలం 63 – 54 ఓట్ల తేడాతో వీగిపోయింది.

జాతీయోద్యమంలోని సమరశీలురైన నాయకుల్లో సోషలిజం, సోవియట్ రష్యాల పట్ల పెరుగుతున్న సానుభూతికి పై తెల్పిన ఓటింగ్ సరళి అద్దంపడుతున్నది. 1923 తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ అస్పష్టమైన 'స్వరాజ్యం, హోం రూల్' భావనల స్థానంలో 'స్వాతంత్ర్యం' అన్న అవగాహనను స్వీకరించారు. ఆ మార్పు అతన్ని కమ్యూనిస్టులకు సన్నిహితంచేసింది. 1927 నాటికి బ్రస్సెల్స్‌లో కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన 'అణగారిన జాతుల మహాసభ'లో నెహ్రూ పాల్గొన్నారు. ఆ పరిణామంతో ఆయన నూతనంగా స్థాపించబడిన 'సామ్రాజ్యవాద వ్యతిరేక లీగ్' నాయకత్వ బృందంలో ఒక స్థానాన్ని స్వీకరించారు. ఆయన సోవియట్ రష్యాను కూడా సందర్శించారు. ఆ సంవత్సరం ఆఖరులో మద్రాసులో కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఆ సభలో సుభాష్ చంద్రబోస్‌తో కలసి 'సంపూర్ణ స్వాతంత్ర్యం'పై తీర్మానం జయప్రదంగా ఆమోదంపొందేందుకు తోడ్పడ్డాడు. వారిరువురూ కలసి 1928లో 'ఇండిపెండెన్స్ ఫర్ ఇండియన్ లీగ్' స్థాపనకు సహకరించారు. 1934–35లో నెహ్రూ "కొంత కాలంగా సోషలిజం, కమ్యూనిజాలకు చేరువయ్యాను" అని రాసుకున్నారు. అక్కడితో ఆగకుండా "మార్క్సిజం నా మస్తిష్కంలోని అనేక చీకటి కోణాల్లో వెలుగులు ప్రసరించింది" అని రాశారు. 1920 తర్వాత ఆయన తన అనుభవాలను స్పష్టంగా వ్యక్తంచేశారు. అలాగే ఆ కాలపు అనేక మంది విప్లవకారులు సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. ఈ గ్రూపులపట్ల ఎంఎన్ రాయ్ చేసిన అనేక విమర్శలను బట్టి వారిపై అపారమైన అంచనాలున్నట్లు అర్థంచేసుకోవాలి. వారు ఎవరు? లెనిన్ అంచనాలను అనుసరించి వారు మౌలికంగా ' బూర్జువా డెమోక్రాట్లు'. అయినప్పటికీ, ప్రారంభంలో దేశంలోని వారి ర్యాంకుల నుండే కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకులు తయారయ్యారు.

ఆపాటికే 1926 మార్చిలో భగత్‌సింగ్ 'నవ జవాన్ భారత్ సభ'ను స్థాపించారు. దానితో భగత్‌సింగ్‌కు సోషలిజం పట్లగల అనుబంధం స్పష్టమైంది. 1928లో చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్‌ల నాయకత్వంలో దేశవ్యాపితంగా ఉన్న విప్లవ గ్రూపులు డిల్లీలో కలుసుకున్నాయి. వారు తమ సంస్థకు "హిందుస్థాన్ సోషలిస్ట్

రిపబ్లికన్ ఆర్మీ”గా నామకరణంచేశారు.

**మూడు భావిదృశ్యాలు(విజన్స్) :**

చౌరాచౌరీ సంఘటన అనంతరం 1921లో గాంధీ సహాయనిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించారు. 1921లోనే భారత కమ్యూనిస్టుపార్టీ స్థాపించబడింది. 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పడింది. ఈ మూడు సంఘటనలతో భావి దృశ్యాలు (విజన్స్) పై ఒక తీవ్రమైన యుద్ధం ప్రకటించబడింది. ఆ యుద్ధం భవిష్యత్ స్వేచ్ఛా భారతదేశం, దాని రాజ్య చట్రం లక్షణాలు ఎలా ఉండబోతున్నాయో తెలియజేసింది.

ఆ మూడు దృశ్యాల మధ్య ఒక నిరంతర యుద్ధం ఆవిర్భవించింది. ఆది, స్వతంత్ర భారత రాజ్యంలో ఎలాంటి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక లక్షణాలు ఉండాలో నిర్దేశించింది.

**ఆ మూడు విజన్‌లు :**

1. బూర్జువాల విజన్, అది స్వతంత్రమైన, ప్రజాస్వామిక భారతదేశం. జాతీయ బూర్జువాల అభివృద్ధి, వారి ప్రయోజనాల కోసమే ఉద్దేశించబడింది.

2. వామపక్ష విజన్, దేశం వలస బానిసత్వం, భూస్వామ్య పీడన నుండి విముక్తికావాలి. కార్మికులు, కర్షకుల ప్రయోజలనాలను పరిరక్షించే ఒక రాజ్యం స్థాపించబడాలి.

3. మతోన్మాద విజన్, ఆర్ఎస్ఎస్, ముస్లింలీగ్‌లు దాని కోసం పోరాడు తున్నాయి. అవి మతం ప్రాతిపదికపై దేశాన్ని విభజించాలని కోరాయి. అవి రెండూ దేశ స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా నిలిచాయి.

భారతదేశపు వాస్తవమైన, సుసంపన్న బహుళత్వం, భిన్నత్వాలను మతేతర స్రవంతులు గుర్తించాయి. భారతదేశం, దాని ప్రజల ఐక్యతను సంఘటితపరచాలంటే, సుసంపన్నమైన భిన్నత్వాల మధ్య సామాన్య లక్షణాలుగల స్రవంతులను పటిష్టంచేయాలి. ఈ బహుళత్వంలోని –భాష, జాతి, మతం, సంస్కృతివంటి ప్రతి అంశమూ గౌరవించ బడాలి. సమాన ప్రాతిపదికపై నిర్వహించబడాలి. దానిపై ఏకరూపకతను విధించేందుకు ఏ విధమైన ప్రయత్నంచేసినా అది సామాజిక విచ్ఛితికి దారితీస్తుందన్న వాస్తవాన్ని అది గుర్తించింది.

‘భారత్ అనే ఆలోచన’ (ఐడియా ఆఫ్ ఇండియా) భారత స్వాతంత్ర్య పోరాట కాలంలోనే ఆవిర్భవించింది. ‘భారత్ అనే ఆలోచన’ (ఐడియా ఆఫ్ ఇండియా) అంటే ఏమిటి ? సూక్ష్మంగా చెప్పాలంటే, భారత్ ఒక దేశంగా, అపారమైన భిన్నత్వాలను

అధిగమించే దిశగా పయనిస్తున్నది. అది మన ప్రజలను తగువిధంగా ఐక్యపరిచే దిశలో పురోగమిస్తున్నది.

ఈ అవగాహన ఆధారంగా ప్రధాన స్రవంతి కాంగ్రెస్ విజన్ అంతర్లీనంగా వ్యక్తీకరించబడింది. అంటే భావి భారత దేశం బూర్జువాల నాయకత్వంలోని ఒక లౌకిక, ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా ఉండాలని కాంగ్రెస్ కోరుకుంది. కమ్యూనిస్టుల విజన్ : "లౌకిక, ప్రజాస్వామ్య రిపబ్లిక్ సంఘటితపడాలంటే దేశపు రాజకీయ స్వాతంత్ర్యం ప్రతి భారతీయునికీ సామాజిక, ఆర్థిక స్వేచ్ఛను సాధించాలి. అది కేవలం సోషలిజంలోనే సాధ్యమౌతుంది" అని నిర్దేశించింది.

స్వాతంత్రోద్యమానికి దూరంగా ఉన్నవారిది మూడవ విజన్. ఇది పై రెండింటికీ పూర్తిగా భిన్నమైనది. స్వతంత్ర భారత స్వభావం భారత ప్రజల మతపరమైన అనుబంధాలపై ఆధారపడి నిర్ధారించబడాలనేది ఈ విజన్‌లో ప్రధాన అంశం. అందులోనూ జంట అభిప్రాయాలున్నాయి: ముస్లింలీగ్ ' ఇస్లామిక్ రాజ్యం' కోసం పోరాడింది. ఆర్ఎస్ఎస్ 'హిందూ రాజ్యం' కోసం పోరాడింది. దురదృష్టకరమైన దేశ విభజనతో ముస్లిం లీగ్ లక్ష్యం నెరవేరింది. అందుకు బ్రిటీష్ వలస పాలకుల కుట్రలు, కుతంత్రాలు ఉపకరించాయి. ఫలితంగా నేటికీ ఉద్రిక్తతలు, అపోహలు పెట్రేగుతూ చీడపురుగుల్లా వెంటాడుతున్నాయి.

మన దేశవిభజనతో ఇరువైపులా ప్రజల వలసలు భారీగా చోటుచేసు కున్నాయి. బహుశా మన ఉపఖండంలో ఇంతటి భారీ వలసలకు దారితీసిన సంఘటన ఇదొక్కటే కావచ్చు. సుమారుగా 1.5 కోట్ల మంది అటూఇటూ సరిహద్దులను దాటారు. (నాటి అంచనాల ప్రకారం భారత్ వైపు 72,95,870మంది, పాకిస్థాన్ వైపుకు 72,26,600 మంది ప్రజలు నిర్వాశితులయ్యారు). మత ఘర్షణల్లో 10 నుండి 20 లక్షల మందిని చంపేశారు. అదొక భయానకమైన అనుభవము. నాటి గాయాలు, అపోహలూ నేటికీ ప్రకోపిస్తున్నాయి. ఆ దుస్సంఘటనలో హిందువులు, ముస్లింలు, సిక్కులూ అందరూ బాధితులే.

ఇక ఆర్ఎస్ఎస్ స్వాతంత్రోద్యమ కాలంలో తన విజన్‌ను సాధించటంలో విఫలమైంది. ఆధునిక భారతదేశాన్ని తమ దీర్ఘకాల ప్రాజక్టు అయిన ఆవేశభరిత, అసహనపూరిత ఫాసిస్టు 'హిందూ రాజ్యం'గా మార్చేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. వర్తమాన భారతంలో జరుగుతున్న సైద్ధాంతిక పోరాటాలు, రాజకీయ వివాదాలు ఈ మూడు విజన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధానికి ప్రతిరూపాలే. ఈ యుద్ధం హెచ్చుతగ్గులుగా కొనసాగుతుందని చెప్పనవసరం లేదు. అది 'భారత్ అనే ఆలోచన' (ఐడియా ఆఫ్ ఇండియా) సాధనకు అవసరమైన దిశను, ఆ క్రమపు

పరిమాణాన్ని నిర్వచించేందుకు ఉపకరిస్తుంది.

**కమ్యూనిస్టుల వెనుకపట్టు, సవాళ్లు :**

భారత కమ్యూనిస్టు పార్టీ తాష్కెంట్‌లో ఏర్పడింది. దాని ప్రభావంతో, భారతదేశంలోని జాతీయ విప్లవకారులు క్రమంగా ప్రజా విప్లవ కార్యాచరణ ఆలోచనలను గ్రహించసాగారు. కార్మిక, కర్షక, ఇతర పీడిత వర్గాల సమరశీల సంస్థలు ఏర్పడ్డాయి. వందలు, వేలాది సభ్యులను సమీకరించగల్గాయి. సైద్ధాంతిక స్థాయిలో, సమరశీలమైన ప్రజా పోరాటాల స్థానంలో వ్యక్తిగత చర్చలు చోటుచేసుకుంటున్నాయి. అవి గాంధేయ అహింసా వాదానికి విరుగుడుగా ఉన్నాయి. అస్పష్టమైన స్వరాజ్ ఆలోచనలకు భిన్నమైన, సంపూర్ణ స్వాతంత్ర్యం, బ్రిటీష్‌తో సంబంధాలు తెంచుకోవటంవంటి మరింత నిర్దిష్టమైన లక్ష్యాలు ముందుంచాయి. స్వాతంత్ర్యం డిమాండును, రాజకీయ స్థాయి నుండి ఆర్థిక స్వావలంబన స్థాయికి పొడిగించారు. కార్మిక, కర్షక ఐక్యత కోసం విస్తృతమైన రాజకీయ ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారు.

విస్తారమై స్వాతంత్ర్య పోరాట యోధులను ఉద్యమంలోకి సమీకరించారు. వారిని శ్రామిక, అర్ధ శ్రామిక సమరశీల భావాలు ఆవహించాయి. ఒక విశాలమైన విప్లవ సంఘటనగా 'కార్మికులు, కర్షకుల' పార్టీ ఏర్పడవలసి వచ్చింది. దానిలో, భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన చురుకైన కార్యకర్తలు శక్తివంతంగా పనిచేయసాగారు.

పై అంశాలన్నింటి ప్రభావం కాంగ్రెస్‌లో 'అధినివేశ ప్రతిపత్తి' లేక 'సంపూర్ణ స్వాతంత్ర్యం' అంశాల మధ్య చారిత్రక చర్చలకు దారితీసింది. 1929లో జాతీయ కాంగ్రెస్ లాహోర్ సభలు జరిగాయి. జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతవహించారు. నెహ్రూ తన అధ్యక్షోపన్యాసంలో తానొక సోషలిస్టునని ప్రకటించారు. 15 నెల్ల అనంతరం కారాచీ కాంగ్రెస్ సమావేశం జరిగింది. అందులో ప్రజల ప్రాథమిక హక్కులపై తీర్మానం ఆమోదించబడింది. ఈ కాలపు నెహ్రూ వైఖరులపై ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఇలా విశ్లేషించార: "ఆ విధంగా నెహ్రూ, గతంలోవలే సోషలిజం, కమ్యూనిజాలకు బహిరంగ మద్దతును కొనసాగించారు. అదే సమయంలో ఆచరణలో గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకుల విధానాలకే లోబడి ఉన్నారు."

భారత కమ్యూనిస్టు పార్టీ మొదట తాష్కెంట్‌లోను, ఆపై కాన్పూరులోను ఏర్పడింది. ఆ పార్టీ భావజాలం, లక్షలాది ప్రజానీకాన్ని ఆవహించింది.

ఈ పరిణామాల పర్యవసానంగా విప్లవ గ్రూపుల్లో 'బాంబుల ఆరాధన' (బాంబ్ కల్ట్) పనిచేయటం మానేసింది. ఆ విధానం, మూడు దశాబ్దాల పాటు మిలిటెంట్

గ్రూపులకు ఒక సైద్ధాంతిక పునాదిగా పనిచేసింది. దాని స్థానంలో 'సమరశీల ప్రజా సంస్థల పోరాటాల ప్రణాళిక' చోటుచేసుకుంది. అది,1930-32 కాలంలో లక్షలాది స్త్రీ, పురుషులను ప్రభావితంచేసింది. వారందరూ కాంగ్రెస్ నాయకత్వంలో సాగిన అనేక సామూహిక ప్రత్యక్ష కార్యాచరణల్లో చురుకుగా పాల్గొన్నారు. సోవియట్ యూనియన్ వేగవంతమైన అద్భుత ఆర్థికాభివృద్ధిని సాధించింది. అదే కాలంలో భారత్‌తో సహా పెట్టుబడిదారీ ప్రపంచం చరిత్రలో కనీవినీ ఎరుగని సంక్షోభంలో కూరుకుపోసాగింది. ఈ పరిస్థితులు సోవియట్‌కి అనుకూలంగా ప్రజలను ప్రభావితంచేశాయి. బాహ్యంగా సోవియట్‌తో పాటు, అంతర్గతంగా దేశంలో నెలకొన్న పరిణామాలు కాంగ్రెస్‌లోని వామపక్ష వాదుల వైఖరిలో ప్రధానమైన మార్పుకు దారితీశాయి. 1933-34లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సియస్‌పి) ఏర్పడింది. కాంగ్రెస్ వాదుల్లోని ఒక పెద్ద భాగం ఆలోచనలు, అవగాహనల్లో జరిగిన మార్పుల పర్యవసానంగా మాత్రమే ఆ పార్టీ ఏర్పాటు సాధ్యమైంది.

ఈ కాలంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ తాను ఎదుర్కొంటున్న నిర్మాణ, రాజకీయ, సైద్ధాంతిక ఇబ్బందులను అధిగమించగల్గింది. 1930 దశాబ్దపు మధ్య కాలం మూడు విభిన్న వామపక్ష ధోరణల సహజీవనానికి సాక్షీభూతంగా నిలిచింది. మొదటిది, నిర్వచించడానికి వీలుకాని కాంగ్రెస్ వాదుల సమూహం. వీరు సోషలిజం గురించి అస్పష్టంగా మాతట్లాడతారు. వారికి సోవియట్ యూనియన్‌పట్ల అపారమైన సానుభూతి ఉంది. వారు ఫాసిజం వ్యతిరేకులు. శ్రామిక ప్రజల హక్కులు, స్వేచ్ఛలకు మద్దతుగా నిలుస్తారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆ గ్రూపులో బాగా గుర్తింపుగల నాయకుడు.

రెండవది, నూతనంగా ఏర్పడిన సంస్థలోని కాంగ్రెస్ సోషలిస్టులు. కాంగ్రెస్‌లో పనిచేయాలన్నది వారి అనివార్యమైన బాధ్యత. కానీ వారు తమంతతాముగా ప్రత్యేక పార్టీగా ఏర్పడినారు. మూడవది, భారత కమ్యూనిస్టు పారీ. అది పునఃనిర్మించబడింది. ఆ పార్టీ పోలిట్‌బ్యూరో, కేంద్రకమిటీలు మిగిలిన రెండు గ్రూపులతో సన్నిహిత సంబంధాలుకలిగి ఉన్నాయి, సహకరిస్తున్నాయి.

ఈ మూడు గ్రూపుల ఆవిర్భావం, వాటి మధ్య నెలకొన్న సహకారం వల్ల 1930 దశాబ్దపు మధ్య భాగం తర్వాత కాలం చాలా విశిష్టమైనది. ఆ కాలంలో ఒక నూతన సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువ దేశాన్ని కుదిపేసింది. ఈ కాలంలో, కార్మికోద్యం లో ఐక్యతా నిర్మాణానికి కృషిజరిగింది. అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటైంది. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఆవిర్భవించింది. ఒక అభ్యుదయ సాహిత్య, సాంస్కృతిక ఉద్యమం అభివృద్ధిచెందింది. వామపక్షం, ఐక్య కార్యాచరణలు పెరిగాయి. సాధారణంగా, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం వేగంగా ముందడుగువేసింది.

**చెలరేగిన ఫాసిజం, దానికి వ్యతిరేకంగా రాజకీయ సర్దుబాట్లు :**

కమ్యూనిస్టు పార్టీ ఆరంభం నుండీ శ్రామిక వర్గ అంతర్జాతీయత విధానంపై ఆధారపడి పనిచేసింది. అక్టోబరు విప్లవము, సోవియట్ సాధించిన అద్భుత ప్రగతి, అవి సమకూర్చిన ప్రేరణతోపాటు; అంతర్జాతీయ శ్రామికవర్గ ఉద్యమం అందించిన మద్దతు కూడా దాని అభివృద్ధికి ఉపకరించింది. ఈ విధంగా కోలుకుంటున్న దశలో, 1935 ఆగస్టులో కొమింటరన్ ఏడవ మహాసభ మాస్కోలో జరిగింది. ఫాసిజం ప్రపంచ వ్యాపితంగా ఆవిర్భవించటం అత్యంత ప్రమాదకరమైన పరిణామంగా ఆ మహాసభ గుర్తించింది. ప్రత్యేకించి, జర్మనీలో హిట్లర్ అధికారం చేపట్టాక (1933) ఆ ప్రమాదం మరింత తీవ్రతరమైంది. జార్జి డిమిట్రోవ్ ఆ మహాసభలో ఒక విస్తృతమైన 'ప్రజల ఐక్య సంఘటన'కు పిలుపినిచ్చాడు. ఆ సంఘటనలో సోషల్ డెమోక్రాట్లు, ఇతర ఫాసిస్టు వ్యతిరేక శక్తులు కూడా కలసిరావాలని కోరాడు. దానికి తోడు వాంగ్ మిన్ వలస దేశాలు గురించి మాట్లాడాడు. భారత కమ్యూనిస్టులు, జాతీయ కాంగ్రెస్ లోపల తమ కృషిని నిర్లక్ష్యంచేయరాదని ఉద్బోధించాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటనలో భారత జాతీయ కాంగ్రెస్ నమ్మకమైన భాగస్వామిగా ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు రజనీ పామీదత్, బెన్ బ్రాడ్లీ ఇరువురూ కలసి, "భారత్‌లో సామ్రాజ్యవాద వ్యతరేక ప్రజా సంఘటన" శీర్షికతో ఒక ముఖ్యమైన వ్యాసాన్ని తయారుచేశారు (1936 ఫిబ్రవరి). అది " దత్ బ్రాడ్లీ థీసిస్"గా గుర్తింపు పొందింది. ఆ వ్యాసంలో, ఫాసిజంతో నిర్ధిష్టంగా సంభవించనున్న పర్యవసానాలు గురించి పేర్కొన్నారు.

ఆ థీసీస్‌లో నొక్కి వక్కాణించబడిన ముఖ్యమైన అంశాలు: 1. అత్యంత విశాలమైన ఐక్యతకు ప్రాతిపదికగా అ. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలకడైన పోరాటం కొనసాగాలి. ఆ. పీడిత ప్రజల ప్రాణాధారమైన అవసరాల కోసం పోరాటం చేయాలి. 2. "జాతీయ విముక్తిని కోరుతున్న విభిన్న శక్తుల్లో కాంగ్రెస్ పెద్ద ప్రజా సంస్థగా ఉంది. 3. గత కాలపు కాంగ్రెస్ నాయకత్వాల కార్యాచరణలు వినాశకరమైనవి. అవి సామ్రాజ్యవాదానికి దాదాపు లొంగిపోయేట్లున్నవి. 4. అందువల్ల కాంగ్రెస్ నాయకత్వాన్ని విమర్శించాల్సిన అవసరముంది. అయితే ఆ విమర్శ కాంగ్రెస్‌ను సరైన గాడిలో పెట్టడానికే మినహా దానిలో ఇప్పటికే ఉన్న శక్తుల ఐక్యతను బలహీనపరచడానికి కాదు. 5. కాంగ్రెస్ సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా సంఘటనగా మార్పు చెందడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. 6. కార్మిక, కర్షక, యువజన తదితర ప్రజాసంఘాలను అభివృద్ధిచేయాలి. కాంగ్రెస్‌తో వాటి అనుబంధం కోసం శ్రమించాలి. 7. కాంగ్రెస్‌ను ప్రజాతంత్రయుతంగా మలచాలని డిమాండుచేయాలి. (ఉదా: ఎన్నికైన వర్కింగ్

కమిటీ). 8. కాంగ్రెస్‌కు కనీస కార్యక్రమాన్ని అందించాలి. ఆ కార్యక్రమంలో సంపూర్ణ స్వాతంత్ర్యం, పౌర హక్కులు (సమ్మె హక్కుతో సహా), అణచివేత చట్టాలు ఉపసంహరణ, రాజకీయ ఖైదీల విడుదల, కార్మిక హక్కులు (8 గంటల పనితో సహా), రైతాంగానికి 50 శాతం కౌలు రాయితీ, భూస్వాములు వడ్డీ వ్యాపారులు గుంజుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు రైతాంగానికి రక్షణ వంటివి ఉండాలి. 9. 'అహింస' అనేది కాంగ్రెస్‌కు అవసరమైన నమ్మకమా అని ప్రశ్నించాలి. కానీ ఆ ప్రశ్న జాతీయ సంఘటన నుండి కాంగ్రెస్ విడిపోయేందుకు మాత్రం ఉద్దేశించబడరాదు. 10. కాంగ్రెస్ సోషలిస్టులు, కార్మిక సంఘాలు, కమ్యూనిస్టులు, వామపక్ష కాంగ్రెస్ వాదులతో కూడిన వామపక్షం సంఘటిత పడాలి. దానిలో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ (సియస్‌పి) ఒక ప్రత్యేకమైన పాత్ర పోషించాలి. 11. రానున్న ఎన్నికల్లో, అనేక మంది వామపక్ష అభ్యర్థులు పోటీచేయాలి (1935 చట్టం ప్రకారం).ఎన్నికల్లో, జాతీయ సంఘటన (ఓట్లు) చీలికను నివారించాలి. 12. రాజ్యాంగ పరిషత్తు నినాదమైన 'భారత్‌కు స్వంత రాజ్యాంగం కావాల'న్నది కేంద్ర నినాదంగా రూపొందాలి.

దత్ బ్రాడ్లీ థీసీస్‌ను కమ్యూనిస్టులు శీఘ్రంగా ఆమోదించారు. దాని నుండి, దాదాపు వెనువెంటనే ఫలితాల సాధనకు సిద్ధపడ్డారు. 1936 జనవరిలో మీరట్‌లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ జాతీయ కార్యనిర్వహవర్గం (ఎగ్జిగ్యూటివ్) సమావేశాలు జరిగాయి. ఆ పార్టీపై ఆపాటికే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటరన్) 7వ మహాసభ ప్రభావం నెలకొని ఉంది. ఈ సభలో కమ్యూనిస్టులను కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) లో చేరటాన్ని అనుమతించారాదన్న 1934 నాటి నామమాత్రపు నిషేధాన్ని ఉపసంహరించుకున్నారు. 1936 ఏప్రిల్ నుండి వ్యక్తిగత ప్రాతిపదికపై సిఎస్‌పిలో చేరేందుకు కమ్యూనిస్టులను అనుమతించారు. దానితో వారు కాంగ్రెస్‌లోకి కూడా సమర్ధవంతంగా చేరగల్గారు.

జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన, లక్నోలో కాంగ్రెస్ సాధారణ సమావేశాలు జరిగాయి (1936 ఏప్రిల్). అక్కడ వామపక్షం తన ఉనికిని గణనీయంగా నిలుపుకో గల్గింది. నెహ్రూ సోషలిజం గురించి మాట్లాడారు. 'పరిమిత స్థాయిలో మాత్రమే ప్రైవేట్ ఆస్థిని రద్దుచేయాల'ని అభిప్రాయపడ్డారు. సోవియట్‌ను పోలిన 'నూతన నాగరికత' అవసరం గురించి మాట్లాడారు. ఆ సమావేశంలో ప్రజా సంఘాలను అనుబంధం చేయాలని, ఎన్నికల అనంతరం 1935 చట్టాన్ని అనుసరించి, మంత్రివర్గ స్థానాలను నింపాలని, దామాషా పద్ధతిలో వర్కింగ్ కమిటీని ఎన్నుకోవాలని వామపక్షం ప్రతిపాదించింది. కానీ ఆ తీర్మానాలు తిరస్కరించబడ్డాయి. ఆ తీర్మానాలకు అనుకూలమైన ఓట్లు గౌరవప్రదమైన సంఖ్యలోనే ఉన్నాయి. నెహ్రూ, కాంగ్రెస్ వర్కింగ్

కమిటీలో, ముగ్గురు సిఎస్‌పి నాయకులకు (జయప్రకాష్‌నారాయణతో సహా) స్థానంకల్పించారు.

అదే లక్నో సమావేశంలో, అఖిల భారత రైతు కాంగ్రెస్ (తర్వాత 'సభ'గా మార్చబడింది), అభ్యుదయ రచయితల అసోసియేషన్‌లు యేర్పడ్డాయి. ఈ రెండు సంఘాల్లోనూ, శీఘ్రంగా కమ్యూనిస్టులు ప్రధాన శక్తిగా మారారు. రైతాంగాన్ని, రచయిలను జాతీయోద్యమం వెనుక సమీకరించారు. కమ్యూనిస్టులు తమ సైద్ధాంతిక ప్రభాన్ని కూడా విస్తరించారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెయస్) సభ్యత్వం విస్తరించింది. సమ్మె ఉద్యమాల వెల్లువ పెరగసాగింది. ఈ రెండు అంశాలూ వామపక్షం బలం దూకుడుగా పెరుగుతున్నందుకు సంకేతాలుగా నిలుస్తాయి. 1938 ఏప్రిల్, కమిల్లా మహాసభ నాటికి ఎఐకెయస్ సభ్యత్వం ఐదు లక్షలు దాటింది. అది, 1939 గయా మహాసభ నాటికి 8 లక్షలకు చేరింది. 1938లో ఎఐకెయస్ ఎర్రజండాను తన బ్యానర్‌గా ఆమోదించింది. పారిశ్రామిక సమ్మెల కారణంగా నష్టపోయిన పని దినాలు 1935 నాటికి 10 లక్షల లోపుగా ఉన్నాయి. అవి 1936లో 24 లక్షలకు, 1937లో దాదాపు 90లక్షలకు పెరిగాయి. 1938లో 90లక్షలకు మించిపోయాయి. ఈ ధోరణి ఒక సమరశీల కార్మిక సంఘాల శక్తికి సంకేతంగా నిలుస్తుంది. 1937-8లో, 7 రాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రివర్గాలు అధికారంచేపట్టాయి. కమ్యూనిస్టులపై గతంలో విధించబడిన నిషేధం ఆచరణలో ముగిసింది. అది కూడా కమ్యూనిస్టులు తమ ప్రభావంలోని ప్రాంతాలను విస్తరించుకునేందుకు సహాయపడింది.

**హిందుత్వ విజన్, స్వేచ్ఛా భారత్ :**

ఆర్ఎస్ఎస్ పుట్టుకకు రెండు సంవత్సరాల ముందు, 1923లో విడి సావార్కర్ హిందూత్వ ముఖ్యాంశాలు (ఎస్సెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ) అనే శీర్షికతో ఒక సైద్ధాంతిక కరపత్రాన్ని ప్రచురించాడు. అనంతరం, ముద్రించే క్రమంలో దాని శీర్షికను "హిందూత్వ: ఎవరు హిందు" (హిందుత్వ:హు వాజ్ ఎ హిందు)గా మార్చాడు.

ఆ సైద్ధాంతిక కరపత్రం సారాంశం ఇలా ఉంది: "తమ విశ్వాసాలతో నిమిత్తం లేకుండా ప్రజలందరూ భారత్‌ను తమ మాతృభూమి, పితృభూమి, పుణ్యభూమిగా తలుస్తారు. అవన్నీ హిందుత్వ పరిధిలోకి వస్తాయి. కొందరు భారతదేశంలో నివశిస్తుంటారు. కానీ వారి పుణ్యభూమి - ముస్లింల వలే(మక్కా మదీన), క్రిష్టియన్‌ల వలే (ప్రస్తుతం శిధిలమైన పాలస్థీనా భూములు జెరుసలెం, బెత్లెహాం వంటివి) వేరుగా ఉంటాయి. అవి హిందుత్వ పరిధికి వెలుపలి ప్రాంతాలు.

హిందుత్వ అనేది ఒక రాజకీయ ప్రాజక్టుగా సావార్కర్ నిర్ధారించాడు. దానికి హిందు మతంతో ఎలాంటి సంబంధంలేదని తెలిపాడు. హిందుత్వను స్థాపించటమంటే

"సైన్యాన్ని హిందువులుగా మార్చటం - హిందువులను సైనికులుగా మార్చటం" అని నినదించాడు. అది-వర్తమాన 'అగ్నిపథ్'కు; విషపూరిత ద్వేషం, హింస, ఉగ్రవాద హిందుత్వ ప్రచారాలకు ప్రేరణనిస్తున్నది.

ఆర్ఎస్ఎస్ జాతీయవాద నిర్మాణము, దాని భావజాల - సైద్ధాంతిక సమర్ధనలు ఎందుకోసం? అవి కేవలం దాని 'హిందు రాష్ట్ర' స్థాపన కోసం మాత్రమే ఉద్దేశించబడ్డాయి. (హిందూ రాష్ట్ర అనేది హిందుయిజంకు భిన్నమైనది. హిందుయిజం ఒక మతం. హిందూ రాష్ట్ర ఒక రాజకీయ ప్రాజెక్టు. వాస్తవంగా దాన్ని 'హిందుత్వ రాష్ట్ర'అని పిలవాలని ఉద్భోధించారు.) దీన్ని మొదట నాటి సర్‌సంఘ్‌సంచాలక్ లేదా ఆర్ఎస్ఎస్ అగ్రనేత "మేము మా జాతీయత నిర్వచనం" (ఉయ్ అండ్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్) గ్రంధంలో పేర్కొన్నాడు. ఆ గ్రంధం మొదట1939లో ప్రచురించబడింది. అది ఆర్ఎస్ఎస్ లక్ష్యమైన ఫాసిష్టు హిందుత్వ రాజ్య సాధనకు అవసరమైన ఒక సైద్ధాంతిక పునాదిని అందించింది. నిర్మాణ చట్రాన్ని నెలకొల్పటంలో సహకరించింది.

చనిపోయిన ఆర్ఎస్ఎస్ అధినేత దీని గురించి ఇలా చెప్పారు: "ఈ భూమి, విదేశీ జాతుల దురాక్రమణలకు ముందు, 8-10వేల సంవత్సరాలకు పైగా వివాద రహితంగా, హిందువుల అధీనంలోనే ఉంది. అందుకే ఈ భూమి హిందూస్థాన్‌గా అంటే, హిందువుల భూమిగా గుర్తింపుపొందింది.(ఎంఎస్ గోల్వాల్కర్,1939, పేజి 6). చారిత్రక వాస్తవాలను వారు పట్టించుకోరు. హిందుస్థాన్ అన్న పదాన్ని అరబ్బులు సింధు నదికి ఆవలగల భూములను వర్ణించేందుకు కొత్తగా సృష్టించారు. ఈ భూములపై నివాసులను హిందువులని పిలిచారు. (అరబ్ భాషలో'స'ను, 'హ'గా పలుకుతారు)

హిందువులు నిరంతరం, ఒక జాతిగా కొనసాగుతారని హిందు ఆధిపత్య వాదులు నిర్ధారించారు. అది ఒక అశాస్త్రీయమైన, చరిత్రతో నిమిత్తంలేని విశ్లేషణ. ఆ విశ్లేషణ, ' హిందుత్వ నేషన్'వంటి అసహనపూరిత, ఫాసిస్టు అంశంపై ఆధారపడుతున్నది.

హిందూస్థాన్‌లో హిందూ దేశం మినహా మరేమీ ఉండదు, ఉండరాదు అని వీళ్లు మనపై రుద్దుతున్నారు. ఇదే గనుక అంగీకరిస్తే హిందు - జాతి, మతము, సంస్కృతి, భాషలకు సంబంధం లేనివన్నీ "జాతీయ జీవనం"లో భాగం కాకుండా పోతాయి.

1939 నాటి గోల్వాల్కర్ సందేశం ఇలా ఉంది: "దేశంలో పలు ఉద్యమాలు నడుస్తున్నాయి. అవి హిందూ దేశాన్ని పునర్నిర్మించగలగాలి. పునరుజ్జీవింపజేయగలగాలి. వర్తమాన స్తబ్దత నుండి బైటపడేయగలగాలి. అలాంటి ఉద్యమాలే నిజమైన జాతీయో ద్యమాలు. హిందూ జాతిని, దేశాన్ని కీర్తించే అభిలాషగల వారే నిజమైన జాతీయ

దేశ భక్తులు. అలాంటివారే కార్యాచరణలోకి ప్రేరేపించబడతారు. వారే ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు పోరాడుతారు. మిగిలిన వారందరూ దేశద్రోహులు. దేశ ప్రయోజనాలకు శత్రువులు. లేదా ఉదారంగా చెప్పాలంటే బుద్ధిహీనులు." (గోల్వాల్కర్, పిపి. 43–44)

"భారత దేశం అనే భావన" (ఐడియా ఆఫ్ ఇండియా) అనేది స్వాతంత్ర్య పోరాటం ఆశించినట్లు అందరినీ కలుపుకుపోయే విజన్. అందుకే ఈ దృక్పథానికి, గోల్వాల్కర్ ప్రతిపాదించిన పై ప్రత్యేక విజన్ పూర్తిగా భిన్నమైనది. జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గ్రంథంలో ఇలా వక్కాణించారు: "భారతదేశం గతంలో రాసిన రాతను చెరిపేసి మళ్లీ రాసే పలక వంటిది. అనేక ఆలోచనలు, స్వప్నావస్థలు దానిలోపలి పొరల్లో లిఖించబడ్డాయి. అయినప్పటికీ గతంలో రాసిన రాతలు పూర్తిగా దాచేయనూ బడలేదు, పూర్తిగా తుడిచేయనూ బడలేదు."

ఇంకా రబీంద్రనాథ్ ఠాగూర్ ఇలా పేర్కొన్నారు: "ఆర్యులు, అనార్యులు, ద్రావిడులు, చైనీయులు, సైథియన్‌లు, హూన్‌లు, పఠాన్‌లు, మొగలులు అందరూ కలసిపోయారు. ఒక శరీరంలో లీనమైనారు. ఆ శరీరమే భారతదేశం."

ఆ విధంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాజక్టు ఒక తిరోగమన పూరితమైనది. అది అందరినీ మిళితం చేసుకునే 'భారత దేశం అనే భావన' (ఐడియా ఆఫ్ ఇండియా)కు భిన్నమైనది. వారు తమ ఫాసిస్టు 'హిందూ రాష్ట్ర'ను స్థాపించేందుకు అవసరమైన 'హిందుత్వ జాతీయవాదా'న్ని మాత్రమే ప్రోత్సహిస్తున్నారు.

కమ్యూనిస్టు స్వాతంత్ర్య పోరాట యోధుల పాత్ర సముచితంగా లిఖించబడింది. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరోలోని 9 మంది వ్యవస్థాపక సభ్యులందరూ స్వాతంత్ర్య పోరాట యోధులే. వారందరూ సుదీర్ఘకాలం బ్రిటిష్ జైళ్లలోను అనంతరం కాంగ్రెస్ పాలనలోని జైళ్లలోనూ నిర్బంధించబడినవారే. ఎకె గోపాలన్ 1947 ఆగస్టు 15న కన్ననూరు జైల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాడు. బ్రిటీష్‌వారు ఆయనను ఆ జైల్లో నిర్బంధించారు. హరికిషన్ సూర్జిత్ విద్యార్థిగా ఉండగా బ్రిటీష్‌వారిచే అరెస్టుచేయబడ్డాడు. కారణం, 1932లో ఆయన బ్రిటీష్ పతాకాన్ని దించేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించాడు. అండమాన్‌లోని సెల్యూలర్ జైలు వద్ద పాలరాతిపై లిఖించబడిన పేర్లలో అత్యధికంగా కమ్యూనిస్టులు విప్లవ గ్రూపుల వారి పేర్లే చోటుచేసుకున్నాయి.

అందుకు భిన్నంగా ఆ ఫలకంలో ఆర్‌ఎస్‌ఎస్‌వారి పేరు ఒక్కటీ లేదు. వాస్తవంగా ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్య సమరానికి దూరంగా ఉంది. మతోన్మాద దాడులు, వివాదాలను రెచ్చగొట్టడంపై తన దృష్టిని కేంద్రీకరించింది. స్వాతంత్ర్య పోరాటంలో

తమకు సంబంధముందని ఆ సంస్థ చెప్పుకోగలిగింది ఒక్కరి గురించి మాత్రమే. అతడు విడి సావార్కర్. చిరకు అది కూడా చాలా వరకు కల్పితమే. సృష్టించబడినదే.

ఆర్సి మజందార్ అద్భుతమైన జాతీయోద్యమ చరిత్రకారుడు. హిందుత్వ ధోరణుల పట్ల సానుభూతిపరుడు. 1913 నవంబరు 14న అండమాన్ సెలూలర్ జైలు నుండి తన విడుదలను కోరుతూ సావార్కర్ ఒక క్షమాబిక్ష అభ్యర్థన (మెర్సీ పిటీషన్)ను బ్రిటీష్‌వారికి అందించినట్లు ముజుందార్ తన డాక్యుమెంటులో పైర్కొన్నాడు. ఈ లొంగుబాటు సావార్కర్ బ్రిటీష్ వారి "విభజించి పాలించు" విధానానికి బహిరంగ మిత్రుడిగా మారినట్లు ఆ డాక్యుమెంటు వెల్లడించింది.

తన పిటీషన్‌లో అతడు, బ్రిటీష్‌వారికి ఇచ్చిన హామీ ఇలా ఉంది: " నేడు భారతదేశం, మానవాళి మంచిని హృదయపూర్వకంగా కోరే మనిషి ఎవ్వడూ గుడ్డిగా ముళ్ల బాటలో అడుగిడబోడు. 1906-1907 కాలంలో భారత్‌లో ఉద్రేకపూరితమైన, నిస్సహాయ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ పరిస్థితుల్లో భ్రమలకులోనైనాము. శాంతి, అభివృద్ధి మార్గాన్ని వదిలేశాము. కనుక అనేక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, దయతో నన్ను విడుదలచేయండి. నేను, ఇతరులు చేయలేని విధంగా ఇంగ్లీష్ ప్రభుత్వానికి విధేయుడిగా ఉంటాను. మీ రాజ్యాంగ పరమైన ప్రగతికి గట్టి సమర్ధకుడిగా పనిచేస్తాను. అది ఆ ప్రగతికి అగ్రగామి షరతుగా నిలుస్తుంది." (ఆర్సి ముజందార్, 'పేనల్ సెటిల్‌మెంట్ ఇన్ అండమాన్స్, పిపి .211-213)

ఇంకా అతడు ఒక లేఖలో బ్రిటీష్ అధికారులకు ఇలా రాశాడు: "దీని ద్వారా నేను ఒక సత్యాన్ని గుర్తిస్తున్నాను. నాపై పరిశుద్ధమైన విచారణ జరిగింది. న్యాయమైన తీర్పు ఇవ్వబడింది. నేను గతంలో అనుసరించిన హింసాయుత పద్ధతులను హృదయ పూర్వకంగా అస్యహించుకుంటున్నాను. ప్రభుత్వ చట్టాన్ని, రాజ్యాంగాన్ని శక్తిమేరకు నిలబెట్టడం నా బాధ్యతగా స్వీకరిస్తాను. భవిష్యత్‌లో నన్ను అనుమతించిన మేరకు, సంస్కరణను జయప్రదంచేసేందుకు నేను అంగీకరిస్తున్నాను." (ఈ లేఖ ప్రతి 1995 ఏప్రిల్ 7న, ఫ్రంట్‌లైన్, పేజి 94లో ప్రచురించబడింది.)

బ్రిటీష్‌తో రాజీ చేకూరాక అతని జీవితంలో అధిక భాగం - అతని రాజకీయాలు- బ్రిటీష్ సామ్రాజ్యవాదం కంటే కాంగ్రెస్‌కు, వామపక్ష ఉద్యమాలకు వ్యతిరేకంగా నిలిచాయి. హిందూ మహాసభ నాయకుడిగా, 1942 క్విట్ ఇండియావంటి ఉద్యమాల్లో, హిందు మహాసభ, ఆర్ఎస్ఎస్ సభ్యులెవ్వరూ పాల్గొనకుండా గట్టి పంథా చేపట్టాడు. ఆ ఉద్యమాలకు మద్దతునివ్వవద్దని హిందువులకు స్పష్టమైన పిలుపు నిచ్చాడు. (అంబా ప్రసాద్ రచన- ది ఇండియన్ రివోల్ట్ ఆఫ్ 1942)

" నేను ఒక నిర్ధిష్టమైన తాఖీదును, ప్రభుత్వ విభాగాల్లో ఒక బాధ్యతలోను,

స్థానంలోనూ పనిచేస్తున్న హిందు సంఘటనల సభ్యులు అందకీ పంపాను. ఆ తాఖీదు ప్రకారం అలాంటివారు తమ బ్రాధ్యతలకు కట్టుబడి ఉండాలి. ప్రభుత్వ రోజువారి బాధ్యతలను కొనసాగించాలి.” అని రాశాడు (నూరాని, ఫ్రంట్ లైన్ 1995 డిసెంబర్,1)

1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా, బొంబాయి హోం డిపార్టు మెంటు ఇలా ప్రకటించింది: “సంఘ్ అత్యంత నిష్టతో చట్ట పరిధికి లోబడి పనిచేసింది. ప్రత్యేకంగా, 1942 ఆగస్టులో చెలరేగిన ఆందోళనల్లో భాగస్వామి అయ్యేందుకు విముఖతచూపింది. (ఆండర్‌సన్ అండ్ డామ్లే, డి. శ్రీధర్: ‘ది బ్రదర్‌హుడ్ ఇన్ శాఫ్రన్: ది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అండ్ హిందు రివైవలిజం’ గ్రంథం, విస్తా పబ్లికేషన్స్ 1987) అంతేకాదు, స్వాతంత్రోద్యమం అంతటా ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం రాచరిక సంస్థానాధీశులతో కుమ్మక్కయ్యింది. ఆ సంస్థానాధీశులు స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా బలంగా నిలిచారు. వారిలో సంఘ్‌కు సన్నిహిత మిత్రుడు కాశ్మీరు రాజు హరిసింగ్. అతడు తన సంస్థానాన్ని భారత్‌లో విలీనంచేసేందుకు తిరస్కరించాడు.

ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు వారు కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి పూనుకున్నారు. ఆ పాటికే స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రపైన చరిత్రలో సుసంపన్నంగా అక్షరబద్ధంచేయబడింది. దాని వివరాల్లోకి వెళ్లనవసరం లేదు. యావత్ భారతదేశం క్విట్ ఇండియా ఉద్యమం 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ 1992 ఆగస్టు 9-10న నాటి రాష్ట్రపతి డాక్టర్ శంకరదయాళ్ శర్మ పార్లమెంట్ అర్ధరాత్రి సమావేశంలో ప్రసంగిస్తూ ఇలా చెప్పారు: కాన్పూర్, జంషెడ్‌పూర్, అహమ్మదాబాద్ మిల్లుల్లో భారీ స్థాయి సమ్మెలు జరిగాయి. ఆ తర్వాత 1942 సెప్టెంబరు 5న ఢిల్లీ నుండి లండన్‌లోని ‘సెక్రటరీ ఆఫ్ స్టేట్’కు ఒక రిపోర్టు పంపబడింది. అందులో భారత కమ్యూనిస్టు పార్టీ గురించి ఇలా ఉంది: దాని సభ్యుల్లో అనేక మంది ప్రవర్తన నిరంతరం స్పష్టమౌతున్నది. అంటే ఆ పార్టీ బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాటు దారులతో నిండి ఉంది.”

స్వాతంత్ర్యం ప్రకటన కాలంలో బ్రిటీష్ ఇండియాలో దేశ విభజనకు పునాదులు పడ్డాయి. అందుకు భూమికగా “ద్వి జాతి సిద్ధాంతం” పనిచేసింది. విడీ సావార్కర్, ఆ ద్విజాతి సిద్ధాంతాన్ని మొదట సంపూర్ణ రూపంలో ముందుకు తెచ్చాడు. 1937లో అహమ్మదాబాద్, కర్ణావతిలో సావార్కర్ అధ్యక్షతన అఖిల భారత హిందు మహాసభ కాన్ఫరెన్స్ జరిగింది. ఆ సభలో సావార్కర్ తన అధ్యక్షోపన్యాసంలో ఇలా చెప్పారు: “ నేటి భారతదేశం ఒక ఏకీకృతమైన, సజాతీయమైన జాతి (నేషన్)గా రూపొందుతుందని మనం ఊహించరాదు. అందుకు భిన్నంగా భారత్‌లో ప్రధానంగా

రెండు జాతులు (నేషన్స్) ఉన్నాయి; హిందువులు, ముస్లింలు. (సమగ్ర సావార్కర్ వాద్మే; వాల్యూం 6, మహారాష్ట్ర ప్రాంతిక్ హిందు సభ పబ్లికేషన్, 1963-65, పేజి 296)

తర్వాత 1939 మార్చిలో మరోసారి హిందు మహాసభ సమావేశంలో సావార్కర్ ఇలా ప్రకటించాడు: 'హిందువులమైన మనం ఒక జాతికి చెందుతాం. హిందువులమైన మనం ఒక జాతిగా కట్టుబడి ఉందాం. (ఇండియన్ యానువల్ రిజిష్టర్, 1939 వాల్యూం 3)

రెండు సంవత్సరాల తర్వాత1940 మార్చి 22న అఖిల భారత ముస్లిం లీగ్ మహాసభ జరిగింది. ఆ మహాసభలో మహమ్మదాలీ జిన్నా అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ఇలా ప్రకటించాడు: "ఒక రాజ్యంలో- ఒకటి మైనారిటీ, మరొకటి మెజారిటీ అయిన రెండు జాతులు కలసి ఉంటే అసంతృప్తి పెరుగుతుంది . అలా ఏర్పడిన రాజ్యంలో అంతిమంగా విధ్వంసం పెరిగేందుకు దారితీస్తుంది."

తరువాత సావార్కర్ జిన్నాను సమర్థిస్తూ ఇలా చెప్పాడు: జిన్నా యొక్క ద్విజాతి సిద్దాంతాన్ని బలపరచటంలో నాకు ఎలాంటి వివాదం లేదు. హిందువులమైన మేము మాఅంతట మేమే ఒక జాతి. హిందువులు, ముస్లింలు రెండు జాతులన్నది ఒక చారిత్రక వాస్తవం.(ఇండియన్ యాన్యువల్ రిజిష్టర్, 1943, వాల్యూం 2)

సావర్కర్, సంఘ్‌పరివార్‌లు ద్విజాతి సిద్ధాంతాన్ని ముందుకుతేవటం ద్వారా జిన్నాకు ముందే ముహూర్తం ఖరారు చేశాయి. ఆ సిద్దాంతం దేశ విభజనకు దారితీసింది. దానికి బ్రిటీష్ వారు అపూర్వంగా సాయపడ్డారు, ప్రోత్సహించారు.

**ప్రజా ఉద్యమాలపై అణచివేత లేక యుద్ధానంతర వెల్లువ:**

1930 నాటికి, వామపక్ష పార్టీల నూతన ఐక్య సంఘటన ఏర్పదింది. అది గతంలోని వామపక్ష శక్తులకు గుణాత్మకంగా భిన్నమైనది. నూతన ఐక్యసంఘటన ఆవిర్భావం ఒక వాస్తవాన్ని సూచిస్తున్నది. అది భారత బూర్జువాలు, తమ రాజకీయ జీవితంలో ఒక స్వతంత్ర శక్తిగా పనిచేయగల పరిపక్వ స్థాయికి చేరినట్లు స్పష్టం చేస్తున్నది. స్వరాజ్, స్వదేశీ, జాతీయ విద్య - ఈ మూడు నినాదాలూ, నూతన వర్గమైన బూర్జువాల వాంఛలకు స్పష్టమైన ప్రతిబింబంగా నిలిచాయి. విప్లవకారుల్లో 'బాంబు ఆరాధన' పట్ల వ్యామోహంగల పెటీ బూర్జువాలు ముఖ్య భాగంగా ఉన్నారు. వారు, బూర్జువాలకు అతి సన్నిహితులైన యువ అనుచరులు. వామపక్షాలు, నూతన కార్మికవర్గ సిద్ధాంతం పరంగా మరింత విస్తరించాయి. సంఘటిత పడ్డాయి. దానితో, స్వాతంత్రో ద్యమంలో సోషలిజం, కమ్యూనిజం భావాలకు బీజాలు పడ్డాయి. ఇదంతా,

నిర్మాణయుత మైన భారత కమ్యూనిస్టు పార్టీలో సోషలిజం, కమ్యూనిజాలను అభిమానించే శక్తులు పెరుగుతున్న కాలం. ఆ శక్తులు సంఘటితపడటాన్ని నిరోధించేందుకు సామ్రాజ్యవాదం శక్తి కొద్దీ ప్రయత్నించింది.

1930ల ఆరంభంలో కాంగ్రెస్‌లో నిరోధింపజాలని ఒక నూతన ధోరణి పెరిగింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆవిర్భవించింది. ఈ లోగా, గతంలో ప్రస్తావించినట్లు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో పెరుగుతున్న సానుకూలతను కమ్యూనిస్టు గ్రూపులు తమకు అనుకూలంగా వినియోగించుకున్నాయి. కమ్యూనిస్టులు తమ అంతర్గత సమస్యల నుండి బైటపడేందుకు, తమ నాయకత్వంలో ఒక సుశిక్షతమైన పార్టీని నిర్మించేందుకు ఆ అవకాశాన్ని అందుకున్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టులు, వామపక్ష కాంగ్రెస్‌వాదుల త్రయం మధ్య బంధం బలపడసాగింది. ఆ పరిస్థితి, విభిన్నమైన వర్గ శక్తులు దగ్గరౌతున్నట్లు సూచించింది. ఆ శక్తుల్లో కార్మిక వర్గం, సమరశీల పెటీబూర్జువాలు, బూర్జువాల్లోని ప్రజాతంత్ర విభాగాలు ఉన్నాయి. బూర్జువాల్లోని ప్రజాతంత్ర విభాగంలో తేడాలున్నట్లు తర్వాత తెలియవచ్చింది. వారిలో కొందరు సామ్రాజ్యవాదం, ఫాసిజం రెంటికీ వ్యతిరేకులు. వారితోపాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఫాసిస్టుల సాయం తీసుకునేందుకు కూడా సంశయించని వారూ ఉన్నారు.

1939లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక సందర్భంగా తీవ్రమైన వివాదం ఏర్పడింది. ఆ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ సందర్భంగా సుభాష్ చంద్ర బోస్‌ను బలపరిచేందుకు వామపక్షంలోని మూడు శక్తులూ ఏకమయ్యాయి. అందుకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోని మితవాదులు పట్టాభి శీతారామయ్యను బలపరిచారు. కాంగ్రెస్ మితవాదుల సవాలుతో ఒక సంక్షోభ ం సృష్టించబడింది. కాంగ్రెస్ నుండి సుభాష్ చంద్రబోసును బహిష్కరించటంతో ఆ సంక్షోభం ముగిసింది. వామపక్ష కాంగ్రెస్‌వాదుల్లో నెహ్రూకు, బోస్ మద్దతుదారులకు మధ్య తేడాలు వ్యక్తమైనాయి. వారితోపాటు కాంగ్రెస్ సోషలిస్టుల్లోనూ, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టుల మధ్య కూడా ఆ తేడాలు చోటుచేసుకున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం మొదలవటంతోనూ, ఆ యుద్ధంపట్ల వారివారి వైఖరులేమిటన్న ప్రశ్న ఉదయించటంతోనూ పై విబేధాలన్నీ ఆగిపోయాయి.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సియస్‌పి)లోని కమ్యూనిస్టు వ్యతిరేక నాయకులకు, సిపిఐకి మధ్య వివాదం యుద్ధం ఆరంభానికి ముందే బైటపడింది. మినూ మసానీ, మెహతా, లోహియా సియస్‌పిలోని కమ్యూనిస్టు వ్యతిరేక గ్రూపుకు నాయకత్వం వహించారు. వారు ఆపాటికే అంతర్జాతీయంగా సోవియట్ యూనియన్‌పై తమ దాడిని ప్రారంభించారు. పార్టీ లోపల ఒక సంఘటితమైన కమ్యూనిస్టు వ్యతిరేక దాడికి పూను

కున్నారు. యుద్ధం మొదలైన తర్వాత సోవియట్ యూనియన్, నాజీ జర్మనీతో ఒక 'నిర్యుద్ధ సంధి' (నాన్ అగ్రెషన్ ప్యాక్ట్)పై సంతకంచేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆ వార్తలతో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సాగిస్తున్న సోవియట్ వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారం పరాకాష్టకు చేరుకుంది. (గతంలో కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారానికి దూరంగా ఉన్న జయప్రకాష్‌నారాయణ, ఇపుడు ఆ బృందంలోచేరారు). అందుచేత, సియస్‌పిలోని కమ్యూనిస్టులు, ఆ పార్టీని వీడి బైటకిరావాల్సివచ్చింది. ఆ విధంగా, యుద్ధం మొదలయే నాటికి వామపక్ష ఐక్యతలో విచ్ఛిన్నం పూర్తయింది.

యుద్ధం పట్ల దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు చేపట్టిన వైఖరులు, నాడు నెలకొన్న ముఖ్యమైన ధోరణులను స్పష్టంచేస్తున్నాయి. ఈ పరిస్థితిని కాంగ్రెస్‌లోని మితవాదులు, సామ్రాజ్యవాదంతో బేరసారాలు నడిపేందుకు వినియోగించుకున్నారు. మహాత్మా గాంధీ తాను ఎంపికచేసుకున్న వారితో వ్యక్తిగత సత్యాగ్రహాలు నిర్వహించారు. దీన్ని సుభాష్ చంద్రబోసు నాయకత్వంలోని ప్రత్యర్థి బూర్జువా శిబిరం వ్యతిరేకించింది. బోసు రహస్యంగా విదేశాలకు వెళ్లాడు. నాజీ జర్మనీ నేతలతో సంబంధాలు పెట్టుకున్నాడు. చివరకు జపాన్ గడ్డపై కాలూనాడు. ఈ రెండు బూర్జువా నాయకత్వాలకు వ్యతిరేకంగా, ఒక నూతన నాయకత్వం ఆవిర్భవించింది. దానికి మహమ్మద్ ఆలీ జిన్నా నాయకత్వం లోని అఖిల భారత ముస్లిం లీగ్ ప్రాతినిధ్యంవహించింది. అది సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండుచేస్తూ 1940లో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానం సమైక్య భారతదేశం కోసం కాదు. అది భారత్‌ను రెండు (ముస్లిం, హిందు) జాతులు (నేషన్స్)గా ముక్కలుచేసి వారు దేశం నుండి విడిపోయేందుకు మాత్రమే ఉద్దేశించబడింది. కాంగ్రెస్ సోషలిస్టులు కాంగ్రెస్ నాయకత్వం వైఖరులను ఆక్షేపించారు. కానీ పోరాటంలోని ప్రజానీకానికి ఒక సమరశీల నాయకత్వాన్ని అందించటంలో విఫలమైనారు. సిపిఐ అందుకు భిన్నంగా, 'శ్రామిక వర్గ పంథా' నినాదంతో ముందుకొచ్చింది. అది శ్రామిక ప్రజల నిత్యజీవిత సమస్యలపై వారిని సంఘటితపరచి, సమరశీల పోరాటాలవైపు నడిపేందకు ఉద్దేశించబడిన ఒక ప్రణాళిక. శ్రామికుల జీవన పరిస్థితులు భరించనలవి కాని దుర్భర స్థాయిలో ఉన్నాయి. అందుకే వారు తమ పోరాటాలను విప్లవకర తిరుగుబాటుగా మార్చుకునేలా ఆ ప్రణాళిక ఉపకరించింది.

యుద్ధంలో ఒక నూతన దశ ప్రారంభమైంది. అప్పటికి నాజీ జర్మనీ సోవియట్‌పై దాడిచేసింది. తర్వాత జపాన్ అమెరికాపై దాడిచేసింది. బ్రిటన్. అమెరికాల నాయకత్వంలోని సామ్రాజ్యవాద శక్తులతో కలసి ఒక ఫాసిస్టు వ్యతిరేక కూటమిగా ఏర్పడేందుకు సోవియట్ యూనియన్ అంగీకరించింది. ఆ విధంగా పరిస్థితి పూర్తిగా

మారిపోయింది. కాంగ్రెస్ గతంలో అవలంబించిన 'వ్యక్తి సత్యాగ్రహం' వైఖరి నుండి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మూకుమ్మడి ఉద్యమానికి సిద్ధమైంది. ఆ 'మూకుమ్మడి ఉద్యమం' కోసం ఉద్దేశించిన సన్నాహాలను సామ్రాజ్యవాదంతో గట్టి బేరసారాల కోసం వినియోగించుకుంది (క్రిప్స్ మిషన్). కానీ బ్రిటీష్‌వారు దేన్నీ అంగీకరించేందుకు సిద్ధంగాలేరని తెలిసింది. ఆ తర్వాత మాత్రమే కార్యాచరణలోకి వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది.

సుభాష్ బోస్ నాయకత్వంలోని ప్రత్యర్థి బూర్జువా నాయకులు ఈపాటికే జపాన్ చేరుకున్నారు. ఆ దేశాన్ని భారత్ పై సైనిక కవాతు (మార్చ్ ఆన్ ఇండియా)కు సహకరించాలని కోరారు. ఈ రెండు బూర్జువా నాయకత్వ బృందాల మధ్య కాంగ్రెస్ సోషలిస్టులు నిలిచారు.బూర్జువా నాయకత్వంలో ఒక భాగంగా సియస్‌పి తన పాత్రను నిర్వహించింది. మహాత్మా గాంధీ 'డు ఆర్ డై' పోరాట పిలుపుకు కొనసాగింపుగా, నూతన ప్రతిఘటనా కేంద్రాలను నిర్వహించారు. బ్రిటీష్‌తో సంప్రదింపుల పరిష్కారానికి భూమికను సిద్ధంచేసుకుంటూనే 'సంక్షిప్తమైన, చురుకైన' 'డూ ఆర్ డై ' పోరాటాన్ని కొనసాగించారు. సిపిఐ వీటన్నింటినీ వ్యతిరేకించింది. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధాన్ని, 'ప్రజా యుద్ధం'గా చూడాలని ప్రభుత్వానికి, ప్రజలకు పిలుపునిచ్చింది. ముస్లింలీగ్ తన వంతుగా పాకిస్థాన్ కోసం ప్రచారాన్ని ముమ్మరంచేసింది. అది అత్యంత శక్తివంతమైన రాజకీయ శక్తిగా అవతరించింది.

కమ్యూనిస్టు పార్టీ, ఇతర రాజకీయ శక్తులన్నింటికీ భిన్నంగా ఒక చురుకైన రాజకీయ శక్తిగా అవతరించింది. ఆ రాజకీయ శక్తుల్లో–కాంగ్రెస్, ముస్లిం లీగ్, సుభాష్ బోస్ నాయకత్వంలోని బూర్జువా నాయకత్వ బృందంతోపాటు, సియస్‌పి కూడా ఉంది. సరైన విధానమైన 'ప్రజా యుద్ధ పంథా' అమల్లో కొన్ని పరిమితులున్నాయి. (ఆ పంథాను సిపిఐ సొంతంచేసుకుంది. 1948 పార్టీ రెండవ మహాసభలో దాన్ని సవరించారు.) అయినప్పటికీ, రెండు ప్రధాన పరిణామాలను వాటి మధ్యగల సన్నిహిత సంబంధాలను ప్రజల దృష్టికితెచ్చిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుంది. ఆ పరిణామాలు– ఒకటి, స్వాతంత్ర్యం కోసం భారత్ పోరాటము. రెండు. ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగిన ప్రపంచవ్యాపిత యుద్ధము, దానిలో సోషలిస్ట్ సోవియట్ యూనియన్ నిర్ణయాత్మక పాత్ర.

భారత్‌లోనూ, విదేశాల్లోనూ అనంతరం జరిగిన పరిణామాలు ఈ సమగ్రమైన అవగాహన సరైనదని నిరూపిస్తున్నాయి: అది, సోవియట్ యూనియన్ నాయకత్వంలోని ఫాసిస్టు వ్యతిరేక పోరాట విజయం. ఆ విజయం భారత్‌తో పాటు పరిసర దేశాల్లో యుద్ధానంతరం స్వాతంత్రోద్యమాలు జయప్రదమయ్యేందుకు మార్గాన్ని సుగమంచేసింది.

ఆఉద్యమాలకు ప్రజలను చేరువచేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి దక్కుతుంది. ఫాసిజం వ్యతిరేక పోరులో సోవియట్ యూనియన్ నిర్ణయాత్మక పాత్రను పోషించింది.

భారత్‌లోనూ, వెలుపల అనంతరం జగిన పరిణామాలు ఈ విశాలమైన అవగాహన సరైనదని నిరూపించాయి: తదనంతరం సోవియట్ యూనియన్ నాయకత్వం లోని ఫాసిస్టు వ్యతిరేక శక్తులు, స్వాతంత్రోద్యమానికి మార్గాన్ని సుగమం చేశాయి. ఈ అంశం, యుద్ధం ముగిశాక వెనువెంటనే భారతదేశానికి మాత్రమే పరిమితం కాలేదు. కొన్ని పొరుగు దేశాలకూ వర్తించింది. తర్వాత దశాబ్దంలో ఆసియా, ఆఫ్రికాల్లోని అనేక దేశాలకు కూడా ఉపకరించింది. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం ఒక నూతన యుగాన్ని ఆవిష్కరించింది. ఈ సత్యాన్ని ప్రచారంచేయటం ఎంతో ప్రాధాన్యతగల అంశం. పార్టీ ఈ కాలంలో విశాల ప్రజానీకం నుండి తాత్కాలికంగా వేరుపడింది. కానీ ఆ కారణంగా, బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిన రాష్ట్రాలు, ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి బలహీనపడ లేదు. క్విట్ ఇండియా పోరాటం ఆరంభానికి, యుద్ధం ముగింపుకు మధ్య మూడు సంవత్సరాల వ్యవధి ఉంది. ఈ కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ శ్రామిక జనంతో బలమైన సంబంధాలు గల ఒక స్వతంత్ర శక్తిగా అనితర సాధ్యమైన రీతిలో ఎదిగింది.

ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలను కదిలించి అనేక రూపాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టింది. అందుకు 1940లో బెంగాల్‌లో విజృంభించిన కరువు బాధితులకు పార్టీ అందించిన అనేక సహాయ, పునరావాస చర్యలు మంచి ఉదాహరణగా నిలుస్తాయి. ఈ కష్ట కాలంలో, ఆ కార్యక్రమాలతోపాటు కమ్యూనిస్టుల నాయకత్వంలోని అభ్యుదయ రచయితల సంఘం (అరసం), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)లు సాంస్కృతిక రంగంలో అపారంగా కృషిచేశాయి. అవి ప్రజలకూ, పార్టీకీ మధ్య సంబంధాలను నిలబెట్టడంలో ప్రముఖ పాత్ర వహించాయి.

యుద్ధానంతరం దేశంలో, దాదాపు ఒక విప్లవ ప్రజా వెల్లువ వాతావరణం ఏర్పడింది. దానిలోపార్టీ చురుగ్గా జోక్యంచేసుకోగల్గింది. దేశవ్యాపిత సమ్మె తరంగం, ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐయన్ఎ) ఖైదీల విడుదల కోరుతూ సమరశీల ప్రదర్శనలు, ప్రఖ్యాతిగాంచిన రాయల్ ఇండియన్ నౌకాదళం తిరుగుబాటు అందుకు దోహదపడ్డాయి.

ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీ భూమి కోసం, భూస్వామ్య పీడనకు, రాచరిక సంస్థానాలకు వ్యతిరేక పోరాటాలు చేపట్టింది. వాటి కోసం జరిగిన సమరశీల పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించింది. యుద్ధానంతర వెల్లువలో భాగంగా అనేక స్థానిక ప్రాంతీయ పోరాటాలు రేకెత్తాయి. అవి ప్రతేకించి యుద్ధానంతర వెల్లువలో భాగంగా గొప్ప కదలికను తెచ్చాయి. బెంగాల్‌లో తెభాగా పోరాటం, కేరళలోని పలు

ప్రాంతాల్లో రైతాంగ పోరాటాలు, మహారాష్ట్రలో వర్లీ గిరిజన పోరాటం, బీహార్‌లో బక్షాత్ పోరాటం, అస్సాంలో సుర్మా లోయ పోరాటం మొదలైనవి. ఈ పోరాటాలన్నింటా, రైతాంగాన్ని పెద్దపెట్టున కదిలించారు. వీటన్నింటిలోనూ ఒక సాయుధ పోరాట రూపం తీసుకున్నది తెలంగాణాలో జరిగిన నిజాం వ్యతిరేక పోరాటమే. ఈ రైతాంగ, వ్యవసాయ పోరాటాలు భూ సమస్యను దేశ రాజకీయ ఎజండాలోకి తెచ్చాయి.

అదేవిధంగా దేశంలోని కలకత్తా, కాన్పూరు, బొంబాయి, మద్రాసు వంటి పలు ప్రాంతాల్లో ముఖ్యమైన పారిశ్రామిక రంగాల్లో అనేక పోరాటాలు నడిచాయి. రైల్వే, బొగ్గు గనులు, జనపనార, పత్తి, టీ తోటలు వంటి ముఖ్యమైన పరిశ్రమల్లో కూడా ఆ పోరాటాలు వెల్లువెత్తాయి. బొంబాయిలో నావికుల తిరుగుబాటుకు బహిరంగ మద్దతు తెల్పేందుకు అక్కడి కార్మికులు బైటికొచ్చారు. అది కార్మిక పోరాటాలన్నింటా అతి ముఖ్యమైనది. రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

**భారత రాజ్యాంగం రూపకల్పన:**

భారత రాజ్యాంగం రూపకల్పనలో కమ్యూనిస్టుల పాత్ర నిర్ణయాత్మకం కాదన్నది స్పష్టం. అయితే స్వాతంత్ర్య పోరాట భావి సూచక దృశ్యాలు (విజన్స్) రాజ్యాంగ రచనలో ప్రతిబింబించాయి. జాతీయోద్యమానికీ, బ్రిటీష్ పాలకులకూ మధ్య రాజీ ఫలితమే–దురదృష్టకరమైన దేశ విభజనకు దారితీసిందన్నదీ, ఆ వైఖరి, భూస్వామ్య విధానంతో రాజీకీ. సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడితో కుమ్మక్కైన పెట్టుబడదారీ విధానం అభివృద్ధికీ దోహదపడిదన్నది వాస్తవమే. అయితే స్వాతంత్రోద్యమ ప్రధాన భావనలైన ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సమాఖ్యతత్వము, సామాజిక న్యాయం, సంక్షేమాలు విశిష్ట అంశాలుగా మన రాజ్యాంగంలో చేర్చబడ్డాయి.

అంతర్గతంగా రాజకీయ శక్తుల బలాబలాల పొందికలోని మార్పులు ఈ రాజ్యాంగ నియమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు దారితీస్తే మినహా, లేకపోతే ఈ రాజ్యాంగ సూత్రాల్లో కొన్నిటికి ప్రమాదాలు ఎదురవుతాయన్న విషయంపై కమ్యూనిస్టులకు తగినంత స్పష్టత ఉంది. అందుకే స్వాతంత్రానంతర కాలంలో కమ్యూనిస్టుల పోరాటం, ప్రజాతంత్ర దశలోని స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడంతో పాటు సోషలిజం కోసం జరిగే యుద్ధానికి మరింత బలమిచ్చి విధంగా దాన్ని సంఘటిత పరిచేందుకు ఉద్దేశించబడాలి. ఈ భావనలు నేటికీ బహుళా ఇంకా బలంగా వర్తిస్తాయి.

స్వాతంత్ర్యానంతరం కొనసాగుతున్న మరో ముఖ్యమైన అంశం భారతదేశ సమైక్యత. దేశం 600లకు పైగా రాచరిక సంస్థానాలను తనలో కలిపేసుకుంది. బ్రిటీష్ భారత్‌లోని ప్రాంతీయ పాలనా విభాగాలు, భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా

పునఃనిర్మించబడ్డాయి. అది మరోవిధంగా, స్వాతంత్ర్య పోరాటంలో పూర్తికాని కర్తవ్యాలను పూర్తిచేసేందుకు చేపట్టే పోరాటంలా సాగాలి. అందుకే కమ్యూనిస్టులు విశాలాంధ్ర (తెలుగు మాట్లాడే ప్రజలకు), సంయుక్త మహారాష్ట్ర (మరాఠీ మాట్లాడే ప్రజలకు) లేక ఐక్య కేరళ (మళయాళం మాట్లాడే ప్రజలకు) కోసం పోరాటాల్లో నిమగ్నమైనారు.

మొత్తం మీద కమ్యూనిస్టుల పాత్ర భారతదేశ స్వాతంత్ర్య సాధనలోనూ, అనంతరం అదే స్ఫూర్తితోనూ కొనసాగుతున్నది.

**రిఫరెన్సులు:**


1. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర – ఇఎంఎస్ నంబూద్రిపాద్
2. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, స్వాతంత్ర్యానంతరం వామపక్షాల పాత్ర, మార్క్సిస్ట్, 37, 1–2– ఇఎంఎస్ నంబూద్రిపాద్
3. భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర, పార్టీ కార్యక్రమ పరిణామం, నేటి రాజకీయ ఎత్తుగడలు, రాజకీయ పాఠశాల నోట్ : సీతారామ్ ఏచూరి
4. వామపక్షం, జాతీయోద్యమం, మార్క్సిస్ట్, 27, 1×2: ఇర్ఫాన్ హబీబ్
5. భారత దేశ రక్షణకోసం ఎలుగెత్తాలి; చరిత్ర తిరిగిరాయడాన్ని ఎండగట్టాలి, దేశ్‌హితైషి,పూజా స్పెషల్ ఎడిషన్, 2022: సీతారామ్ ఏచూరి
6. స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర, పీపుల్స్ డెమోక్రసీ, అక్టోబర్ 18, 2020 : నీలోత్పల్ బసు

# అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర

**1.** ప్రజలు శాంతి, సమానత్వాలతో నివసించే సమాజం రావాలనే భావనలు చాలా కాలం క్రితం నుండే ప్రజల్లో ఉన్నాయి. ఉదాహరణకు కేరళలో ఓణం పండుగ చేసుకుంటారు. ఇది ప్రాచీన కాలంలో మహాబలి నాయకత్వంలో ఏర్పడిన సమసమాజం గురించిన పురాణ గాథ. ఇంకా అనేక ప్రాచీన సమాజాల్లో కూడా ఇటువంటి అనుభవా లున్నట్లు పురాణ గాథల ద్వారా, చరిత్ర పూర్వ ఆధారాల ద్వారా తెలుస్తున్నది. ప్రఖ్యాత మానవసమాజ శాస్త్రవేత్త లెవిస్ హెన్రీ మోర్గన్ (21-11-1818/ 17-12-1881) 1877లో వెలువరించిన ప్రముఖ గ్రంథం "ప్రాచీన సమాజం"లో... మానవ సమాజ పరిణామంలోని ప్రారంభ కాలంలో మానవుల్లో 'వర్గాలు, రాజ్య పీడనా యంత్రాంగం, మహిళలపై పురషాధిక్యత మొదలైనవి లేని' ఒక సమానత్వంతో కూడిన సామాజిక జీవనం ఉండేదని చెప్పారు. ఈ వాస్తవాన్ని నిరూపించే అనేక మానవసమాజ శాస్త్ర అంశాల గురించి వివరించారు. అందువల్ల భవిష్యత్తులో కమ్యూనిస్టు సమాజం ఏర్పడ్డం సైద్ధాంతికంగా సాధ్యమేనని, ఎందుకుంటే అటువంటి సమాజం గతంలో ఉన్నదనీ ఇది నిరూపిస్తోంది.

**2.** (ఆదిమ సమాజం, కమ్యూనిస్టు సమాజం, బానిసత్వం, ఫ్యూడలిజం తరువాత) పెట్టుబడిదారీ సమాజం ఏర్పడ్డంతో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం అనే వాటికి సంబంధించిన భావనలు మరింత తీవ్రంగా ముందుకు వచ్చాయి. దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో కొత్త కొత్త విప్లవ భావాలు వృద్ధి చెందాయి. సహజంగానే ఇవి సోషలిజం అనే భావాలకు బీజాలు వేశాయి. హిన్రీ డి సెయింట్ సైమన్ (17-10-1760/ 19-5-1856), ఫ్రాంకోయిస్ మేరీ చార్లెస్ ఫొరియర్ (7-4-1772/ 10-10-1837) ఎటిన్నే కాబొట్ (1-1-1788/ 9-11-1856), రోబర్ట్ ఓవెన్ (14-5-1771/ 17-11-1858) మొదలైన వారిని తొలితరం సోషలిస్టులుగా పేర్కొంటారు. మన దేశానికి చెందిన అయ్య వైకుంఠ స్వామి (1809 /1851)ని కూడా ఈ కోవలోకి చేర్చొచ్చు. ఆయన కేరళలోని

తిరువనంతపురంలో నివసించారు. కారల్ మార్క్స్ (1818/1883), ఫ్రెడరిక్ ఏంగెల్స్ (1820/1895)లు "లీగ్ ఆఫ్ ది జస్ట్"లో చేరక ముందే వైకుంఠ సామి 1830లో "సమత్వ సమాజం"ను స్థాపంచారు.

పైన పేర్కొన్న తొలితరం సోషలిస్టులు, వారి కృషి చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. వాళ్లు సమానత్వాన్ని కలగన్నారు. దాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ విషయంలో వారిని మనం ఎంతగానో కొనియాడాలి. అయితే శాస్త్రీయంగా విశ్లేషించినప్పుడు వారి సిద్ధాంతాలు ఊహాజనితమైనవని తేలిపోయాయి. ఏంగెల్స్ రాసిన "సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం" అన్న ప్రఖ్యాత గ్రంథంలో ఊహాజనిత సోషలిజంలోని లోపాలను బయట పెట్టి శాస్త్రీయ సోషలిజానికి అది ఎలా భిన్నమైనదో వివరించారు.

**3.** 1830, 1840 దశకాల్లో అనేక దేశాల్లో ముఖ్యంగా ఐరోపాలో అనేక పోరాటాలు జరిగాయి. రైతాంగంతోపాటుగా ఒక కొత్త పీడిత వర్గాన్ని – కార్మికవర్గాన్ని – కొత్తగా ఏర్పడిన సామాజిక–ఆర్థిక వ్యవస్థ సృష్టించింది. ఎదిగొస్తున్న బూర్జువాలు ఫ్యూడల్ వ్యవస్థ బంధనాలనుండి తెగ్గొట్టుకుని స్వేచ్ఛ పొందేందుకు వీటిలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. 1789, 1775, 1783 సంవత్సరాల్లో వరుసగా జరిగిన ఫ్రెంచ్, అమెరికన్ విప్లవాలు స్వేచ్ఛ, సమానత్వం, సౌహార్ద్రత అనే కొత్త భావాలను సృష్టించాయి. అయితే ఈ మహత్తర భావాలు కార్మికులు, రైతాంగం, ఇతర శ్రామిక ప్రజల జీవితాల్లో మాత్రం ప్రతిబింబించలేదు. వారిని పెట్టుబడిదారులు క్రూరంగా దోచుకున్నారు. పెట్టుబడికి కావలసిందల్లా గరిష్ట లాభాలు మాత్రమే. చౌకైన పనివాళ్లు దొరకడం కోసం బేరసారాల శక్తి తమకు అనుకూలంగా ఉండేందుకు గాను వాళ్లకు ఒక నిరుద్యోగ సైన్యం కావాల్సి వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద మెజారిటీ ప్రజలల్లో నిరుద్యోగం, దుర్భరదారిద్ర్యం భరించలేనంతగా పెరిగిపోయింది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో పెద్ద ఎత్తున పారిశ్రామీకరణ జరిగింది. ఉత్పాదకత విపరీతంగా పెరిగింది. శాస్త్ర–సాంకేతికత పెరగడం, వలస వాదం అభివృద్ధి చెందడంతో ఈ అభివృద్ధి సాధ్యమైంది.

మార్క్స్, ఏంగెల్స్ మాటల్లో చెప్పాలంటే, "బూర్జువా వర్గం తన వందేళ్ల లోపభూయిష్ట పాలనలో అంతకు ముందున్న తరాలన్నింటినీ కలుపుకున్నా

వాటికి మించినంత మహాస్థాయిలో ఉత్పత్తి శక్తులను సృష్టించింది. ప్రకృతి శక్తులను మనిషి ఆధీనంలోకి తెచ్చుకోవడం, యంత్రాల వాడరం. పరిశ్రమల్లోనూ, వ్యవసాయంలోనూ రసాయనాలు వినియోగించడం, ఆవిరితో నడిచే నౌకలు, రైల్వేలు, విద్యుత్ టెలిగ్రాఫ్‌లు, వ్యవసాయం కోసం మొత్తం ఖండాలనే చదును చేయడం, నదులపై ఆనకట్టలు కట్టి నీరు పారించడం మొదలైన అభివృద్ధి ద్వారా మొత్తం ప్రజానీకాన్ని మంత్ర ముగ్దులను చేసి ముందుకు నడిపింది. అంతకు ముందు శతాబ్దంలో సామాజిక శ్రమ ఒడిలో ఇటువంటి ఉత్పత్తి శక్తులు నిద్రాణమై ఉన్నాయని ఊహించడమైనా జరిగిందా?”

ఇటువంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారీ దోపిడీకి ప్రత్యామ్నాయంగా బీజప్రాయం లో అభివృద్ధి చెందిన వ్యవస్థ గురించి అధ్యయనం చేసి, దాన్ని సరైన శాస్త్రీయ సిద్ధాం తంగా సంగ్రహ రూపంలో అభివృద్ధి చేయడం, ఆ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక వ్యవస్థాగత నిర్మాణాన్ని రూపొందించడం తప్పనిసరి అవుతుంది.

**4.** 1847లో లీగ్ ఆఫ్ జస్ట్, కమ్యూనిస్ట్ కరస్పాండెన్స్ కమిటీలు రెండూ విలీనమై ‘కమ్యూనిస్టు లీగ్’ ఏర్పడింది. ఆ ఏడాది ప్రారంభంలో కమ్యూనిస్టు లీగ్ తొలి మహాసభ లండన్‌లో జరిగింది. ఈ సభకు మార్క్స్ హాజరు కాలేకపోయినప్పటికీ ఏంగెల్స్ ఇందులో చాలా చురుకుగా పాల్గొన్నాడు. లీగ్ రెండవ మహాసభ 1847 నవంబర్ 29, డిసెంబర్ 8 మధ్య జరిగింది. ఈ మహాసభ కమ్యూనిస్టు లీగ్ కార్యక్రమాన్ని తయారు చేసే బాధ్యతను మార్క్స్, ఏంగెల్స్‌లకు అప్పగించింది. దాని ఫలితంగా 1848 ఫిబ్రవరి 24న కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించబడింది. దీన్ని కమ్యూనిస్టుల తొలి కార్యనిర్వాహక పత్రంగా పరిగణించవచ్చు.

**5.** కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించబడిన తరువాత నాలుగు దశాబ్దాలకు 1888 జనవరి 30న ఏంగెల్స్, ప్రణాళిక చరిత్రనూ, కార్మికవర్గ ఉద్యమాన్నీ సంగ్రహపరుస్తూ ఒక మహత్తర వ్యాసాన్ని రాశాడు (కమ్యూనిస్టు ప్రణాళిక 1888 ప్రతికి ముందుమాట). ఒక పూర్తి స్థాయి సైద్ధాంతిక, ఆచరణాత్మక పార్టీ కార్యక్రమం అయిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురణ చారిత్రక ప్రాముఖ్యత గురించి ఏంగెల్స్ కింది విధంగా రాశాడు.

**6.** “కమ్యూనిస్టు లీగ్” వేదికగా ఈ ప్రణాళిక ప్రచురించబడింది.

7. అదే సమయంలో అది శాస్త్రీయ సోషలిజం మీద ఆధారపడిన అంతర్జాతీయ సంస్థగా అభివృద్ధి చెందింది. కమ్యూనిస్టు లీగ్ తొలుత కేవలం జర్మనీకే పరిమితం అయ్యింది, తరువాత అది అంతర్జాతీయ పత్రం అయింది.

8. ఏంగెల్స్ చెప్పినట్లు, 1848కి ముందు యూరప్‌లో ఉన్న పరిస్థితుల దృష్ట్యా అది అనివార్యంగా ఒక రహస్య సంఘంగానే ఉండేది.

9. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించడం, ఐరోపాలోని పశ్చిమ, ఉత్తర, కేంద్ర ప్రాంతాల్లో ప్రజా తిరుగుబాట్లు తలెత్తడం రెండూ ఒకేసారి జరిగాయి. అయితే, ప్రణాళికలో పేర్కొన్నట్లు అప్పటికే ఐరోపా ప్రజలు సమూల మార్పులు కావాలన్న ధోరణితో ఉన్నారు. ప్రజల నుండి ఇంత విస్తృతమైన తిరుగుబాట్లు, పోరాటాలు జరగడం వెనుక కమ్యూనిస్టు ప్రణాళిక ప్రభావం పెద్ద ఎత్తున ఉన్నదనే దానికి ఆధారాలు ఏమీ లేవు. 1848 ప్రారంభంలో మార్క్స్, ఏంగెల్స్‌లు విప్లవంలో పాల్గొనేందుకు పారిస్ వదిలిపెట్టి జర్మనీ చేరుకున్నారు.

10. అప్పుడు కోలోన్ కేంద్రంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు లీగ్ కేంద్ర బోర్డు సభ్యులను ప్రష్యన్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేసిన విషయం బాగా తెలిసిందే. కొలోన్ కమ్యూనిస్టు విచారణ (1852 అక్టోబర్ 4వ తేదీ నుండి నవంబర్ 12వ తేదీ వరకు) అనంతరం ఏడుగురు కామ్రేడ్స్‌ను జైల్లో పెట్టారు. నిర్బంధం చాలా పెద్ద ఎత్తున సాగింది. బయట ఉన్న కామ్రేడ్స్ సంప్రదించుకుని కమ్యూనిస్టు లీగ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

11. 1864లో లండన్‌లోని సెయింట్ మార్టిన్ హాల్‌లో జరిగిన మహాసభలో అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ఏర్పడింది. అప్పటికల్లా ఐరోపా కార్మిక వర్గం పాలక వర్గాల మీద మరో ఎదురుదాడి చేయడానికి కావలసిన బలాన్ని కూడదీసుకుంది.

12. ఇంగ్లీషు ట్రేడ్ యూనియన్లకూ, ఫ్రాన్స్, బెల్జియం, ఇటలీ, స్పెయిన్‌లోని ప్రౌధాన్ అనుచరులకూ, జర్మనీలోని లాస్సెల్లియన్లకూ ఆమోదయోగ్యమైన విశాలమైన కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ కలిగి ఉండాల్సి వచ్చింది.

13. కారల్ మార్క్స్ రాసిన ప్రారంభోపన్యాసం (నిజానికి అది మొదటి ఇంటర్నేషనల్ కార్యక్రమ అవగాహన) వాస్తవానికి కార్యక్రమ అవగాహనను తాజాపరచడానికి సంబంధించి ఒక శాస్త్రీయ ఉదాహరణ.

14. ఈ పత్రంలో మార్క్స్ 1848–49 తిరుగుబాట్లు ఎందుకు విఫలమయ్యాయి అన్న ప్రశ్న వేశాడు. కార్మిక వర్గంలో ఐక్యత లేకపోవడమే దానికి కారణం అని ఆయన సమాధానం చెప్పాడు.

అత్యంత ధైర్య సాహసాలతో జరిగిన ఈ తిరుగుబాట్ల నుండి కార్మిక వర్గం అనేక విలువైన అనుభవాలు గడించడమే కాకుండా రెండు విలువైన విజయాలు కూడా సాధించిందని మార్క్స్ చెప్పాడు. అనేక ఐరోపా పార్లమెంటుల్లో ప్రవేశపెట్టిన చట్ట సవరణల ద్వారా పని గంటలు తగ్గించుకోవడం అనేవి ఈ విజయాలు. వేతన కార్మికులకు దీనివల్ల పెద్ద వెసులుబాటు లభించింది. రెండవది, కార్మికుల సహకార ఉద్యమం ఆచరణలోకి రావడం. వస్తువుల ఉత్పత్తికి పెట్టుబడిదారుడు అనివార్యమైన అవసరం ఏమీ కాదన్న విషయం దీని నుండి తెలిసింది. అయితే సహకార ఉద్యమపు పరిమితులను గురించి మార్క్స్ వెనువెంటనే గుర్తుచేశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిజంగా పరివర్తన చెందడానికి ఈ ఉద్యమం ప్రత్యామ్నాయం కాదు.

**15.** మొదటి ఇంటర్నేషనల్ సందర్భంగా చరిత్రలోనే విలువైన విప్లవానుభవం ఎదురైంది. అదే పారిస్ కమ్యూన్ ఏర్పాటు. మార్చి 18 నుండి, మే 28 వరకు ప్రపంచ చరిత్రలో తొలిసారిగా కార్మికవర్గ విప్లవం సంభవించింది. ఆ విప్లవం 72 రోజులు మాత్రమే మనుగడ సాగించినప్పటికీ పారిస్ కమ్యూన్ ఇచ్చిన గుణపాఠాలు తరువాత అక్టోబర్ సోషలిస్టు విప్లవం జయప్రదం కావడానికి గొప్పగా సహకరించాయి. వి.ఐ. లెనిన్ (10-4-1870/21-1-1924) రాసిన విలువైన గ్రంథం 'రాజ్యం, విప్లవం'లో కార్మికవర్గపు తొలి విప్లవ వెల్లువా, దాని పతనం గురించిన అనేక పార్శ్వాలను చర్చించాడు. 1871 మే 30న జరిగిన ఇంటర్నేషనల్‌లో కారల్ మార్క్స్ చేసిన ప్రసంగం పారిస్ కమ్యూన్ గురించి వివరంగా విశ్లేషించింది. 'ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం' పేరుతో చేసిన ఆయన ఉపన్యాసం ఆ చారిత్రక సంఘటనపై వెలువడిన తొలి శాస్త్రీయ విశ్లేషణ. ఈ విప్లవాన్ని అణచివేసిన తరువాత బూర్జువాలు లక్షమందికి పైగా స్త్రీ, పురుషులనూ, పిల్లలనూ చంపివేయడమో లేక వలస ప్రాంతాలకు పంపించేయడమో చేశారంటే ఈ విప్లవానికి కమ్యూనార్డులు ఎంతటి బాధాకరమైన పరిహారం చెల్లించారో అర్థం చేసుకోవచ్చు.

**16.** 1872 సెప్టెంబర్ 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు హేగ్‌లో జరిగిన మహాసభలో రష్యన్ అరాచకవాది మైఖేల్ బకునిన్ (30-5-1814/1-7-1876) అనుచరులతో తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం జరపాల్సి వచ్చింది. కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ ప్రతిపాదన ప్రకారం ఇంటర్నేషనల్ ప్రధాన

కేంద్రాన్ని న్యూయార్క్‌కు మార్చారు. 1872 వచ్చే సరికి తొలి ఇంటర్నేషనల్ ప్రత్యక్ష కార్యాచరణ దాదాపు ముగిసి పోయింది. అయితే హేగ్ మహాసభ తరువాత కూడా సాధారణ కార్యకలాపాలు కొనసాగాయి. 1873లో జనీవాలో ఆరవ మహాసభ జరిగింది. 1876లో ఫిలడెల్ఫియాలో జరిగిన మహాసభే తొలి ఇంటర్నేషనల్‌కు చివరిదైంది.

**17.** తొలి ఇంటర్నేషనల్ అందించిన ఒక సింబల్ మాత్రం ఎల్ల కాలమూ ఉండిపోతుంది. అదే పారిస్ కమ్యూన్‌లో ఉద్భవించిన అంతర్జాతీయ గీతం. కమ్యూనార్డ్ యూజిన్ ఎడిన్ పాట్టియర్ (1816/1887) ఈ గీతాన్ని రాశారు. పారిస్ కమ్యూన్ పతనమైన తరువాత జూన్ మాసంలో ఈ గీతాన్ని రాశారు. ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిస్టు పార్టీల మహాసభల్లో అంతర్జాతీయ గీతం ఆలపించబడుతుంది. అయితే అంతర్జాతీయ గీతానికి ప్రస్తుత ట్యూన్ మాత్రం 1888లో బెల్జియన్ సోషలిస్టు పీర్రె చెటీన్ డి గేటెర్ (అక్టోబర్ 8, 1848/ సెప్టెంబర్ 26, 1932) సమకూర్చారు.

**18.** తొలి ఇంటర్నేషనల్, లేక అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ అనేది కమ్యూనిస్టులు, సోషలిస్టుల రెండవ నిర్మాణ వ్యవస్థ. 1864లో ఏర్పడిన దీని కాలం 12 ఏళ్లకు ముగిసింది. కమ్యూనిస్టుల తొలి నిర్మాణాత్మక సంస్థ అయిన కమ్యూనిస్టు లీగ్ కాలం 1852లో ముగిసి పోయిన 12 ఏళ్లకు తొలి ఇంటర్నేషనల్ ఏర్పడ్డం యాదృశ్చికమే. కమ్యూనిస్టు లీగ్ అయిదేళ్లు మాత్రమే (1847–1852) మనుగడ సాగించింది.

**19.** ఈ రెండు సంస్థలను కూడా పాలక వర్గాలు అత్యంత క్రూరంగా అణచివేశాయి. 1848–49 కాలంలో కార్మిక పోరాటాల అణచివేతతో పోలిస్తే 1871లో పారిస్ కమ్యూన్ అణచివేత అత్యంత క్రూరమైనది. లక్షమందికి పైగా స్త్రీ పురుషులనూ, పిల్లలనూ ప్రతీకారేచ్ఛతో చంపారు. వలసలకు పంపేశారు. మార్క్స్, ఏంగెల్స్‌లు ఇతర కామ్రేడ్స్ తమ సామర్థ్యం కొద్దీ, తమవద్ద ఉన్న వనరులను బట్టి వీరిలో చాలా మందికి లండన్‌లోనూ, ఇతర చోట్లా నివాసం కల్పించారు. పాలక వర్గాల దాడులు ఒకవైపు, అంతర్జాతీయ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్‌లో అంతర్గతంగా అనార్కిస్టులతో జరిగిన పోరాటం సంస్థమీద ప్రతికూల ప్రభావం చూపించింది. దీనివల్ల తొలి ఇంటర్నేషనల్ విశ్చిన్నమై పోయింది. 1872, 1876 మధ్య అది అచేతనమై పోయినప్పటికీ ఇంటర్నే షనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ఎంతో విలువైన

అనుభవాలను అందించింది. మహత్తరమైన పారిస్ కమ్యూన్ అనుభవాలు ఈ కాలంలో అందించిన అతి విలువైన గుణపాఠాలు. అమరమైన అంతర్జాతీయ గీతం ఆ కాలం అందించిన మరో విలువైన అనుభవం.

**20.** మొదటి ఇంటర్నేషనల్ లాంచనంగా అంతమైపోయిన 13 ఏళ్ల తరువాత రెండవ ఇంటర్నేషనల్ (1889 నుండి 1916) ఉనికిలోకి వచ్చింది. రెండవ ఇంటర్నేషనల్ తొలి సమావేశం 1889 జులై 14న పారిస్‌లో జరిగింది. ఈ సమావేశంలో రెండవ ఇంటర్నేషనల్ ఏ విధంగా ఉండాలి అన్న దాని మీద తీవ్రమైన చర్చ జరిగింది. ప్రజాతంత్ర ఉద్యమానికి మహామహోపాధ్యాయుడు, ప్రపంచాన్ని పరిపరి విధాలా వ్యాఖ్యానించడం కాదు దాన్ని మార్చడం ముఖ్యం అని మానవాళికి బోధించిన కారల్ మార్క్స్ 1883లోనే మరణించాడు కనుక రెండవ ఇంటర్నేషనల్ కాలంలో ఆయన లేడు. అందువల్ల వివిధ అభివృద్ధికర రాజకీయ స్రవంతులను సమన్వయ పరిచి, కార్మికవర్గపు కొత్త ఉద్యమాన్ని బలోపేతం చేసే బాధ్యత ఏంగెల్స్ భుజస్కంధాల మీద పడింది. ఒక్కో దేశం నుండి (మొత్తం 20 దేశాలు) రెండు కన్నా ఎక్కువ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తూ 3991 మంది ప్రతినిధులు ఈ వ్యవస్థాపక మహాసభకు హాజరయ్యారు. మార్క్సుకీ, అనార్కిస్టులకూ మధ్య జరిగిన సైద్ధాంతిక పోరాటం రెండవ ఇంటర్నేషనల్‌లో కూడా కొనసాగింది. విప్లవోద్యమానికి ప్రమాదకరంగా కార్మిక నిరంకుశ పెత్తనంతోపాటుగా సంస్కరణ వాదం కూడా ఒక తప్పుడు మార్గంగా ఇందులో ఆవిర్భవించింది. ఈ కాలంలో రెండవ ఇంటర్నేషనల్‌లోనూ, ఆయా దేశాల కార్మికోద్యమాల్లోనూ ఏంగెల్స్, కార్ల్ కాట్స్కీ (1854–1938), జివి ప్లెఖనోవ్ (1856–1918), విఐ లెనిన్ (1870– 1924), రోజా లగ్జెంబర్గ్ (1871–1919), కార్ల్ లీబ్‌నెఖ్ (1871–1919) మొదలైన వారు చురుకైన పాత్ర నిర్వహించిన ముఖ్య నేతల్లో కొందరు. అయితే వీరిలో కొందరు తమ రాజకీయ జీవితంలో కొన్ని వక్రమార్గాలు పట్టడమో, లేక తప్పుడు ధోరణులకు పోవడమో జరిగింది. ఉదాహరణకు వీరిలో ఒకరైన కార్ల్ కాట్స్కీ మొదట్లో మార్క్సిస్టుగా ఉండేవాడు. తరవాతి కాలంలో ఆయన సైద్ధాంతికంగా మధ్యేవాదంలోకి పోవడంతో ఆయనను లెనిన్ తప్పుతోవ పట్టినట్లు ప్రకటించాడు. బెర్న్‌స్టీన్ మార్క్సిజం నుండి తప్పుమార్గం పట్టి రివిజనిజానికి, సంస్కరణ వాదానికి సైద్ధాంతిక వేత్తగా మారాడు. ప్లెఖనోవ్ రష్యాలోనూ, అంతర్జాతీయంగానూ కార్మికవర్గ

ఉద్యమంలో గొప్ప నేత. ఆయనే మార్క్సిజాన్ని రష్యాలో పరిచయం చేశాడు. కానీ తరువాతి కాలంలో ఆయన మెన్షివిక్‌గా మారిపోయాడు. సోషలిజంలోకి పరివర్తన చెందడానికి రష్యా పరిపక్వం కాలేదని చెప్పి ఆయన అక్టోబర్ సోషలిస్టు విప్లవాన్ని వ్యతిరేకించాడు.

**21.** మొదటి ప్రపంచ యుద్ధం (1914 జులై 28 నుండి 1918 నవంబర్ 11) ప్రారంభం కావడంతో అంతర్గత సైద్ధాంతిక విభేధాలు మరింత పెరిగాయి. అవకాశవాద శక్తులు బూర్జువా పాలక పక్షాల యుద్ధ సన్నాహాలకు మద్దతిచ్చారు. సామ్రాజ్యవాద శక్తుల యుద్ధ సన్నాహాలకు మద్దతివ్వడం పచ్చి అవకాశవాదం అని జూల్స్ గాస్డే (11-11-1845/28-7-1922), కార్ల్ లీబ్‌నెఖ్, రోజా లగ్జెంబర్గ్ తదితరుల నాయకత్వంలోని మార్క్సిస్టు, విప్లవ శక్తులు వాదించారు. యుద్ధం ద్వారా ప్రపంచంలోని సహజ వనరులను తమ మధ్య పంచుకోవడమే సామ్రాజ్య వాదుల లక్ష్యం. దానికోసం ఆయా దేశాల్లోని కార్మికులు, యువజనులకు ఆయుధాలూ, సైనికులకు యూనిఫారమ్‌లూ ఇచ్చి ఒకరిని మరొకరు చంపుకోడానికి వదిలిపెట్టారు. అందువల్ల ఆయా దేశాలకు చెందిన సభ్య పార్టీలు తమతమ దేశాల్లోని యుద్ధ సన్నాహాలను వ్యతిరేకించాలని రెండవ ఇంటర్నేషనల్‌లోని విప్లవ శక్తులు గట్టి పట్టుపట్టి వాదించాయి. రెండవ ఇంటర్నేషనల్‌లోని అనేక పార్టీలు ఊగిసలాటకు గురయ్యాయి. అవి అన్ని దేశాల కార్మికులు, రైతాంగం, ఇతర శ్రామిక ప్రజల మధ్య సౌహార్ద్రత ప్రకటించకుండా తమ సామ్రాజ్యవాద పాలకుల యుద్ధ సన్నాహాలను సమర్ధించాయి. ఇది సహజంగానే రెండవ ఇంటర్నేషనల్ పతనానికి దారితీసింది.

**22.** తొలి దశల్లో అనార్కిస్టు, రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడ్డంలో రెండవ ఇంటర్నేషనల్ విలువైన పాత్ర నిర్వహించింది. ఈ కాలంలోనే ఐరోపా అంతటా ముఖ్యంగా రష్యాలో మార్క్సిజం వేగంగా విస్తరించింది. సామ్రాజ్యవాద దశలో తొలి విప్లవం 1905లో రష్యాలో సంభవించింది. 1914లో జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీకి పది లక్షలకు పైగా పెద్ద సభ్యత్వం ఉండేది. ఇదే కాలంలో దాని ట్రేడ్ యూనియన్లు 25 లక్షలు పైబడి సభ్యత్వం కలిగి ఉండేవి. 1912 ఎన్నికల్లో దానికి 42 లక్షల ఓట్లు వచ్చాయి. 110 మంది డిప్యూటీలతో అది రీచ్‌స్టాగ్ (సామ్రాజ్యవాద జర్మన్ పార్ల మెంటు)లో ఏకైక అతి పెద్ద పార్టీగా ఉండేది.

**23.** 1889లో రెండవ ఇంటర్నేషనల్ మే 1వ తేదీని అంతర్జాతీయ కార్మిక దినంగా నిర్ణయించి చరిత్రలో స్థిర స్థానం సాధించింది.

అదే విధంగా 1910లో తన వేదిక మీదనుండి ఇచ్చిన ఒక పిలుపు ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం కూడా పాటించబడుతోంది. తొలుత ఈ దినాన్ని మార్చి 18న జరుపుకునేవారు. తరువాత 1917లో రష్యా విప్లవం సందర్భంగా జరిగిన మహిళా ప్రదర్శనను పురస్కరించుకుని దాన్ని మార్చి 8వ తేదీకి మార్చారు. అంతేకాకుండా కార్మికులకు 8 గంటల పనిదినం ఉండాలన్న పిలుపును కూడా ఈ రెండవ ఇంటర్నేషనలే ఇచ్చింది. 1905 నుండి విఐ లెనిన్ ఇంటర్నేషనల్‌లో చురుకుగా పనిచేశారు.

**24.** భారత దేశంలో రెండవ ఇంటర్నేషనల్‌ను గుర్తుంచుకోడానికి మరో కారణం కూడా ఉంది. 1907లో స్టట్‌గార్ట్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మహాసభలో భికాజి కామా తొలిసారిగా భారత స్వాతంత్ర్యం అనే పతాకాన్ని ఎగురవేశారు. తొలిదశలో రెండవ ఇంటర్నేషనల్‌కు సమాంతరంగా తరువాతి కాలంలో స్వతంత్రంగా జరిగిన అంతర్జాతీయ మహిళా మహాసభలు ప్రజాతంత్ర మహిళా ఉద్యమాభివృద్ధికీ, మహిళల సాధికారితకూ ఎనలేని దోహదం చేశాయి.

25. జర్మనీ, హంగరీల్లో విప్లవ వెల్లువలు, ప్రతీఘాత–విప్లవ అణచివేతలు:

మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం జయప్రదం కావడంతో ఇతర ఐరోపా దేశాల్లో కూడా అటువంటి విప్లవ పరివర్తనల కోసం ప్రయత్నాలు జరిగాయి. అటువంటి వాటిలో జర్మనీ, హంగరీల్లో జరిగిన విప్లవ వెల్లువలు ముఖ్యమైనవి. జర్మన్ విప్లవ వెల్లువను అణచివేసే క్రమంలో అనేక మంది గొప్ప మార్క్సిస్టులను క్రూరంగా హత్య చేశారు. ఇలా హత్యగావించబడిన వారిలో రోజా లగ్జెంబర్గ్, కార్ల్ లీబ్‌నెట్ కూడా ఉన్నారు. హంగరీ విప్లవం చాలా కొద్దికాలం నిలదొక్కుకున్నది. కానీ తరువాత దాన్ని కూడా ప్రతీఘాత–విప్లవ శక్తులు అణచివేశాయి.

**26.** మూడవ (కమ్యూనిస్టు) ఇంటర్నేషనల్ (1919/1943) :

మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవం విజయం సాధించడంతో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 1919 మార్చి 2వ తేదీన విఐ లెనిన్ మహాసభ వేదిక మీద నుండి రోజా లగ్జెంబర్గ్, కార్ల్ లీబ్‌నెట్‌లకు నివాళులర్పిస్తూ ఒక నివేదిక ప్రతిపాదించడంతో మూడవ

ఇంటర్నేషనల్ ప్రారంభమైంది. 21 దేశాలకు చెందిన 34 పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 52 మంది ప్రతినిధులు ఈ సభకు హాజరయ్యారు. బూర్జువా ప్రజాతంత్రం, కార్మికవర్గ నియంతృత్వం అనేది ఇక్కడ ప్రధానంగా చర్చ జరిగిన అంశాల్లో ఒకటి. ఐరోపా బయటి నుండి వచ్చిన ప్రతినిధుల్లో అమెరికన్ సోషలిస్టు లేబర్ పార్టీ, చైనా సోషలిస్టు వర్కర్స్ పార్టీ, కొరియా వర్కర్స్ యూనియన్లు ముఖ్యమైనవి.

**26.** కార్మికవర్గం పేద రైతాంగంతో పొత్తుపెట్టుకుని సుదీర్ఘమైన ప్రజా పోరాటం చేయడం ద్వారా కార్మిక వర్గ విప్లవం జయప్రదం అవుతుందని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్) తన తొలి పత్రంలో పేర్కొంది. అది కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాన్ని నొక్కి చెప్పింది. వలస దేశాల్లో సామ్రాజ్యవాదం నుండి విముక్తి కోసం పోరాడుతున్న పీడిత ప్రజలకు కొమింటర్న్ మద్దతు ఉంటుందని అది ప్రకటించింది. లెనిన్ ప్రవేశపెట్టిన కొలోనియల్ థీసీస్‌ను కొమింటర్న్ అమోదించడం తనను కదిలించి వేసిందనీ, ఆనంద భాష్పాలు రాల్చానని వియత్నాం విప్లవ నేత హో చి మిన్ చెప్పాడు.

**27.** కొమింటర్న్‌లో ఏ పార్టీ అయినా చేరాలంటే అది 21 షరతులను నెరవేర్చాలని పేర్కొంటూ కొమింటర్న్ రెండవ మహాసభ ఒక సవివరమైన తీర్మానాన్ని ఆమోదించింది. తొలి సోషలిస్టు దేశమైన సోవియట్ రష్యా 'అవసరాలకు' 'లోబడి ఉండాలి' అని కొన్ని షరతులు పేర్కొంటున్నాయి. ఇది సహజమే ఎందు కంటే బోల్షివిక్ విప్లవాన్ని అప్పటికి సామ్రాజ్యవాద శక్తులు చుట్టుముట్టి ఉన్నాయి. ప్రపంచంలో విప్లవ పోరాట భవిష్యత్తు కోసం దాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ రక్షించుకోవడం అవసరం.

కమ్యూనిస్టు పార్టీకి మార్గదర్శక సూత్రమైన కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని కొమింటర్న్ పనికి కూడా వర్తింపజేశారు. మనం ఒక సారి వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆయా దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు తమ దేశాల్లో ఉన్న 'నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించే' బాధ్యతనూ, విధులనూ స్వేచ్ఛగా నిర్వహించకుండా ఈ నిబంధన అడ్డుపడు తుందని అర్థమవుతుంది. కొమింటర్న్ వార్షిక మహాసభలకు మధ్యలో దాని ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఇసిసిఐ) శక్తివంతంగా ఉండేది. ఒక నిబంధన ప్రకారం సభ్య సంస్థలకు తమ ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణను ప్రణాళిక వేసుకుని, అమలు చేసుకునే స్వేచ్ఛ ఇవ్వబడింది. అయినప్పటికీ 'ఇరవయొక్క షరతుల్లో' కొన్ని షరతులు, కమ్యూనిస్టు పార్టీల జాతీయ 'విభాగాల'కు సంబంధించిన ప్రతి అంశం

విషయంలోనూ పూర్తి అధికారం ఇసిసిఐ కే ఉన్నదన్న అభిప్రాయం కలిగించాయి. రెండవ మహాసభ వామపక్ష అవకాశవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అదే విధంగా ప్రజల్లో కమ్యూనిస్టులు మమేకమై పనిచేయడం ప్రాథమిక ప్రాముఖ్యత గల అంశం అని కూడా ఈ మహాసభ నొక్కి చెప్పింది.

**28.** 1928లో జరిగిన కొమింటర్న్ 6వ మహాసభ కొమింటర్న్ కార్యక్రమం, నిబంధనావళిని అమోదించింది. కార్యక్రమంలో కొన్ని పిడివాద ధోరణులున్నాయన్న విషయాన్ని అంగీకరించాలి. ఉదాహరణకు ప్రధాన పెట్టుబడిదారీ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు సాధారణ ప్రజా తంత్ర నినాదాలను వదిలిపెట్టి నేరుగా సోషలిజం కోసం పోరాడాలని కార్యక్రమం ఆదేశించింది. ఇది, కమ్యూనిస్టు పార్టీలు తమ పోరాటంలోకి కార్మికులు, రైతాంగం, ఇతర శ్రామిక ప్రజలను విస్తృత స్థాయిలో ఆర్షించే సామర్థ్యాన్ని దెబ్బతీసింది. 7వ మహాసభలో దీన్ని సరిచేసుకున్నది.

**29.** కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ మహాసభ 20వ శతాబ్దం దిశను మార్చిన అత్యంత ముఖ్యమైన చొరవను తీసుకుంది. 1935 జులై 25 నుండి ఆగస్టు 28 వరకు జరిగిన కొమింటర్న్ 7వ మహాసభ ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటన ఎత్తుగడలను ప్రతిపాదించింది. 65 సభ్య పార్టీల నుండీ, 19 సానుభూతి పర పార్టీల నుండి 530 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. ఐరోపాలోనూ, ఇతర చోట్లా ముందుకొస్తున్న ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, కమ్యూనిస్టే తరులతో ప్రజా ఐక్య సంఘటన నిర్మించాలని మహాసభ పిలుపు నిచ్చింది. ఫాసిజానికి అనేక ముఖాలున్నాయి, అది తన రూపాన్ని సులువుగా మార్చుకోగలదన్న వాస్తవాన్ని 7వ మహాసభ బయటపెట్టింది. రాజకీయ పార్టీలకు అతీతంగా విస్తారమైన ట్రేడ్‌యూనియన్లను ఏర్పాటు చేయాలనీ, వాటిని ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య పరచాలన్న ఆలోచనను మహాసభ ప్రోత్సహించింది.

ఫాసిజానికి వ్యతిరేకంగా ఏర్పడే ఐక్య సంఘటన ప్రభుత్వాల్లో పాల్గొనాలని కూడా మహాసభ సూచించింది. 7వ మహాసభ నిర్వహణలో జార్జి డిమిట్రోవ్ ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

డిమిట్రోవ్ తన ప్రసంగంలో భారత దేశానికి సంబంధించి ఈ క్రింది పరిశీలనలు చేశారు: “భారత దేశంలో కమ్యూనిస్టులు జాతీయ రిఫార్మిస్టు నాయకత్వాన్ని పక్కన పెట్టకుండా సామ్రాజ్యవాద–వ్యతిరేక ప్రజా

కార్యక్రమాలకు మద్దతివ్వాలి, వాటిలో పాల్గొనాలి. తమ రాజకీయ, సంస్థాగత స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటూనే అవి భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందిన సంస్థల్లోపల చురుకైన కృషి చేయాలి.” 7వ మహాసభ ఇచ్చిన ఈ మార్గదర్శనం సిపిఐ భారత దేశంలో సరైన రాజకీయ, ఎత్తుగడల పంథాను చేపట్టడానికి తోడ్పడింది.

గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన రజిని పామీ దత్, బెన్ బ్రాడ్లీలు 1936లో రూపొందించిన థీసీస్ భారత దేశ పరిస్థితులను అర్థం చేసుకోవ డానికి 7వ కొమింటర్న్ కాంగ్రెస్‌కు తోడ్పడింది. నాజీయిజం, ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూ నిస్టులు వివిధ రూపాల్లో, వివిధ కాలాల్లో చేసిన కృషి గురించి చాలా విపులంగా లిఖించబడి ఉంది. ఫాసిస్టు వ్యతిరేక పోరాట ఎత్తుగడలను రూపొందించడంలో 7వ కొమింటర్న్ మహాసభ దృక్పథం ఎంతో గొప్ప పాత్ర నిర్వహించింది.

**30.** మాలటోవ్ – రిబ్బెన్ ట్రోప్ ఒప్పందాన్ని సాధారణంగా సోవియట్ యూనియన్ కుదుర్చుకున్న ఒప్పందంగా పేర్కొంటుంటారు. సోవియట్ యూనియన్ నాడు ఒక త్రైపాక్షిక ఒప్పందం కోసం బ్రిటన్, ఫ్రాన్స్‌లతో చర్చలు జరిపిందని చరిత్ర మనకు చెబుతోంది. శత్రుదేశాలు సోవియట్ యూనియన్‌ను చుట్టుముడుతున్నాయన్న భయంతో ఈ ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. కానీ తమకు బద్ధ శత్రువైన కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోని సోవియట్ యూనియన్‌తో ఒప్పందం చేసుకోడానికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు సిద్ధపడలేదు. బ్రిటన్, ఫ్రాన్స్‌లతో చర్చలు విఫలమైన ఒక రోజు తరువాత 1939 ఆగస్టు 22న సోవియట్ యూనియన్ జర్మనీతో చర్చలు ప్రారంభించింది. చర్చలు ప్రారంభమైన ఒక్క రోజులోనే 1939 ఆగస్టు 23న నాజీ జర్మనీ, సోవియట్ యూనియన్ నిర్యుద్ధ సంధిపై సంతకాలు చేశాయి. సోవియట్ యూనియన్, జర్మనీ విదేశాంగ మంత్రలు మాలటోవ్, రిబ్బెన్‌ట్రోప్‌లు సంతకాలు చేశారు.

నాజీ జర్మనీ, సోవియట్ యూనియన్ల మధ్య ఈ సంధి ఎలా న్యాయ సమ్మతం అవుతుంది అని కొందరు మేధావులుగా చెప్పుకునే వారు ప్రశ్నిస్తుంటారు. ఆనాడు ప్రపంచంలో ఒకే ఒక్క సోషలిస్టు దేశం ఉండేదనీ, మొత్తం యూరప్ సామ్రాజ్యవాద శక్తులు తమ ఉమ్మడి సైనిక శక్తితో సోషలిజాన్ని మొగ్గలోనే తుంచేయడానికి అప్పటికే సైన్యాన్ని కదిలించాయన్న విషయాన్ని మనం

మరిచిపోరాదు. ఒకటి లేక ఎక్కువ శత్రు దేశాల నుండి సోవియట్ యూనియన్ వెంటనే గానీ కొద్ది కాలంలోగానీ దురాక్రమణను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్న విషయం సోవియట్ ప్రభుత్వానికి తెలుసు. దీన్ని ఎదుర్కొనేందుకు గాను ఆనాడున్న ఒకే ఒక్క సోషలిస్టు దేశం శత్రు దేశాల మధ్య నున్న వైరుధ్యాలను ఉపయోగించుకోదలచుకుంది. శత్రు దురాక్రమణను తన శక్తికొద్దీ ఎదుర్కొనడానికి కొంత సమయం తీసుకోవాలంటే ఈ పని చేయడం అవసరం. సరిగ్గా ఈ వ్యూహమే సోవియట్‌కు సహకరించింది. పదేళ్ల పాటు అమలులో ఉండేట్లు నిర్యుద్ధ సంధి కుదిరింది. కానీ ఎప్పుడైతే 1942 జూన్ 22న సోవియట్ యూనియన్‌పై నాజీ జర్మనీ దాడి చేసిందో ఈ నిర్యుద్ధ సంధి చెల్లకుండా పోయింది. నిర్యుద్ధ సంధితో నాజీ జర్మనీ దురాక్రమణను సోవియట్ యూనియన్ 23 మాసాల పాటు వాయిదా వేయగలిగింది. ఈ కాలంలో అది హిట్లర్ దురాక్రమణను ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నాహాలు చేసుకోడానికి ఉపయోగించుకుంది. అందువల్ల మాలటోవ్–రిబ్బెన్‌ట్రోప్ ఒడంబడిక సోవియట్ ప్రభుత్వం, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ వేసిన మహత్తర ఎత్తుగడ.

**31.** రెండవ ప్రపంచ యుద్ధం తీక్షణంగా సాగుతున్న 1943 జూన్‌లో కొమింటర్న్ రద్దయింది. కొమింటర్న్ అధ్యక్ష వర్గం ఈ క్రింది విధంగా చెప్పింది: "యుద్ధానికి చాలా కాలం ముందే ఆయా దేశాల్లోని అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితులు సంక్లిష్టంగా మారాయన్న విషయం అర్థమైంది. ప్రతి దేశంలోని కార్మికోద్యమ సమస్యలకు ఒక అంతర్జాతీయ కేంద్రం నుండి పరిష్కారాలు వెదకడానికి అనేక ఆటంకాలు ఏర్పడు తున్నాయి. కొమింటర్న్ తొలి మహాసభ రూపొందించుకున్న సంస్థాగత నిర్మాణ రూపానికి మించి పోయిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరికి ఈ రూపం జాతీయ వర్కర్స్ పార్టీల బలోపేతానికి ఆటంకంగా మారాయి కూడా."

కొమింటర్న్‌ను ప్రపంచ వ్యాపితంగా విప్లవ వ్యూహాలను రూపొందించి అమలు చేసే రాజకీయ సైద్ధాంతిక సంస్థాగత నాయకునిగా చూస్తున్న తరుణంలో అమెరికా, బ్రిటన్ నాయకులు సోవియట్ నేత జోసెఫ్ స్టాలిన్‌మీద ఒత్తిడి తెచ్చి కొమింటర్న్‌ను మూయించేశారన్న ఆరోపణలున్నాయి. కానీ వాస్తవం దానికి భిన్నంగా ఉంది. అత్యధిక కమ్యూనిస్టు పార్టీలు తమ స్వంత కాళ్లపై నిలబడగలిగేందుకు అవసరమైన అనుభవాన్ని గడించాయి.

కొమింటర్న్ కొన్ని చాలా ముఖ్యమైన కర్తవ్యాలు నెరవేర్చింది. అవి:

అ) ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో విప్లవ వెల్లువలకు సరైన ఆలోచన చేయడం, మార్గదర్శకత్వం వహించడం అతి ముఖ్యమైన పని. అదే విధంగా అది వివిధ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల ఏర్పాటుకు మార్గదర్శనం చేసింది.

ఆ) కొమింటర్న్ కోసం లెనిన్ రూపొందించిన కొలోనియల్ థీసీస్ వలస దేశాల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విముక్తి పోరాటాలకు పెద్ద ఊపునిచ్చింది.

ఇ) ఫాసిజానికి వ్యతిరేకంగా రూపొందించిన ఐక్య సంఘటన ఎత్తుగడలు ఫాసిస్టు భూతాన్ని ప్రపంచం ఎదుర్కొని ఓడించడానికి తోడ్పడ్డాయి.

ఈ) యుద్ధానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా శాంతి కోసం ఏర్పడిన ఐక్య సంఘటనల వల్ల ఐరోపాలోనూ, ప్రపంచ వ్యాపితంగానూ రచయితలు, కళాకారులు, మేధావులు, మానవతా వాదులతో ఒక విశాలమైన పురోగామి ఉద్యమం ఏర్పడింది.

ఉ) పైన పేర్కొన్న క్రమం, పరిణామాల ఫలితంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని వలస దేశాలు సామ్రాజ్యవాదుల పట్టునుండి విముక్తి చెందాయి. ఇది తరువాతి కాలంలో అలీనోద్యమం ఏర్పడ్డానికి తోడ్పడింది. ఈ ఉద్యమం మౌలికంగా సామ్రాజ్యవాద వ్యతిరేకమైనది.

**32.** కొమింటర్న్‌ను రద్దు చేసిన తరువాత ఐరోపాలోని మార్క్సిస్టు–లెనినిస్టు కమ్యూనిస్టు పార్టీల సమన్వయం కోసం 1947 అక్టోబర్ 5న కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమాచార బ్యూరో (కొమిన్ఫార్మ్)ను ఏర్పాటు చేశారు. దాని ప్రధాన కేంద్రం 1947–48లో యుగోస్లోవియా రాజధాని బెల్‌గ్రేడ్‌లోనూ తరువాత 1948 నుండి 1956 వరకు రొమేనియాలోని బుఖారెస్ట్ లోనూ ఉండేది. “జనతా ప్రజాస్వామ్యం కోసం, సుదీర్ఘ శాంతి కోసం” అనే పేరుతో అది ఒక పత్రికను నడిపింది. దీన్ని అనేక భాషల్లో ప్రచురించారు. వివిధ కమ్యూనిస్టు పార్టీల అనుభవాలను ఇచ్చిపుచ్చుకోవడం, అవసరమైన చోట కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమాలను పరస్పర అంగీకారంతో సమన్వయ పరచడం దీని ప్రకటిత లక్ష్యం. 1956లో జోసెఫ్ స్టాలిన్ మరణంతో కొమిన్ఫార్మ్ ప్రాముఖ్యత తగ్గించబడింది. కొమిన్ఫార్మ్‌ను రద్దు చేయాలని సిపిఎస్‌యు కేంద్ర కమిటీ 1956 ఏప్రిల్ 7న నిర్ణయించింది.

**33.** 1957 నవంబర్‌లో కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల ముఖ్య సమావేశం మాస్కోలో జరిగింది. మార్క్సిస్టు–లెనినిస్టు లక్షణాలు గల పార్టీల అతి పెద్ద సమావేశంగా దీన్ని చెబుతారు.

ఈ సమావేశంలో మావో జెడాంగ్ చేసిన ప్రసంగం ప్రకంపనలు సృష్టించింది. ఈ సమావేశంలో కూడా చైనా–సోవియట్ మధ్య విబేధాలు తలెత్తాయన్న విషయం గుర్తించాలి. సిపిఎస్‌యు ప్రతినిధివర్గానికి కృశ్చేవ్ నాయకత్వం వహించగా, మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి వర్గంలో డెంగ్ సియావోపింగ్ కూడా ఉన్నారు. మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం 40 వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సమావేశం జరిగింది. స్పష్టమైన కారణాల వల్ల ఈ సమావేశానికి యుగోస్లావియా సోషలిస్టు ఫెడరల్ రిపబ్లిక్ అధ్యక్షుడు మార్షల్ జోసిప్ బ్రోజ్ టిటో హాజరు కాలేదు. అప్పటికి ఇతర సోషలిస్టు దేశాలతో ఆయనకున్న విబేధాలు బహిరంగంగానే తెలుసు. సమావేశానికి ప్రపంచంలోని అన్ని దేశాలకు చెందిన 64 రాజకీయ పార్టీలు హాజరయ్యాయి. స్వదేశంలో నిషేధానికి గురవుతామనే భయంతోనో లేక నిషేధం లాంటి పరిస్థితులు ఉండబట్టో 4 పార్టీలు బయటకు చెప్పకుండా సమావేశానికి హాజరయ్యాయి.

**34.** 1960 జూన్‌లో బుఖారెస్ట్‌లో జరిగిన రుమేనియా వర్కర్స్ పార్టీ 3వ మహా సభ సందర్భంగా అక్కడ కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలిసారిగా చైనా కమ్యూనిస్టు పార్టీకీ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీకి మధ్య ఘర్షణ జరిగింది. 1957 కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను చైనా పార్టీ ఉల్లంఘించిందని వాదిస్తూ సోవియట్ పార్టీ ఒక పత్రాన్ని సమర్పించింది.

ఈ సమావేశానికి 51 పార్టీలు హాజరయ్యాయి. సోవియట్ పార్టీకి కృశ్చేవ్ నాయకత్వం వహించగా, చైనా పార్టీకి పెంగ్ జెన్ నాయకత్వం వహించారు. వియత్నాం వర్కర్స్ పార్టీ నాయకుడు లి దువాన్ ఏ పక్షం వహించకుండా తటస్థంగా ఉన్నారు. ఈ సమావేశం చాలా జాగ్రత్తగా ఏర్చి కూర్చిన పదాలతో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1960 మాస్కో సమావేశం గురించి ఈ సమావేశంలోనే ప్రకటించారు.

**35.** 1960 నవంబర్ నెలలో మాస్కోలో జరిగిన సమావేశానికి 81 కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీలు హాజరయ్యాయి. ఇందులో ఆమోదించిన తీర్మానాన్ని 1960 డిసెంబర్ 5న విడుదల చేశారు. తరువాత 1969లో మాస్కోలో కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల సమావేశం జరిగింది. అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల్లో చీలికల తరువాత ఈ సమావేశం జరిగింది. అందువల్ల 1969 సమావేశాన్ని

పగుళ్ల సమావేశంగా చెప్పవచ్చు. ఈ సమావేశానికి చైనా కమ్యూనిస్టు పార్టీ, వియత్నాం వర్కర్స్ పార్టీ, ఉత్తర కొరియా వర్కర్స్ పార్టీ, ఆల్బేనియా లేబర్ పార్టీలు హాజరు కాలేదు. భారత దేశం నుండి సిపిఐ హాజరైనప్పటికీ అందరికీ తెలిసిన కారణాల వల్ల సిపిఐ(ఎం)ను ఆహ్వానించలేదు, పార్టీకి కూడా హాజరవ్వాలన్న కోర్కె లేదు.

**36.** తూర్పు యూరప్, సోవియట్ యూనియన్‌లో ఎదురుదెబ్బలు తగిలి అవి విశ్ఛిన్నం అయిన తరువాత సిపిఐ(ఎం) చొరవ తీసుకుని "ప్రస్తుత ప్రపంచంలో మార్క్సిజం ప్రాసంగికత" అన్న అంశంపై చర్చించేందుకు గాను కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలను ఒక చోటకు తెచ్చింది. కారల్ మార్క్స్ 175వ జయంతిని పురస్కరించుకుని 1993లో కలకత్తాలో ఈ సదస్సు నిర్వహించింది. అంతకు ముందు 1992లో మద్రాసులో బిటి రణదివే నగర్‌లో జరిగిన సిపిఐ(ఎం) 14వ మహాసభలో ఆమోదించిన "కొన్ని సైద్ధాంతిక సమస్యలపై" అనే తీర్మానం ఆధారంగా ఈ అంతర్జాతీయ సదస్సులో పార్టీ తన అభిప్రాయాలు వెల్లడించింది.

దీని తరువాత 1998లో గ్రీసు కమ్యూనిస్టు పార్టీ ఇతర పార్టీలతో చర్చించి వివిధ ఖండాలలోని కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అభిప్రాయాలు, అనుభవాలను ఇచ్చిపుచ్చుకునేందుకు గాను గ్రీసులో ఒక సమావేశం జరిపింది. అప్పటి నుండి జరుగుతున్న ఈ సమావేశాల క్రమంలో ఇప్పుడు 119 సభ్య పార్టీలు పాలు పంచుకుంటున్నాయి. చివరి సారి 2019లో టర్కీలో సమావేశం జరిగిన తరువాత కోవిడ్ వల్ల ఇప్పటి వరకు సమావేశాలు జరగలేదు. 2022 అక్టోబర్ చివర తొలిసారిగా క్యూబా తన రాజధాని హవానాలో ఈ సమావేశం జరిపింది. 2009 డిసెంబర్ నుండి ఇంటర్నేషనల్ కమ్యూనిస్టు రివ్యూ అనే పత్రికను ఇంగ్లీషు, స్పానిష్‌లో నడపాలని అంతర్జాతీయ మార్క్సిస్టు కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీలు (ఐఎంసిడబ్ల్యుపి) నిర్ణయించాయి.

**37.** లియోన్ ట్రాట్‌స్కీ తప్పుడు సైద్ధాంతిక వైఖరిని పట్టుకు వేలాడుతున్న వారు 4వ ఇంటర్నేషనల్ నడుస్తోందని చెబుతున్నారు. కానీ దాని ప్రభావం ఏమీ లేదు. 1938లో ఫ్రాన్స్‌లో ఇది ఏర్పడినట్లు చెబుతుంటారు. అది కేవలం ఒక చర్చా సమాజం మాదిరిగా సాగుతుంది అంతే. కొన్ని దేశాల్లో అక్కడక్కడా వారికి కొంచెం ప్రభావం ఉందనేది వాస్తవం. బలహీనంగా ఉండడమే కాదు అప్పుడప్పుడూ వాళ్లు చీలికలను ఎదుర్కొంటుంటారు.

**38.** ఇటీవల ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ అనేదాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఇది కూడా అంతగా చొచ్చుకుపోవడం గానీ, ప్రభావం చూపడం గానీ లేదు. ఇందులో యూనిస్ వారోఫాకిస్, జెరెమి కార్బిన్, స్లావోజ్ జిజెక్, తారిక్ ఆలీ వంటి కొంతమంది ప్రఖ్యాత అభివృద్ధి కాముక మేధావులు ఉన్నారు. 2020 సెప్టెంబర్‌లో ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ (పిఐ) "అంతర్జాతీయతా లేక అంతరార్థమా" అనే పేరుతో ప్రారంభ శిఖరాగ్ర సభ జరిపింది. నోమ్ చోమ్‌స్కీ కీలకోపన్యాసం చేశారు.

**39.** మన పాఠ్యాంశంలో భాగంగా మనం కమ్యూనిస్టు ఉద్యమంలోని కొన్ని తప్పుడు ధోరణును గురించి చర్చించాలి. యూరో– కమ్యూనిజం (ఇసి) అనేది ఇందలో ఒక ధోరణి. మార్క్సిజం–లెనినిజాన్ని సంస్కరించడం, ప్రజాస్వామీకరించడం అనే పేరుతో యూరో– కమ్యూనిస్టులు కార్మికవర్గం, వర్గ పోరాటం, కార్మికవర్గ నియంతృత్వం వంటి కమ్యూనిస్టు మౌలిక సూత్రాలను తిరస్కరిస్తారు. స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ కమ్యూనిస్టు పార్టీల్లోని పెద్ద సెక్షన్లు ఈ పెడధోరణితో ఉన్నారు. జపాన్ కమ్యూనిస్టు పార్టీ కూడా ఇటువంటి ధోరణులు కలిగి ఉంది. ఐరోపాలో కమ్యూనిస్టు పార్టీల పతనానికి యూరో–కమ్యూనిస్టు పెడధోరణి కూడా కొంత కారణమైంది.

**40.** బ్రౌడెరిజం అనేది మరో మార్క్సిస్టేతర పెడపోకడ. అమెరికా కార్మికవర్గ ఉద్యమంలో ఇది తలెత్తింది. ఎర్ల్ బ్రౌడెర్ (1891–1973) నాయకత్వంలో 'కమ్యూని జాన్ని అమెరికా పరిస్థితులకు అనుగుణంగా మార్చడం' అనే పేరుతో ఆయన అమెరికా కమ్యూనిస్టు పార్టీ (సిపియుఎస్ఎ) కార్యక్రమాన్ని సమూలంగా మార్చేశారు.

సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ ప్రపంచానికీ, సోషిలిస్టు దేశాల సమూహానికీ మధ్య శాంతియుత సహజీవనం, పూర్తి సహకారం కొనసా గించాలని ఆయన చెప్పారు.

**41.** డెంగ్ సియావో పింగ్ నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతిపాదించిన మూడు ప్రపంచాల సిద్ధాంతం మరో తప్పుడు భావన. చాలా విజయవంతమైన కమ్యూనిస్టు పార్టీ దీన్ని ప్రతిపాదించింది. దీని ప్రకారం మొదటి రెండు ప్రపంచాలు రెండు అగ్ర రాజ్యాలు, అమెరికా, సోవియట్ యూనియన్. అయితే మూడో ప్రపంచ యుద్ధానికి సోవియట్ యూనియన్ ప్రధాన కారకురాలవుతుంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు, అందులోని

ప్రజలు మూడో ప్రపంచం. ఇది ప్రధానమైన సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తి. రెండవ స్థాయి సామ్రాజ్యవాద శక్తులైన ఐరోపా, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్‌లు ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో మూడవ ప్రపంచానికి మిత్రులుగా ఉంటారు. చైనా కమ్యూనిస్టు పార్టీ పట్ల, మహత్తర చైనా విప్లవం పట్ల అత్యంత గౌరవం ఉంచుతూనే సిపిఐ(ఎం) అప్పట్లో సిపిసి వెల్లడించిన ఈ మార్క్సిస్టేతర అంచనాతో బహిరంగంగానే విబేధించింది.

**42.** సిపిఎస్‌యు 20వ మహాసభ, అందులో కృశ్చేవ్ నివేదిక తరువాత అనేక వివాదాలు తలెత్తాయి. మూడు 'శా'ల సిద్ధాంతం అంటే శాంతియుత సహజీవనం, శాంతియుత పోటీ, శాంతియుత పరివర్తన అనేది మరో వివాదంగా మారి దానిపై తీవ్రమైన చర్చలు జరిగాయి. ఇవన్నీ తీవ్రమైన విబేధాలుగా మారాయి. జోసెఫ్ స్టాలిన్ పాత్ర కూడా పెద్ద రగడకు కారణమైంది. 1956 జులై 1 నుండి 12 వరకు న్యూ ఢిల్లీలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం దీనిపై ఒక తీర్మానం ఆమోదించింది. ఆ తీర్మానం శీర్షిక: సోవియట్ కమ్యూనిస్టు పార్టీలో వ్యక్తి ఆరాధనకు వ్యతిరేకంగా పోరాటం, ఈ సమస్యపై సమతుల్యమైన, గతితార్కిక వైఖరి అవసరం. 1968లో పశ్చిమ బెంగాల్‌లోని బర్ద్వాన్‌లో జరిగిన సిసిఐ(ఎం) ప్లీనం సమావేశం అనేక సైద్ధాంతిక సమస్యలపై చర్చించి, వివాదాస్పద అంశాలపై మార్క్సిస్టు–లెనినిస్టు వైఖరితో వివరణలు ఇచ్చింది.

**43.** రష్యా, చైనా, వియత్నాం, కొరియా, క్యూబాలో జయప్రదమైన సోషలిస్టు విప్లవాల అనుభవాలను అంచనా వేయాలంటే ఇంకా లోతుగా అధ్యయనం చేయాలి. ఆ దేశాల్లో వ్యూహాలు, ఎత్తుగడలపై కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు వేసిన అంచనాలు మనకు మంచి గుణపాఠాలు నేర్పుతున్నాయి. ఈ విప్లవాల విజయం కోసం కార్మికవర్గ పార్టీలు వివిధ పెడపోకడలకు వ్యతిరేకంగా పోరాడాల్సింది.

**44.** విప్లవ పోరాటానికి తగిలిన ఎదురు దెబ్బల గురించి కూడా అంతకన్నా ఎక్కువ కాకపోయినా సమానంగా, జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. అందువల్ల మనం భవిష్యత్తులో ఇటువంటివి మళ్లీ తలెత్త కుండా మన శక్తి కొద్దీ జాగ్రత్తవహించగలుగుతాము. సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపాల్లో ఏం జరిగిందో లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది. దీనిపై చెన్నైలో జరిగిన సిపిఐ(ఎం) 14వ మహాసభ ఒక తీర్మానం ఆమోదించింది. ఈ ఎదురుదెబ్బలు శాస్త్రీయ సోషలిజంలో లోపాల వల్ల తగిలినవి కావనీ, వివిధ ప్రాంతాల్లో,

వివిధ కాలాల్లో దాన్ని అశాస్త్రీయంగా అమలు చేయడం వల్ల తగిలినవనీ తీర్మానం స్పష్టంగా పేర్కొంది.

అదేవిధంగా పోర్చుగల్, గ్రీస్, ఇండోనీషియా, స్పెయిన్ (స్పానిష్ అంతర్యుద్ధం), చిలీ (1973)లో విప్లవోద్యమాలను అణచివేయడం కూడా కమ్యూనిస్టులకు మరో గుణపాఠం.

నేపాల్ అనుభవం ఒక ప్రత్యేక కేసు. నేపాల్ ఎన్నికల్లో వివిధ కమ్యూనిస్టు స్రవంతులు ఐక్యంగా పోరాడి, మహత్తరమైన విజాయాలు సాధించారు. ఇప్పుడు వాళ్లు మళ్లీ ముక్కలుగా విడిపోయి ప్రభుత్వాన్ని నేపాల్ కాంగ్రెస్‌కు అప్పగించారు.

**45.** లాటిన్ అమెరికా దేశాల్లో విస్తారమైన వామపక్ష సంఘటనలు ఏర్పడ్డం, కమ్యూనిస్టుల పాత్ర ప్రస్తుత ప్రపంచంలో ఒక ముఖ్యమైన లక్షణంగా ఉంది.

దక్షిణాఫ్రికాలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని పాలక సంఘటనలో భాగంగా ఉంది. ఈ ప్రయోగాలు, అనుభవాలు ఇచ్చే గుణపాఠాలు కూడా విలువైనవే.

**46.** ఈరోజు ప్రపంచంలోని ప్రతి అయిదుగురిలో ఒక వ్యక్తి దోపిడీ, పీడనలు లేని సమసమాజం సృష్టించేందుకు కృషి చేస్తున్న సమాజంలో నివసిస్తున్నాడు. సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ కూడా ఇందులో భాగంగా ఉన్నప్పుడు ఇటువంటి వారు ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు ఉండేవారు.

**47.** అయితే సమసమాజాన్ని బలోపేతం చేస్తూ, నిర్మించేందుకు జరిగే ఈ కృషిని నిరంతరాయంగా కొనసాగించడం కష్టంతో కూడుకున్నది, చాలా పట్టుదల కావలసింది. అది గతంలో ఎన్నడూ ఎరుగని మార్గం. ఆ మార్గంలో అనేక గోతు లున్నాయి, వంకరటింకరులున్నాయి, వెంట్రుకవాసి మలుపు లున్నాయి. ఇందులో అనేక అవకాశాలున్నాయి, వక్రీకరణలున్నాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే నిరంతరం జాగరూకతతో ఉండడం, శాస్త్రీయమైన ధోరణి, ప్రజాపంథాలు మాత్రమే మార్గం.

**48.** అంతర్జాతీయ, జాతీయ ప్రాముఖ్యత గల తీవ్రమైన ప్రతి అంశంపైనా సిపిఐ (ఎం) తీసుకున్న వైఖరి చాలా వరకు సరైనదేనని నిరూపించబడింది. విఐ లెనిన్ సాంప్రదాయం మాది అని చెప్పుకునే పార్టీని గానీ, మావో

జెడాంగ్ ప్రతిష్ట మాది అని చెప్పుకునే పార్టీని గానీ సిపిఐ(ఎం) ఏనాడూ గుడ్డిగా అనుసరించలేదు. సిపిఐ(ఎం) నిరంతరం పరిస్థితులను నిర్మొహ మాటంగా సరైన పద్ధతిలో అంచనా వేసి, మన స్వంత స్వతంత్ర నిర్ధారణలకు వచ్చింది.

**49.** మనం మూడు ఇంటర్నేషనల్స్‌ను పరిశీలించినా, వివిధ విప్లవోద్యమాల చరిత్రను పరిశీలించినా అవన్నీ చారిత్రక భౌతికవాద సిద్ధాంతం సరైనదేనని నిరూపి స్తున్నాయని తెలుసుకుంటాం. ఏదీ నిశ్చలంగా ఉండదు. ప్రతిదీ అంతస్సంబంధాలు కలిగి ఉంటుంది. మనం మన వ్యూహాన్ని, ఎత్తుగడలనూ శాస్త్రీయంగా రూపొందిస్తే మంచి పురోగతి లభిస్తుంది. అందులో విఫలమైతే ఎదురుదెబ్బలు తింటాం. కార్మికులు, రైతాంగం, శ్రామిక ప్రజల నుండి నేర్చుకుంటూ వారిని ఒప్పించడం అనేది అతి ముఖ్యమైన నిర్మాణ కృషి. ఎదురుదెబ్బలకు మనం ధైర్య విడనాడకూడదు. మనం సరైన గుణపాఠాలు నేర్చుకుని సుదీర్ఘ పోరాటాలను కొనసాగించాలి. అదేవిధంగా, మన విజయాలను మనం అతిగా అంచనా వేసుకోకూడదు. అది మనల్ని చివరికి వైఫ ల్యాల బాటలో పడేస్తుంది. మన వర్గ వైఖరిని ఏనాడూ విడనాడకూడదు. భౌతికవాద విశ్లేషణతో చారిత్రక ధోరణిని ముందుకు తీసుకుపోవాలి.

**50.** ఈ సందర్భంగా విఐ లెనిన్ చెప్పిన క్రింది మాటలు ఎల్లవేళలా గుర్తుంచు కోదగ్గవి:

"మార్క్స్ సిద్ధాంతాన్ని మనం పూర్తయిపోయినదిగా, అనుల్లంఘనీయ మైనదిగా పరిగణించరాదు. దానికి బదులు అది కేవలం సైన్సుకు పునాది రాళ్లు మాత్రమే వేసిం దనీ, సోషలిస్టులు జీవితంతో పోటీపడి ముందుకు పోవాలనుకుంటే దాన్ని అన్ని దిశల్లో అభివృద్ధి చేయాలనీ నమ్ముతాం.

మార్క్సిస్టు సిద్ధాంతం సాధారణ మార్గదర్శక సూత్రాలను మాత్రమే అందిస్తుంది. అవి ఇంగ్లండులో ఒకలాగా, ఫ్రాన్స్‌లో మరోలాగా అమలవుతాయి. ఫ్రాన్స్‌లో అమల యినట్లు జర్మనీలో అమలుకావు. జర్మనీలో అమలయ్యేట్లు రష్యాలో అమలు కావు. అందువల్ల ముఖ్యంగా రష్యన్ సోషలిస్టులు ఈ సిద్ధాంతాన్ని స్వతంత్రంగా అమలు చేయాల్సి ఉంటుంది. అందువల్ల సైద్ధాంతిక సమస్యలపై వ్యాసాలకు మన పత్రికలో ఆనందంగా స్థలం ఇవ్వాలి. వివాదాస్పద పాయింట్లపై కామ్రేడ్స్ అంతా బహిరంగంగా చర్చించడానికి మనం ఆహ్వానించాలి."

అధ్యయనం చేయదగ్గ ముఖ్యమైన పుస్తకాలు:

1) కమ్యూనిస్టు ప్రణాళిక (దాని ముందు మాటలు చదవడం అంతే ముఖ్యం)
2) తొలి ఇంటర్నేషనల్‌లో కారల్ మార్క్స్ చేసిన ప్రారంభోపన్యాసం
3) కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో విఐ లెనిన్ ప్రసంగాలు
4) మూడు ఇంటర్నేషనల్స్ చరిత్ర, విలియమ్ జెడ్. ఫోస్టర్; ఇంటర్నేషనల్ పబ్లిషర్స్, న్యూయార్క్.
5) ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సంక్షిప్త చరిత్ర, ఎన్.రామకృష్ణ
6) ఐరోపా కమ్యూనిజం (1948-1991), రొనాల్డ్ కోవల్‌స్కీ (అనుకూలమైన పుస్తకం కాదు కానీ సమాచారానికి ఉపయోగపడుతుంది)
7) త్రిస్ట్ విత్ సోషలిజం, ఆర్.అరుణ్ కుమార్, ప్రజాశక్తి బుక్‌హౌస్
8) థియరీ అండ్ టాక్టిక్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ కమ్యూనిస్టు మూవ్‌మెంట్, ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో
9) ది న్యూ మోల్:పాథ్స్ ఆఫ్ ది లాటిన్ అమెరికన్ లెఫ్ట్, ఎమిర్ సాదెర్
10) హిస్టరీ ఆఫ్ ది సిపిఎస్‌యు (బి)
11) హిస్టరీ ఆఫ్ ది చైనీస్ కమ్యూనిస్టు పార్టీ, ఫారిన్ లాంగువేజెస్ ప్రెస్, బీజింగ్
12) హిస్టరీ విల్ అబ్జాల్వ్ మి, ఫైడల్ కాస్ట్రో
13) బర్ద్వాన్ ప్లీనంలో ఆమోదించిన సైద్ధాంతిక తీర్మానం, 1968
14) కొన్ని సైద్ధాంతిక సమస్యలపై తీర్మానం, సిపిఐ(ఎం) 14వ మహాసభ, 1992, చెన్నయ్
15) కొన్ని సైద్ధాంతిక అంశాలపై తీర్మానం, సిపిఐ(ఎం) 20వ మహాసభ, కోజికోడ్, 2012

* * *

ప్రతులు : 1000
ప్రచురణ కాలం : డిసెంబర్, 2023
వెల : ₹ . 30 /-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ -520 002,

ఫోన్ నెం. 0866 2577202, 9490098000

*web : www.cpimap.org*